www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 292
సోమవారం | 20-1-2025
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: షష్టి ఉ. 9.59 తదుపరి సప్తమి; నక్షత్రం: హస్త రా. 8.30 తదుపరి చిత్ర; వర్జ్యం: తె.5.53 మొదలు; దుర్ముహూర్తం: మ.12.48-1.32; అమృతఘడియలు: మ.1.45-3.33; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.00
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఏఐ.. నాయకా!!

రాజకీయ నేతల బదులు.. భవిష్యత్తులో కృత్రిమ మేధ పాలన?

పాశ్చాత్యదేశాల్లో ఈ ప్రతిపాదనపై ఐదారేళ్లుగా విస్తృత చర్చ

2018లో పుతిన్ ప్రత్యర్థిగా 'అలీసా' అనే చాట్‌బాట్ తెరపైకి

టోక్యోలో మేయర్ ఎన్నికల్లో హ్యూమనాయిడ్ రోబో పోటీ

ఏఐ అల్గారిథమ్స్ ద్వారా జరిపే పాలనకు 'అల్గోక్రసీ'గా పేరు

2

మనం ఏ ప్రశ్న అడిగినా ఠక్కున జవాబిచ్చే చాట్‌జీపీటీ.. వాట్సా‌ప్‌లో కనిపించే మెటా ఏఐ.. ఇవన్నీ ఎన్నికల్లో పోటీ చేస్తే? కేంద్రంలో మోదీకి పోటీగా ప్రధాని పదవికి పోటీ పడితే.. ఇక్కడ రేవంత్‌కో, చంద్రబాబుకో ప్రత్యర్థిగా రంగంలోకి దిగితే? ఊహించడానికే వింతగా ఉంది కదూ! మనకు కొత్తగా అనిపించొచ్చుగానీ.. పాశ్చాత్య దేశాల్లో ఇప్పటికే ఈ ప్రతిపాదనపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి! 'ఏమో.. గుర్రం ఎగరావచ్చు' అన్న నానుడి చందంగా.. ఇప్పటికి ప్రతిపాదన దశలోనే ఉన్న ఈ ఆలోచన భవిష్యత్తులో నిజం కావొచ్చు! ఏమో.. ఏఐ ఎప్పటికైనా ప్రధాని కుర్చీ ఎక్కావచ్చు!!

త్వరలో పాడ్ కార్లు



బ్యాటరీ లేదా విద్యుత్తుతో పాడ్‌కార్ పనిచేస్తుంది. ఒక పాడ్‌కార్‌లో 6-8 మంది ప్రయాణించవచ్చు.

డ్రైవర్లు ఉండరు. ప్రయాణికులు టచ్ ప్యాడ్ల మీద తమ గమ్యస్థానాన్ని ఎంచుకోవచ్చు. వేగం గంటకు 40 కి.మీ.

ప్రస్తుతం ముంబైలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ మధ్య పాడ్‌కార్ కారిడార్ వ్యవస్థ నిర్మితమవుతోంది.

2 ఎలివేటెడ్ కారిడార్లలో 14.8 కి.మీ.లలో ఏర్పాటు

1,480 కోట్ల రూపాయల అంచనా వ్యయం

ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్‌జామ్‌కు చెక్

రోజూ లక్ష మంది ప్రయాణం

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రణాళిక.. డీపీఆర్ సిద్ధం

త్వరలో సర్కార్‌కు అందజేత

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ట్రాఫిక్ జామ్.. నత్తను తలపించే వేగం..! ఈ పరిస్థితికి మెట్రోరైల్ కొంత వరకు చెక్ పెట్టినా.. ఐటీ కారిడార్‌లో మెట్రో స్టేషన్ల నుంచి కార్యాలయాలకు చేరుకోవడం గగనంగా మారే పరిస్థితి..! మెట్రో స్టేషన్ నుంచి నేరుగా కార్యాలయాలకు.. బహుళ జాతి సంస్థల్లో విధులకు.. బహుళ అంతస్తుల భవనాలకు ప్రత్యేక మార్గాల్లో నేరుగా వెళ్లగలిగితే ఎలా ఉంటుంది? అచ్చంగా ఇలాంటి వ్యవస్థనే నగరంలో అందుబాటులోకి తీసుకురావాలని హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్(హెచ్ఎంఆర్ఎల్) సంకల్పించింది. పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్(పీఆర్‌టీ) లేదా పాడ్‌ట్యాక్సీ పేరుతో కొత్త రవాణా వ్యవస్థను పరిచయం చేయాలని నిర్ణయించింది. ఈ వ్యవస్థలో భాగంగా పాడ్ కార్ లేదా పాడ్ ట్యాక్సీలను పరిచయం చేసి.. ప్రత్యేక కారిడార్లలో వాటిని నడిపేందుకు రూ.1,480 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ నెలాఖరులోగా లేదా ఫిబ్రవరి మొదటి వారంలో డీపీఆర్‌ను ప్రభుత్వానికి సమర్పించి, అనుమతులు, నిధులు కోరనున్నట్లు తెలుస్తోంది. రెండో దశ మెట్రోరైల్ ప్రాజెక్టు పూర్తయ్యేలోగా(2029 లక్ష్యం) పాడ్ కార్లను

మిగతా 14వ పేజీలో...

సింగపూర్ బోటులో.. మూసీ తలపులో..

సింగపూర్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం అక్కడి నదిలో బోటులో ప్రయాణించారు. హైదరాబాద్‌లో మూసీ నది సుందరీకరణ ప్రయత్నాల్లో ఉన్న సీఎం.. సింగపూర్ సిటీ స్టేట్ రివర్ పునరుజ్జీవానికి అక్కడి ప్రభుత్వం చేపట్టిన చర్యలను పరిశీలించారు. నదిలో పడవలో ప్రయాణిస్తూ.. అక్కడి అధికారులు అవలంబించిన విధానాలను తెలుసుకున్నారు. కొత్త ఐకానిక్ భవనాలు, కార్యాలయాలు, నివాసాలను అభివృద్ధి చేసే ప్రయత్నంలో చారిత్రక కట్టడాలను సంరక్షిస్తూ, నీటి నిర్వహణలో గొప్ప పురోగతి సాధించడం చరిత్రాత్మకమని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ వీడియోను సీఎం తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.



ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్!

పది రోజులుగా నిలిపివేసిన నెట్‌వర్క్ ఆస్పత్రులు

కౌంటర్లను మూసివేసిన ప్రైవేటు హాస్పిటళ్లు

ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించనందునే..

త్వరలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సేవల నిలిపివేత?

వైద్య చికిత్సలు లేక పేద రోగుల ఇబ్బందులు

ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు

ప్రభుత్వం తీరు దురదృష్టకరం: హరీశ్‌రావు

బీఆర్ఎస్ హయాంలో చెల్లించనందునే పెండింగ్

ఏడాదిలో రూ.1130 కోట్లు చెల్లించాం.. సమస్యను పరిష్కరిస్తాం: దామోదర



హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. పది రోజులుగా రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆస్పత్రులన్నీ డయాలసిస్ లాంటి అత్యవసర సేవలు మినహా.. మిగిలిన అన్ని రకాల సేవలనూ నిలిపివేశాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లోని ఆరోగ్యశ్రీ కౌంటర్లను యాజమాన్యాలు మూసివేశాయి. దీంతో పేద రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు పట్టుకుని ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే చికిత్స లభిస్తుందన్న ధీమా ఇప్పుడు రోగుల్లో కనిపించడం లేదు. గతంలో ఆరోగ్యశ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు పొందిన రోగులు.. ఇప్పుడు ఈ పథకం పరిధి రూ.10 లక్షలకు పెరిగినా ఉపయోగం లేకుండాపోతోందని వాపోతున్నారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో గత వారం రోజులుగా అత్యవసరమైతే తప్ప.. ఇతర వైద్య సేవల కోసం రోగులు ఆస్పత్రులకు వెళ్లలేదు. దాంతో అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు ఆస్పత్రుల్లో ఓపీ, ఐపీ భారీగా పడిపోయాయి. మళ్లీ ఇప్పుడు రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. అయితే ఆస్పత్రులకు వచ్చిన రోగులకు ఆరోగ్యశ్రీ కింద

మిగతా 12వ పేజీలో...

భారీ ఐటీ పార్కు

రూ.450 కోట్లతో హైదరాబాద్‌లో నిర్మాణానికి అంగీకారం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో సింగపూర్ కంపెనీ క్యాపిటల్ ల్యాండ్ ప్రకటన

ఈ సంస్థకు హైదరాబాద్‌లో ఇప్పటికే 3 యూనిట్లు

ముగిసిన సీఎం సింగపూర్ పర్యటన

రాష్ట్రానికి రూ.3,950 కోట్ల పెట్టుబడులు

నేడు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు రేవంత్ బృందం

ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు హాజరు

దావోస్‌లో పెట్టుబడులపై భారత్ భారీ ఆశలు

సదస్సుకు ఐదుగురు కేంద్ర మంత్రులు, ముగ్గురు సీఎంలు, 100కు పైగా సీఈవోలు

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. రూ.450 కోట్లతో కొత్త ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకు వచ్చింది. సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఐటీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. బ్లూచిప్ కంపెనీలు కోరుకునే ప్రీమియం సదుపాయాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందుకునేలా అన్ని సౌకర్యాలు ఈ ఐటీ పార్కులో ఉండనున్నాయి. సింగపూర్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ.. హైదరాబాద్‌లో తమ పెట్టుబడుల నిర్ణయాన్ని ప్రకటించింది. సింగపూర్ కేంద్రంగా

మిగతా 13వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ అవకాశం

కొత్త రేషన్ కార్డులు, మార్పులు చేర్పులకు కూడా..

గతంలో దరఖాస్తు చేసుకోని వారికి మరో చాన్స్ 13

రేపటి నుంచి 24 వరకు గ్రామ సభల్లో స్వీకరణ

కాల్పుల విరమణతో.. గాజాలో ప్రశాంతత

ముగ్గురు బందీల పేర్ల విడుదలలో హమాస్ ఆలస్యం

అప్పటివరకు దాడులు జరిపిన ఇజ్రాయెల్.. 26 మంది మృతి

తేడాలొస్తే మళ్లీ యుద్ధం: నెతన్యాహు

2



సైఫ్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడు!

థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో అరెస్టు, కోర్టులో హాజరు

ఐదు రోజుల పోలీసు కస్టడీకి న్యాయస్థానం అనుమతి

పోలీస్ అకాడమీలో ఇండోర్ షూటింగ్ రేంజ్

వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా 13

బాబుకు మోదీ కొండంత అండ

6 నెలల్లోనే ఏపీకి 3 లక్షల కోట్లు

ఏపీలో ఎన్డీఆర్ఎఫ్ వేడుకల్లో షా

ట్రంప్ వచ్చేస్తుండు

హెచ్1బీ నుంచి పనామా కాలువ, గ్రీన్‌లాండ్ స్వాధీనం దాకా పలు అంశాలపై వివాదాస్పద వ్యాఖ్యలు

చైనా, భారత్ వాణిజ్య పన్నులపైనా ధ్వజం.. రివెంజ్ ట్యాక్స్‌ల హెచ్చరిక

ఉక్రెయిన్, గాజా యుద్ధాలపై ట్రంప్ 2.0 పాలన ప్రభావం!

భారత కాలమానం ప్రకారం నేటి రాత్రి 10.30కి ట్రంప్ ప్రమాణం

హాజరుకానున్న మస్క్, జుకర్‌బర్గ్

ట్రంప్ విందుకు ముఖేశ్, నీతా



వాషింగ్టన్‌లో ట్రంప్‌తో ముఖేశ్, నీతా అంబానీ

మొండివాడు రాజు కన్నా బలవంతుడంటారు! కానీ.. మొండివాడే రాజైతే? విషయం ఏదైనా నిక్కచ్చిగా అభిప్రాయం చెప్పి.. నిర్మొహమాటంగా నిర్ణయాలు తీసుకునే డొనాల్డ్ ట్రంప్‌ను ఆయన విమర్శకులు 'మొండివాడు' అనే అంటారు!! అలాంటి ట్రంప్.. అమెరికా అధ్యక్షుడిగా సోమవారం మళ్లీ బాధ్యతలు చేపట్టనున్నారు. అమెరికా అధ్యక్షుడంటే

మిగతా 2వ పేజీలో...

ఎవరి ఖిల్లానో ఢిల్లీ?

- అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య ముక్కోణపు పోటీ
- గత అసెంబ్లీ, ఇటీవలి లోక్‌సభ ఎన్నికలకు పార్టీల ఓట్ల శాతాల్లో భారీ తేడా
- మెరుగుపడ్డ బీజేపీ, కాంగ్రెస్.. మళ్లీ గెలుపుపై ఆమ్ ఆద్మీ పార్టీ ధీమా
- నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు.. 5న పోలింగ్



న్యూఢిల్లీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మురికివాడల్లోని జనం, ఆటో, క్యాబ్ డ్రైవర్లు, కార్మికులు ఆప్ వైపు! మధ్యతరగతి, ఉన్నతవర్గాల ప్రజలు కమలం పార్టీ వైపు! మైనారిటీలేమో కాంగ్రెస్‌వైపు, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ వర్గాల్లో ఎవరు ఏవైపు ఉన్నారు? అనే ప్రశ్నకు ఈ విశ్లేషణలే వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోరు తప్పదనిపిస్తోంది! నామినేషన్ల

మిగతా 3వ పేజీలో...

ఏ..ఐ.. నాయకా!!



రాజకీయ నాయకులకు బదులుగా.. భవిష్యత్తులో కృత్రిమ మేధ పాలన?

- 2017లో న్యూజిలాండ్‌లో తొలి వర్చువల్ నేత 'శామ్' సృష్టి
- గత ఏడాది యూకే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా.. 'ఏఐ స్టీవ్'

ఆరోగ్య సంరక్షణ.. బ్యాంకింగ్.. కోడింగ్.. ఈ-కామర్స్.. వ్యవసాయం.. అందుగలదు ఇందులేదని సందేహం అక్కర్లేదు.. కృత్రిమ మేధ ఇప్పుడు అన్ని రంగాల్లోకీ చొచ్చుకొచ్చేస్తోంది.. రాజకీయంతో సహా!! ఏఐ అనగానే.. మానవుల పనిని సులభతరం చేసే కోడింగ్‌గానో (చాట్‌జీపీటీలాంటివి).. స్మార్ట్‌ఫోన్‌లో మనకు కావాల్సిన సమాచారం అందించే వర్చువల్ అసిస్టెంట్‌గానో.. భౌతికంగా పనిచేసి పెట్టే రోబోలుగానో (ఆండ్రాయిడ్లు) భావిస్తున్నాం. ఒక్కముక్కలో చెప్పాలంటే.. ఇన్నాళ్లుగా మనం కృత్రిమ మేధను మనిషికి సహాయకారిగానే పరిగణిస్తూ వస్తున్నాం. కానీ.. అదే ఏఐని పొలిటీషియన్‌గా మార్చి ప్రజల జీవితాలనే మార్చేసే నిర్ణయాలు తీసుకునే స్థాయి దానికి కల్పిస్తే? ఇలా ఏఐ అల్గారిథమ్స్ ద్వారా పాలించడాన్ని 'అల్గోక్రసీ'గా నిపుణులు వ్యవహరిస్తున్నారు. ఈ ప్రతిపాదనపై పాశ్చాత్య దేశాల్లో ఐదారేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. ఎందుకంటే.. రాజకీయ నాయకుల కన్నా కృత్రిమ మేధ తీసుకునే నిర్ణయాలే నిష్పక్షపాతంగా, నిజంగా ప్రజలకు మేలు చేసే విధంగా ఉంటాయన్నది 'అల్గోక్రసీ'ని బలపరిచేవారి వాదన. ఏఐకి ఏ ఒక్క వర్గం మీదనో ప్రత్యేకంగా ప్రేమ ఉండదని.. సగటు రాజకీయనాయకుల్లాగా ఓటు బ్యాంకును బలపరచుకోవడం కోసం నిర్ణయాలు తీసుకోదని.. డబ్బు, పేరు ప్రతిష్ఠల కోసం పాకులాడదని.. దేశ సమగ్ర అభివృద్ధిని మాత్రమే దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటుందని వారు చెబుతారు. ఈ క్రమంలోనే.. కొన్ని దేశాల్లో జరిగిన ఎన్నికల్లో వర్చువల్ పొలిటీషియన్ల పేర్లు బలంగా తెరపైకి వచ్చాయి! ఉదాహరణకు 2017లో.. న్యూజిలాండ్‌కు చెందిన నిక్ గెర్రిట్సెన్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 'శామ్' అనే పేరుతో మానవ చరిత్రలోనే తొలి వర్చువల్ పొలిటీషియన్‌ను సృష్టించాడు. ఆయన దానికి 'భవిష్యత్తు రాజకీయ నాయకుడు' అని పేరుపెట్టాడు. చాట్‌జీపీటీ తరహాలోనే... 'శామ్'ను ప్రజలు ఏ ప్రశ్న అడిగినా, అది తన వద్ద ఉన్న డేటాను విశ్లేషించి సమాధానం ఇస్తుంది. అయితే అలాంటి వర్చువల్ పొలిటీషియన్లు ఎన్నికల్లో పోటీ చేయడానికి చట్టాలు అనుమతించవు కాబట్టి ఇప్పటిదాకా అది అక్కడ ఎన్నికల బరిలోకి దిగలేదు. 2018లో రష్యాలో జరిగిన ఎన్నికల్లో పుతిన్‌కు పోటీగా.. 'యాండెక్స్' కంపెనీ అభివృద్ధి చేసిన అలీసా అనే చాట్‌బాట్‌ను ఒక వ్యక్తి నామినేట్ చేశాడు. ఒక్కరోజు వ్యవధిలోనే పాతికవేల మందికిపైగా రష్యన్లు దానికి తమ మద్దతు తెలపడం విశేషం. అదే ఏడాది టోక్యోలో.. ఒక హ్యూమనాయిడ్ రోబో టోక్యోలో మేయర్ ఎన్నికల్లో పోటీకి దిగింది. దాన్ని అభివృద్ధి చేసిన 'మికిహిటో మత్సుదా' దాని ప్రతినిధిగా వ్యవహరించి పెద్ద ఎత్తున ప్రచారం కూడా చేశాడు. అప్పట్లో ఆయన తన ప్రచారంలో.. ఆ హ్యూమనాయిడ్ రోబోను ఒక 'ఆబ్జెక్టివ్ ఎంటిటీ'గా ప్రజల్లోకి తీసుకెళ్లాడు. దానికి ఎలాంటి పక్షపాతమూ ఉండదని.. ప్రజల అభిప్రాయాలను, విజ్ఞప్తులను స్వీకరించి, ఆ డేటాను విశ్లేషించి వారికి ఉపయోగపడేలా విధానాలను రూపొందిస్తుందని విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆ రోబోను 'ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి కొత్త రూపం'గా అభివర్ణించాడు. ఇక.. నిరుడు జూన్‌లో యూకే పార్లమెంటుకు జరిగిన ఎన్నికల్లో 'ఏఐ స్టీవ్' అనే కృత్రిమ మేధ అభ్యర్థి బరిలోకి దిగడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. యూకేలో 'న్యూరల్ వాయిస్' అనే కంపెనీని నడిపే స్టీవ్ ఎండాకాట్ ఈ ఏఐని తన తరఫున స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిపారు. ఒకవేళ ఎన్నికల్లో 'ఏఐ స్టీవ్' గెలిస్తే.. అతడి తరఫున ఎండాకాట్ పార్లమెంటేరియన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారని బ్రిటన్ ఎన్నికల కమిషన్ మొదట్లోనే తేల్చిచెప్పింది.



యూకే ఎన్నికల్లో పోటీ చేసిన ఏఐ స్టీవ్ (స్టీవ్‌కు వచ్చిన ఓట్లు కేవలం 179)

ఏఐ నడిపే పార్టీ..

ఎన్నికల్లో పోటీ చేయడం కాదు.. డెన్మార్క్‌లో 'లీడర్ లార్స్' అనే చాట్‌బాట్ పొలిటీషియన్ ఏకంగా ఒక పార్టీనే నడుపుతోందంటే నమ్ముతారా? ఆ పార్టీ పేరు 'సింథటిక్ పార్టీ'. 2022 మే నెలలో ప్రారంభమైన ఆ పార్టీ ప్రధాన లక్ష్యం.. మనుషులు, కృత్రిమమేధ కలిసి జీవించడం. ప్రపంచంలోనే తొలి 'ఏఐ ఆధారిత రాజకీయ పార్టీ' ఇది. డెన్మార్క్‌లోని అర్హస్ యూనివర్సిటీకి చెందిన 'ఆస్కర్ బ్రిల్డ్ స్టానేస్' అనే తత్వవేత్త ఈ పార్టీ వ్యవస్థాపకుడు. దీనికన్నా ముందు (2018లో) ఫిన్‌లాండ్‌లో 'ద ఏఐ పార్టీ'ని స్థాపించారుగానీ.. దాన్ని నడిపేది 'లీడర్ లార్స్' లాగా ఏఐ కాదు. మనుషులే. కాకపోతే, దేశానికి సంబంధించి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో ఏఐ పాత్ర ఎక్కువగా ఉండాలనేది ఆ పార్టీ లక్ష్యం.

లాభాలు.. నష్టాలు!

ఏఐ పొలిటీషియన్లకున్న ప్రధానమైన సానుకూల అంశం ఏంటంటే.. మామూలు రాజకీయ నాయకుల్లాగా వాటికి విశ్రాంతి అవసరం లేదు. యాప్/వెబ్‌పేజీల ద్వారా ఏ సమయంలోనైనా వాటితో నేరుగా సంభాషించవచ్చు. ఒకేసారి ఎక్కువ మంది ప్రశ్నలకు సమాధానమిచ్చే సామర్థ్యం కూడా వాటికి ఉంటుంది. వీటిని పక్కన పెడితే.. వాటికీ కొన్ని సమస్యలుంటాయి. కృత్రిమ మేధ పనిచేయడానికి విస్తృతంగా కంప్యూటేషనల్ వనరులు, పెద్ద ఎత్తున విద్యుత్తు వంటివి అవసరమవుతాయి. వాటికి నిరంతరాయంగా నెట్‌వర్క్ యాక్సెస్ ఉండాలి. ఏఐను రూపొందించేది మనుషులే. రకరకాల లాంగ్వేజ్ మోడల్స్ ద్వారా వాటిని అభివృద్ధి చేస్తారు. రూపకర్తలు వాటికి ఏ సమాచారం ఇస్తారో ఆ డేటా ఆధారంగా మాత్రమే అవి నిర్ణయాలు తీసుకోగలవు. 'రోబో' సినిమాలో చూపించినట్టు.. వికృత మనస్తత్వం కలిగిన నిపుణులెవరైనా అలా వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంటుంది. ఉదాహరణకు.. రష్యా చాట్‌బాట్ అలీసా ఒక సందర్భంలో గృహ హింసను సమర్థించే సమాధానం ఇచ్చింది. మరో సందర్భంలో.. కాల్పులను సమర్థిస్తూ సమాధానం ఇచ్చింది. కాబట్టి పూర్తిగా వాటిపై ఆధారపడలేని పరిస్థితి. అందుకే వీటికి బదులుగా.. 'ఏఐ పవర్డ్ డైరెక్ట్ డెమొక్రసీ' అనే మరో ప్రతిపాదనను సీజర్ హిడాల్గో అనే ఫిజిసిస్ట్ చేశారు. అంటే.. దేశంలోని పౌరులందరూ తమ తమ ఏఐ ఏజెంట్లను రూపొందించుకోవాలి. ఈ ఏఐ ఏజెంట్లన్నీ కలిసి ఆన్‌లైన్ ద్వారా సంప్రదింపులు జరుపుకొని అందరికీ ఆమోదయోగ్యమయ్యే నిర్ణయం తీసుకుంటాయని హిడాల్గో ప్రతిపాదించారు. దీన్ని ఆయన నిజమైన ప్రత్యక్ష ప్రజాస్వామ్యంగా, 'అవతార్ డెమొక్రసీ'గా అభివర్ణిస్తున్నారు. కానీ.. ఇది చాలా సంక్లిష్టమైన ప్రక్రియ అని, ఆచరణసాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మధ్యవర్తి ఏఐ!

విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి వర్చువల్ పొలిటీషియన్ల మీద ఆధారపడడం కంటే.. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఏఐ ఆధారిత 'హబెర్మాస్ మెషీన్' వంటి ఉపకరణాల సాయం తీసుకోవడం మంచిదని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. హబెర్మాస్ మెషీన్ అనేది.. గూగుల్‌కు చెందిన 'డీప్‌మైండ్' సంస్థ అభివృద్ధి చేసిన 'ఏఐ డిబేట్ మీడియేటర్'. ఒక అంశంపై వివిధ వర్గాలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను అన్నింటినీ క్రోడీకరించి ఒక ఉమ్మడి ప్రాతిపదికను గుర్తించి అన్ని వర్గాలూ ఏకాభిప్రాయానికి వచ్చేలా చేసే మధ్యవర్తి లాంటి యంత్రం ఇది. ప్రయోగాల్లో భాగంగా ఈ మెషీన్ ఇప్పటికే పలు ట్రయల్ గ్రూపుల మధ్య అత్యంత సమస్యాత్మక అంశాల్లో ఏకాభిప్రాయం కుదర్చగలిగింది.

చివరాఖరు: కృత్రిమ మేధ ఇప్పటిదాకా ప్రత్యక్షంగా ఎన్నికల బరిలోకి దిగలేదుగానీ.. పరోక్షంగా ప్రపంచవ్యాప్తంగా చాలా ఎన్నికలను ప్రభావితం చేస్తోంది! ఎన్నికల సమయంలో ఓటర్ల మనసును ప్రభావితం చేసే విధంగా సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు, డీప్ ఫేక్ వీడియోలు.. ఇవన్నీ ఏఐ సాయంతో సృష్టిస్తున్నవే! కృత్రిమ మేధను మన రాజకీయ నాయకులు ఇప్పటికే విచ్చలవిడిగా వాడేస్తున్నారు మరి!!

(సెంట్రల్ డెస్క్)



జపాన్‌లోని టోక్యో నగర మేయర్ ఎన్నికల ప్రచారంలో రోబో

లోకం తీరు



'సివిల్స్' అభ్యర్థుల పిటిషన్‌పై న్యాయసలహాకు అమికస్ క్యూరీ

సెలక్షన్ లిస్టు కంటే ముందే ప్రిలిమ్స్‌కీ, కటాఫ్ వెల్లడించాలని సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 19: సివిల్ సర్వీసు ప్రిలిమినరీ పరీక్షకు సంబంధించి సమాధానాల కీ, కటాఫ్ మార్కులు, సాధించిన మార్కులను నియామక ప్రక్రియ పూర్తవకముందే వెల్లడించేలా యూపీఎస్సీకి ఆదేశాలివ్వాలంటూ ఆ అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశమ్మీద న్యాయపరమైన సలహా ఇచ్చేందుకు అమికస్ క్యూరీని నియమించింది. జస్టిస్ పీఎం నర్సింహా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం, సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తాను అమికస్ క్యూరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. 2023లో సివిల్స్ సహా నిర్వహించిన దాదాపు అన్ని పరీక్షలకు సంబంధించి ప్రక్రియ పూర్తయ్యాకే సమాధానాల కీ, కటాఫ్ మార్కులు, అభ్యర్థులు సాధించిన మార్కులను వెల్లడించాలని నిర్ణయం తీసుకుంది. అభ్యర్థుల పిటిషన్‌పై వారి తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. ప్రిలిమినరీ పరీక్షల తర్వాత యూపీఎస్సీ వివరాలు వెల్లడించకపోవడం అనేది పారదర్శకత లోపమేనని సిబల్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సమాధానాల కీ, కటాఫ్ మార్కులు, మార్కులను యూపీఎస్సీ వెల్లడిస్తే అభ్యర్థులకు తాము చేసిన పొరపాట్లపైన, అలాగే ఒకవేళ తప్పుడు మూల్యాంకనం జరిగితే దానిపైనా స్పష్టమైన అవగాహన వస్తుందని ఆయన వాదించారు. కాగా ఈ అంశమ్మీద అదనపు అఫిడవిట్‌ను దాఖలు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం, యూపీఎస్సీకి ధర్మాసనం ఆదేశించింది. అభ్యర్థులు లేవనెత్తిన అంశాలను వెల్లడిస్తే నియామక సంస్థకు ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయనేది అఫిడవిట్‌లో పొందుపర్చాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

కాల్పుల విరమణతో గాజాలో ప్రశాంతత

- ముగ్గురు బందీలను విడుదల చేసిన హమాస్



కాల్పుల విరమణతో తమ స్వస్థలాలకు తిరిగి వస్తున్న గాజా పౌరులు

టెల్‌అవీవ్, జనవరి 19: బాంబింగ్.. షెల్లింగ్.. వైమానిక దాడులతో నామరూపాలు కోల్పోయిన గాజాలో కాల్పుల విరమణ ఒప్పందంతో ఆదివారం ప్రశాంతత నెలకొంది. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి తర్వాత మొదలైన యుద్ధం ఆదివారానికి 470వ రోజుకు చేరుకుంది. గత ఏడాది కూడా హమాస్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందం అమలవ్వగా.. బందీల విడుదలలో ఆలస్యం, పేర్లను వెల్లడించకపోవడం వంటి కారణాలతో యుద్ధం కొనసాగుతూ వచ్చింది. తాజాగా అమెరికా, ఖతార్, ఈజిప్ట్ నెరపిన మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్ మధ్య మరోమారు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. దశల వారీగా 33 మంది బందీలను విడుదల చేయడానికి హమాస్.. అందుకు ప్రతిగా తమ దేశ జైళ్లలో ఉన్న 737 మంది పాలస్తీనీయులను విడిచిపెట్టడానికి ఇజ్రాయెల్ అంగీకరించాయి. హమాస్ దాడులతో సంబంధం లేని 1,167 మంది గాజా పౌరులకూ స్వేచ్ఛ లభించనుంది. మరోవైపు, ఒప్పందం ప్రకారం ఆదివారం ఉదయం 8.30 నుంచి కాల్పుల విరమణను పాటించాలి. అప్పటివరకూ గాజాపై దాడిని కొనసాగించిన ఇజ్రాయెల్.. తొలి విడతగా విడుదలవ్వనున్న ముగ్గురు బందీల జాబితా రాలేదనే సాకుతో ఉధృతిని పెంచింది. ఉదయం 11.15 గంటల వరకు హమాస్ వర్గాలు బందీలుగా ఉన్న ముగ్గురు ఇజ్రాయెలీ యువతుల పేర్ల(రోమి గోనెన్, ఎమిలి దమారి, డోరాన్ స్టెయిన్‌బెర్)ను విడుదల చేసే వరకు కూడా కాల్పులు కొనసాగాయి. ఖాన్‌యూనిస్‌పై జరిపిన ఈ దాడుల్లో 26 మంది చనిపోయారు. సాయంత్రానికి హమాస్ వర్గాలు ముగ్గురు బందీలను రెడ్‌క్రాస్‌కు అప్పగించాయి. కాగా, ఒప్పందం మేరకు బందీలను విడుదల చేయకుంటే గాజాలో మళ్లీ యుద్ధం తప్పదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు హెచ్చరించారు.

సైఫ్‌పై దాడి చేసింది బంగ్లాదేశీయుడు!

- థానే దగ్గర్లోని ఓ కార్మిక శిబిరంలో అరెస్టు

ముంబై, జనవరి 19: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేశాడనే ఆరోపణలపై మహ్మద్ షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్(30) అలియాస్ బిజయ్ దాస్ అనే బంగ్లాదేశ్ పౌరుడిని ముంబై పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో షరీఫుల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు... అతనిని బాంద్రా న్యాయస్థానంలో హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయస్థానం నిందితుడి ఐదు రోజుల పోలీసు కస్టడీకి అనుమతినిచ్చింది. బంగ్లాదేశ్ పౌరుడైన షరీఫుల్ అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించి బిజయ్ దాస్ అనే పేరుతో చలామణీ అవుతున్నాడని పోలీసులు న్యాయస్థానానికి తెలియజేశారు. దొంగతనం చేసేందుకు సైఫ్ అలీ ఖాన్ ఇంట్లోకి చొరబడిన షరీఫుల్.. సైఫ్‌పై దాడి చేసి పరారయ్యాడని తెలిపారు. వందలాది సీసీ కెమెరా ఫుటేజీల పరిశీలన అనంతరం దాదర్ రైల్వే స్టేషన్ వద్ద నిందితుడి సంచారాన్ని గుర్తించామని, థానే సమీపంలోని ఓ కార్మిక శిబిరంలో అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. షెహజాద్ బంగ్లాదేశీ కావడంతో సైఫ్‌పై దాడి వెనుక అంతర్జాతీయ కుట్ర ఏమైనా ఉందా ? అని దర్యాప్తు చేయాల్సి ఉందని వివరించారు. కాగా, సైఫ్‌పై దాడి కేసులో ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేసిన ఆకాశ్ కైలాశ్ కనోజియాను విచారణ అనంతరం పోలీసులు విడుదల చేశారు.

ట్రంప్ వచ్చేస్తుండు

(మొదటి పేజీ తరువాయి)

ఆ ఒక్క దేశానికి మాత్రమే సంబంధించిన వ్యవహారం కాదు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి ఆలోచనల ప్రభావం ప్రపంచమంతా ఉంటుంది!! అందునా ట్రంప్ లాంటి దూకుడు మనస్తత్వం ఉన్న వ్యక్తి అయితే ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో.. పలు అంశాలపై గత కొన్ని నెలలుగా ఆయన చేసిన వ్యాఖ్యల ఆధారంగా ఆయన వైఖరి ఎలా ఉండవచ్చో నిపుణులు విశ్లేషిస్తున్నారిలా..

భారత్‌పై పన్నుల భారం?

ట్రంప్ తొలి హయాంలో అమెరికా, భారత్ మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలపడ్డాయి. కానీ.. వాణిజ్యం విషయంలో మాత్రం ఆయన పలుమార్లు ఘాటు వ్యాఖ్యలు చేశారు. భారత్ విధించే సుంకాలపై గట్టిగానే చిర్రుబుర్రులాడారు. 2019లో.. భారత్‌ను 'టారిఫ్ కింగ్'గా కూడా అభివర్ణించారాయన! అప్పటిదాకా భారత్‌కు ఉన్న 'జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ (జీఎస్పీ)'ని రద్దు చేశారు. గత ఏడాది డిసెంబరులో సైతం.. భారత్ విధిస్తున్న సుంకాలపై ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "అమెరికా ఉత్పత్తులపై భారత్, బ్రెజిల్ వంటి దేశాలు అత్యధికంగా 100%, 200% పన్నులు వేస్తున్నాయి.. దేనికైనా ప్రతిచర్య ఉంటుంది. వారు మాపై పన్నులు వేస్తే మేమూ అదే స్థాయిలో వసూలు చేస్తాం" అంటూ రివెంజ్ ట్యాక్స్ గురించి మాట్లాడారు. కాబట్టి వాణిజ్యంలో ఇరుదేశాల మధ్య ఘర్షణ.. పన్నుభారం తప్పకపోవచ్చు.

హెచ్1బీపై మెతక వైఖరి?

హెచ్1బీ వీసాలపై ట్రంప్ గతంలో తీవ్రస్థాయిలో విమర్శలు చేసేవారు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్1బీ ప్రోగ్రామ్ ద్వారా వచ్చే దరఖాస్తుల వడపోతను కఠినతరం చేశారు. కానీ, ఇప్పుడు.. హెచ్1బీ వీసాలను సమర్థించే ఈలన్ మస్క్, వివేక్ రామస్వామి వంటివారు తన పక్కనే ఉన్న నేపథ్యంలో ఇటీవలికాలంలో ఆయన స్వరం మారింది. ఆ వీసాలపై ఆయన వైఖరి మెత్తబడింది. "హెచ్1బీపై నాకు నమ్మకం ఉంది. అదొక గొప్ప కార్యక్రమం" అంటూ న్యూయార్క్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టంగా చెప్పారు. అయితే.. ట్రంప్ మద్దతుదారుల్లోనే మరో వర్గం, అమెరికాను మళ్లీ గొప్పగా చేయాలని వాదించేవారు (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్-మాగా) మాత్రం హెచ్1బీపై తీవ్ర వ్యతిరేకత వెలిబుచ్చుతున్నారు. కాబట్టి ఆ ఒత్తిడి కూడా ట్రంప్‌పై ఉండే అవకాశం ఉంది. దాన్ని ఎలా అధిగమిస్తారో చూడాలి!!

గ్రీన్‌లాండ్ స్వాధీనం!

అత్యంత వ్యూహాత్మకమైన ప్రాంతంలో ఉన్న గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో భాగం చేస్తామని.. అందుకు అవసరమైతే సైన్యాన్నిగానీ, ధనాన్నిగానీ ఉపయోగించడానికి సిద్ధమని ట్రంప్ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. ఇంతకీ గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ దృష్టి ఎందుకు పడింది? అంటే.. ఆ దేశంలో అత్యంత అరుదైన వనరులు, నిక్షేపాలు ఉన్నాయి. యూరప్‌కు, ఉత్తర అమెరికాకు మధ్య వ్యూహాత్మక ప్రాంతంలో ఉందా భూభాగం. అటువైపుగా వెళ్లే రష్యన్ నౌకలు, అణు జలాంతర్గాములపై ఒక కన్ను వేసే అవకాశం అమెరికాకు అక్కడ ఉంది. ఈ క్రమంలో ఇప్పటికే యూఎస్ అక్కడ ఒక శాశ్వత ఎయిర్‌బేస్ ఏర్పాటు చేసింది. అన్నిటికీ మించి.. గ్రీన్‌లాండ్ భౌగోళికంగా ఉత్తర అమెరికాలో భాగం! కానీ.. రాజకీయంగా 1953 వరకూ డెన్మార్క్ వలస ప్రాంతంగా ఉంది. ఇప్పుడు స్వయంపాలిత భూభాగంగా ఉంది. గ్రీన్‌లాండ్ రాజధానికి డెన్మార్క్ రాజధాని కోపెన్‌హేగన్ కన్నా కూడా న్యూయార్కే దగ్గర. వీటన్నింటి నేపథ్యంలోనే ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను ఎలాగైనా స్వాధీనం చేసుకుంటామని ప్రకటించారు. గతంలో హ్యారీ ట్రూమన్ హయాంలో కూడా ఈ ద్వీపాన్ని 100 మిలియన్ డాలర్లతో కొనుగోలు చేయడానికి ప్రయత్నించారు. కానీ, కుదర్లేదు. ఇప్పుడు కూడా డెన్మార్క్ ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తోంది. ట్రంప్ మాత్రం ఈ విషయంలో మొండిగానే వ్యవహరించే అవకాశం ఉంది. అప్పుడు.. డెన్మార్క్‌కు బదులుగా అమెరికాతో అనుబంధంగా ఉండే నిర్ణయం తీసుకునే హక్కు గ్రీన్‌లాండ్‌కు ఉంటుంది. ఫలితంగా ఇన్నాళ్లుగా డెన్మార్క్ నుంచి గ్రీన్‌లాండ్‌కు అందుతున్న రాయితీలు అమెరికా నుంచి అందుతాయన్నమాట.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం

తాను అధికారంలోకి వస్తేగనక వెంటనే రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని ట్రంప్ గతంలో ప్రకటించారు. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇవ్వబోమని హామీ ఇవ్వడం ద్వారా రష్యాను యుద్ధవిరమణకు ట్రంప్ ఒప్పించవచ్చన్నది ఒక ఆలోచన. అది ఉక్రెయిన్‌కు పెద్ద దెబ్బే. నిజానికి 2023లో అమెరికా నుంచి ఉక్రెయిన్‌కు అందాల్సిన 61 బిలియన్ల డాలర్ల ప్యాకేజీ.. ట్రంప్ ఒత్తిడి కారణంగానే ఆగిపోయింది. అందుకే ఉక్రెయినియన్లకు ఇప్పుడు ట్రంప్ మీద పెద్దగా ఆశలేమీ లేవు.

గాజా వార్ ముగిసినట్లేనా?

గాజాలో జరుగుతున్న యుద్ధం విషయంలో ట్రంప్ చాలా స్పష్టంగా హమాస్‌కు వ్యతిరేకంగా ఉన్నారు. తాను ప్రమాణం చేసే జనవరి 20లోపు హమాస్‌గనక తన వద్ద ఉన్న బందీలందరినీ ఇళ్లకు పంపించకపోతే ఈ దురాగతాలకు పాల్పడేవారికి నరకం చూపిస్తానని ఇటీవలే హెచ్చరికలు జారీ చేశారు. ఈ యుద్ధానికి కారకులైనవారికి గట్టి దెబ్బ పడుతుందంటూ పరోక్షంగా ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ క్రమంలోనే హమాస్ దిగివచ్చి ముగ్గురు బందీలను విడుదల చేసింది.

పనామా కాలువ స్వాధీనం?


తీరాల మధ్య వాణిజ్య, సైనిక నౌకల రవాణాను సులభతరం చేసేందుకు అమెరికా నిర్మించిన పనామా కాలువ ప్రస్తుతం పనామా దేశ ఆధీనంలో ఉంది. 1977లో అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ చేసుకున్న ఒప్పందం ప్రకారం.. 1999 డిసెంబరులో ఈ కాలువపై నియంత్రణను అమెరికా కోల్పోయింది. అయితే.. ఇటీవలికాలంలో ఆ దేశం సరుకు రవాణా నౌకలపై రుసుములు పెంచేయడం, చైనాతో సత్సంబంధాలు పెట్టుకోవడం వంటి నిర్ణయాలు తీసుకుంది. అవే ట్రంప్ ఆగ్రహానికి కారణమయ్యాయి. కాబట్టి పగ్గాలు చేపట్టాక ట్రంప్ పనామాపై దూకుడుగానే వ్యవహరించే అవకాశం ఉందని అంచనా. ఇవే కాదు, వాణిజ్యలోటు భర్తీ కోసం కెనడా, మెక్సికోలను కూడా అమెరికాలో రాష్ట్రాలుగా చేరుస్తామని ట్రంప్ వ్యాఖ్యానించారు! అమెరికాకు సన్నిహితమైన యూరోపియన్ దేశాలనూ ఆయన వదల్లేదు. యూరప్ దేశాలకు, అమెరికాకు మధ్య వాణిజ్య అంతరం భారీగా ఉందని.. దాన్ని పూడ్చడానికి యూరప్ దేశాలు గ్యాస్, ఇంధనాన్ని అమెరికా నుంచే కొనుగోలు చేయాలని హెచ్చరించారు. లేదంటే ఈయూపై పన్నులు పెంచేస్తానని బెదిరించారు. భూతాప ముప్పును నివారించేందుకు పారిస్‌లో కుదుర్చుకున్న పర్యావరణ ఒప్పందం నుంచి వైదొలగుతానని ప్రకటించారు. ఇలా ఆయన చెప్పినవన్నీ చేస్తే ప్రపంచానికి పెనుముప్పేనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. (సెంట్రల్ డెస్క్)



ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్‌కు బయల్దేరే ముందు ట్రంప్ అభివాదం

నేడు అధ్యక్షుడిగా ప్రమాణం

వాషింగ్టన్, జనవరి 19: అమెరికా 47వ అధ్యక్షుడిగా ట్రంప్(78) భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి 10.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకోసం ఆయన ఫ్లోరిడా నుంచి వాషింగ్టన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వర్జీనియాలోని ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌లో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. వాషింగ్టన్‌లో మైనస్ 11 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండటంతో ప్రతికూల వాతావరణం కారణంగా బహిరంగ ప్రదేశంలో కాకుండా కేపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, జుకర్‌బర్గ్ తదితరులు హాజరవుతారు. భారత ప్రభుత్వం తరఫున కేంద్ర మంత్రి జైశంకర్, ఇండియా నుంచి ముఖేశ్ అంబానీ దంపతులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఇప్పటికే వాషింగ్టన్ చేరుకున్న ముఖేశ్, నీతా ఆదివారం ట్రంప్ ఇచ్చిన విందులో పాల్గొన్నారు. సోమవారం సెయింట్ జాన్స్ చర్చిలో ప్రార్థనలతో ట్రంప్ తన రోజును ప్రారంభిస్తారు. అక్కడ నుంచి వైట్‌హౌస్‌కు వెళ్లి అధ్యక్షుడు బైడెన్ ఇచ్చే తేనీటి విందులో పాల్గొంటారు. అక్కడ నుంచి కేపిటల్ హిల్ చేరుకుని ప్రమాణ స్వీకారం చేస్తారు. తర్వాత బైడెన్, కమలాహారిస్‌ల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రమాణ స్వీకారం తర్వాత ట్రంప్ తొలిరోజే వందకుపైగా ఆదేశాలపై సంతకాలు చేయనున్నారు. మరోవైపు, ట్రంప్ ప్రమాణ స్వీకారాన్ని వ్యతిరేకిస్తూ అనేక సంస్థలు దేశవ్యాప్తంగా ర్యాలీలు చేపట్టాయి.



వర్జీనియాలోని ట్రంప్ గోల్ఫ్ క్లబ్‌లో వేడుకలను తిలకిస్తున్న ట్రంప్ దంపతులు

ఏప్రిల్‌లో ట్రంప్ భారత పర్యటన

ట్రంప్ ఏప్రిల్‌లో భారత్‌లో పర్యటించే అవకాశం ఉంది. ప్రధాని మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించే అవకాశాలు కూడా ఉన్నాయి. భారత్ అతి త్వరలో క్వాడ్ సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వనుంది. అమెరికా క్వాడ్ కూటమిలో ఉండటంతో ట్రంప్ భారత్ వచ్చే అవకాశం ఉంది. చైనాతో సత్సంబంధాలు కోరుకుంటున్న ట్రంప్, ఆయన తొలి విదేశీ పర్యటన కోసం చైనానే ఎంచుకోవచ్చని తెలుస్తోంది.

ఎవరి ఖిల్లానో 'ఢిల్లీ'?

(మొదటి పేజీ తరువాయి)

ఉపసంహరణకు సోమవారంతో గడువు ముగియనుండటంతో ప్రధాన పార్టీలన్నీ ప్రచారాన్ని ఉధృతం చేయనున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. అదేనెల 8న ఓట్ల లెక్కింపు జరగనుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 53.57 శాతం ఓట్లతో ఆమ్ ఆద్మీ పార్టీ 62 స్థానాలు గెలుచుకుంటే, 38.51శాతం ఓట్లతో బీజేపీ 8 స్థానాలకే పరిమితమైంది. 4.26 శాతం ఓట్లతో కాంగ్రెస్ ఒక్క సీటూ గెలుచుకోలేకపోయింది. ఆర్నెల్ల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 54.35శాతం, కాంగ్రెస్ 18.91శాతం సాధించి ఓటు బ్యాంకును మెరుగుపరుచుకున్నాయి. ఆప్ మాత్రం 24.17 శాతం ఓట్లకు పడిపోయింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో జననాడి ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికంగా మారింది. ఈ మూడు పార్టీలకు న్యూఢిల్లీ నియోజకవర్గం అత్యంతకీలకంగా మారింది. ఇక్కడ ఆప్ అధినేత కేజ్రీవాల్, బీజేపీ నుంచి మాజీ ఎంపీ, మాజీ సీఎం సాహెబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ, మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. గత ఎన్నికల్లో బీజేపీ ఇక్కడ పోటీ చేయలేదు. ఈసారి ఆ పార్టీ పర్వేశ్‌ను నిలబెట్టడం, 2013లో షీలా దీక్షిత్‌ను ఓడించి అధికారంలోకి వచ్చిన కేజ్రీవాల్‌ను ఢీకొనేందుకు ఆమె కుమారుడు సందీప్‌ను కాంగ్రెస్ బరిలోకి దింపడంతో పోటీ ఆసక్తికరంగా మారింది. ఆప్ నుంచి కేజ్రీవాల్ ఒక్కరే ప్రచారం చేస్తుండగా బీజేపీ, కాంగ్రెస్ నుంచి పలువురు జాతీయ స్థాయి నేతలు ప్రచారం చేస్తున్నారు. బీజేపీ తరఫున ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, యూపీ సీఎం యోగి సహా పలు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు ప్రచారం నిర్వహిస్తున్నారు.



ఎన్నికల షెడ్యూల్ ప్రకటించక ముందే నరేంద్రమోదీ జనవరి 3న రాంలీలా మైదానంలో పార్టీ ప్రచారాన్ని ప్రారంభించి భారీ ఎత్తున ప్రాజెక్టులు ప్రకటించారు. కాంగ్రెస్ తరఫున లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఆయన సోదరి ప్రియాంకా గాంధీ, పార్టీ అధ్యక్షుడు ఖర్గే, సచిన్ పైలట్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఇటీవల సీలంపూర్‌లో రాహుల్ జరిపిన ర్యాలీకి పెద్ద ఎత్తున ప్రజాస్పందన లభించింది. సోమవారం న్యూఢిల్లీ నియోజకవర్గంలో సందీప్ దీక్షిత్ మద్దతుగా పాదయాత్ర చేస్తున్న రాహుల్ గాంధీ ఇతర నియోజకవర్గాల్లో కూడా పాదయాత్రలు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. షీలాదీక్షిత్ హయాంలో ఢిల్లీలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రధానంగా ప్రచారానికి ఉపయోగించుకుంటోంది. ఢిల్లీలో బీజేపీ కంటే ఆప్ పార్టీయే తమకు ప్రధాన ప్రత్యర్థిగా కాంగ్రెస్ భావిస్తోంది. దీంతో జాతీయ స్థాయిలో బీజేపీని తీవ్రంగా విమర్శించే రాహుల్, ఇతర కాంగ్రెస్ నేతలు ఈసారి కేజ్రీవాల్‌నే లక్ష్యంగా చేసుకున్నారు. తమకు గతంలో మద్దతుగా నిలిచిన మురికివాడల ప్రజలు, దళితులు, మైనారిటీలు ఆప్‌వైపు తరలడంతో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌పైనే ప్రధానంగా విమర్శలు చేస్తున్నారు. ఈసారి ముస్లింలు పూర్తిగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశాలున్నాయి. ఇక దాదాపు అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున స్వతంత్ర అభ్యర్థులు, చిన్నా చితక పార్టీల నేతలు పోటీకి దిగడంతో ఆ చీలే ఓట్లు ఎక్కడ దెబ్బ కొడతాయోనని మూడు పార్టీలూ ఆందోళన చెందుతున్నాయి. మొత్తం 70 నియోజకవర్గాల్లో 980 మంది అభ్యర్థులు 1521 నామినేషన్లు దాఖలు చేయగా 1040 నామినేషన్లను ఎన్నికల సంఘం ఆమోదించింది.

ఉచిత వరాల మధ్య ఓటర్లు ఎటువైపు?

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు పెద్ద ఎత్తున ఉచిత వరాలపై హామీలు గుప్పిస్తుండటంతో ప్రజలు ఏ పార్టీవైపు ఆకర్షితులవుతారన్న విషయం అంచనా వేయడం కష్టంగా మారింది. ఢిల్లీ ఎన్నికల ఘట్టం ప్రారంభమైన కొద్దిరోజులకే 8వ పే కమిషన్‌ను నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోవడం వల్ల ఢిల్లీలో అత్యధికంగా ఉన్న ప్రభుత్వోద్యోగులు తమకు అనుకూలంగా మారతారని బీజేపీ ఆశాభావంతో ఉంది. మహిళలకు నెలకు రూ. 2,500 చొప్పన చెల్లిస్తామని, గర్భిణులకు రూ. 21వేలతో పాటు ఆరు న్యూట్రిషన్ కిట్లను అందిస్తామని, రూ. 500కే పేదలకు ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేస్తామని బీజేపీ ప్రకటించింది. ఆప్ కూడా మహిళలకు నెలకు రూ. 2,500 చెల్లిస్తామని, వృద్ధులకు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స అందిస్తామని, ఉచిత విద్యుత్తు, నీటి సరఫరా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం,ఆడపిల్ల వివాహానికి రూ.లక్ష చెల్లిస్తామని ప్రకటించింది. తాజాగా అద్దె ఇళ్లలో నివసించేవారందరికీ ఉచిత విద్యుత్తు, నీటి సరఫరా కల్పిస్తామనీ కేజ్రీవాల్ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ కూడా రూ. 500కు గ్యాస్ సిలిండర్, ఉచిత రేషన్ కిట్, 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీలను గుప్పించింది.

తెలంగాణ కంటే ఏపీలోనే మాంసాహారులెక్కువ

న్యూఢిల్లీ, జనవరి 19: తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాంసాహారుల సంఖ్య ఎక్కువని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5(ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5)లో వెల్లడైంది. ఏపీ మొత్తం జనాభాలో 98.25% మంది మాంసాహారులుండగా, తెలంగాణలో 97.3% మంది నాన్-వెజ్ తినేవారు ఉన్నారు. రాష్ట్రంలో కేవలం 2.7శాతం మందే శాకాహారులు. ఇక, ఈ ర్యాంకింగ్‌లో నాగాలాండ్ మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్ర మొత్తం జనాభాలో 99.8% మంది మాంసాహారులు ఉన్నట్లు తేలింది. పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఏపీ నాలుగో స్థానంలో, తెలంగాణ 10వ స్థానంలో ఉన్నాయి. కాగా, దేశవ్యాప్తంగా 15-49ఏళ్ల మధ్య వయస్కుల్లో మూడింట రెండొంతుల మంది మాంసాహారులేనని ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5లో వెల్లడైంది.



భిన్నత్వంలో ఏకత్వానికి కుంభమేళా ప్రతీక

- ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చింది
- 'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోదీ




న్యూఢిల్లీ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభమైన మహా కుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకని ప్రధాని మోదీ అన్నారు. సమానత్వం, సామరస్యాల అసాధారణ సంగమమైన ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజలను ఒక్క తాటిపైకి తీసుకొచ్చిందని చెప్పారు. ప్రపంచ దేశాల ప్రజలు ఇక్కడకు వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారని తెలిపారు. ప్రతినెలా చివరి ఆదివారం 'మన్ కీ బాత్'లో ప్రధాని ప్రసంగిస్తారు. అయితే, ఈసారి నాలుగో ఆదివారం గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో మూడో ఆదివారమే ఆయన ఈ కార్యక్రమం 118వ ఎపిసోడ్‌లో ప్రసంగించారు. వేల ఏళ్లుగా కొనసాగుతున్న కుంభమేళాలో ఎక్కడా ధనిక, పేద తారతమ్యం, కులాల పేరుతో వివక్షకు తావులేదని చెప్పారు. ఇటువంటి కుంభమేళాలు ఉత్తరాది నుంచి దక్షిణాది వరకు ఒకేలా ఉన్నాయన్నారు. ప్రయాగ్‌రాజ్, ఉజ్జయిని, నాసిక్. హరిద్వార్‌లో కుంభమేళాలు నిర్వహిస్తుంటే, మరోవైపు దక్షిణాదిలో గోదావరి, కృష్ణా, నర్మద, కావేరి నదులకు పుష్కరాలు నిర్వహిస్తారని గుర్తుచేశారు.



మహా కుంభమేళాలో సిలిండర్ పేలుడు

- పెద్ద ఎత్తున మంటలు.. 18 టెంట్లు దగ్ధం

ప్రయాగ్‌రాజ్, మహాకుంభమేళా నగర్ (యూపీ): మహా కుంభమేళాలో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఎల్పీజీ సిలిండర్ పేలడంతో కుంభమేళా సెక్టార్-19లోని గీతా ప్రెస్ వద్ద 18 టెంట్లు పూర్తిగా కాలిపోయాయి. పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ అలుముకోవడంతో భక్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ ప్రమాదంలో అదృష్టవశాత్తు భక్తులెవరూ గాయపడలేదు. వెంటనే స్పందించిన సిబ్బంది, ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశారు. మంటలు అదుపులోకి వచ్చి, సాధారణ పరిస్థితులు ఏర్పడేదాకా సమీపంలో ఉన్న భక్తులను అక్కడి నుంచి అధికారులు ఖాళీ చేయించారు. మౌని అమావాస్య కోసం ఏర్పాట్లను పరిశీలించేందుకు సోమవారం ప్రయాగ్‌రాజ్‌కు వచ్చిన యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అగ్ని ప్రమాదం గురించి తెలియడంతో ఘటాస్థలికి వెళ్లారు. మహా కుంభమేళాలో ఇకముందు ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. మహాకుంభమేళాలో అగ్ని ప్రమాదం ఘటన గురించి తెలియడంతో ప్రధాని మోదీ, యోగికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కాగా అఖాడాల్లో యాగాలు జరుగుతుంటాయి కాబట్టి పొగ రావడం మామూలే కానీ. భారీ శబ్దాలతో పెద్ద ఎత్తున మంటలు రావడంతో భయాందోళనకు గురయ్యామని స్థానికులు చెప్పారు.



మన కాలపు హరిశ్చంద్రుడు

1987 ఫిబ్రవరి మాసం. పొద్దు గూకే వేళ అప్పుడే చలి ముసురుకుంటా వుంది. తెనాలి సత్యనారాయణ టాకీస్ రోడ్‌లో వుండే బాబు రికార్డింగ్ షాపు వచ్చిపోయే కస్టమర్లతో సందడిగా వుంది. పూటుగా మందు తాగిన ఇద్దరు ఆగంతకులు రికార్డింగ్ షాపు యజమాని ఉమామహేశ్వరరావు గారి ఎదురుగా నిల్చున్నారు. వారిలో సన్నగా బక్క పల్చగా వున్న వ్యక్తి 'ఏమండీ, మీ దగ్గర ఏమేమి క్యాసెట్లు దొరుకుతాయి?' అని అడిగాడు. వాళ్ల వాలకం చూసిన యజమాని 'అసలు నీకేం కావాలో ముందు చెప్పవయ్యా?' అన్నారు నిరాసక్తంగా. 'హరిశ్చంద్ర పద్యాలు డి.వి., బండారువి కాక, ఇంకెవరివైనా దొరుకుతాయా?' అడిగాడా వ్యక్తి. తలవంచుకొని ఏదో పని చేసుకుంటున్న ఉమా గారు, 'ఆ వున్నాయయ్యా! కెవి రెడ్డి, అరిగెల జేమ్సు, ఈ నడుమ కొత్తగా పాడుతున్న బండారు గారి కుమారుడు రవి కుమార్‌వి ఇవ్వమంటారా,' అన్నాడు కొంచెం ఆసక్తిగా. మళ్ళీ తనే 'ఈమధ్య చక్కగా పాడుతున్నాడని పేరొచ్చిన చీమకుర్తి నాగేశ్వరరావు క్యాసెట్ చేయాలనుకున్నాము. అయన మాకు దొరకలేదయ్యా' అన్నారు కించిత్ బాధ పడుతూ. ఆయన మాటలు వింటున్న ఆగంతకుడు కిలకిలా నవ్వుతూ, 'సార్! నేనేనండీ ఆ చీమకుర్తిని' అన్నాడు. ఆ షాపు యజమాని సంతోషానికి అవధులు లేకపోయాయి. తెనాలి లోనే వుంటూన్న హార్మోనిస్ట్ అంకయ్య గారిని అప్పటికప్పుడే పిలిపించి, హరిశ్చంద్ర పాత్ర వారణాసి, కాటిసీను పద్యాలు ఏకపాత్రగా, ఏకధాటిగా చీమకుర్తి చేత పాడించి రికార్డు చేశారు ఉమామహేశ్వరరావు గారు. ఆ రోజు అర్ధరాత్రి వరకూ వారణాసి, కాటి సీను లోని జాషువా పద్యాలు కొత్త రాగాలతో అద్భుతంగా పాడాడు చీమకుర్తి. 'ఇదంతా నిన్న మొన్ననే జరిగినట్లుందండీ. మళ్లీ పుడతాడా అటువంటి మహా నట గాయక చక్రవర్తి!' కళ్ళు చెమర్చుతుండగా ఈ అపురూప జ్ఞాపకాన్ని నెమరు వేసుకున్నారు బాబు రికార్డింగ్ యజమాని ఉమామహేశ్వరరావు గారు. చీమకుర్తి తన జీవితంలో మొదటి సారి ఇచ్చిన రికార్డింగ్ అది. తన స్వంత బాణీలో పద్యాలు పాడి 'ఎవరీ చీమకుర్తి' అని అందరూ ఉలికిపడే విధంగా తెలుగు పద్య నాటక ప్రపంచాన్ని సంభ్రమానికి గురి చేసిన వాడు. ఇప్పుడా క్యాసెట్‌ని ఎవరెవరో యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మిలియన్స్ వ్యూస్‌గా వైరలయ్యి డబ్బులు సంపాయించి పెడుతోంది వాళ్ళకు. కానీ అంత ప్రయాసపడి ఆ క్యాసెట్‌ను రికార్డింగ్ చేసినవారికి గానీ, తన మధుర గాత్రంతో శ్రోతలను ఉర్రూతలూగించిన చీమకుర్తి సంబంధీకులకు గానీ ఏ ప్రయోజనం లేకపోయింది. 'వెంట వచ్చునది అదే యశస్సు సత్యము' అని ఆయనే పాడినట్లు, కీర్తి మాత్రమే మిగిలుంది.

అది 2002వ సంవత్సరం. ఏప్రిల్ నెల ఎండలు మండిపోతున్నాయి. కడప పాత బస్టాండ్‌లో పోస్టర్లు వేశారు– పెద్ద చెప్పలిలో ఎల్లమ్మ తిరునాళ్ల సందర్భంగా హరిశ్చంద్ర నాటకం వేస్తున్నారని, 'వారణాసి' హరిశ్చంద్రుడుగా చీమకుర్తి నాగేశ్వరరావు వస్తున్నాడని. ఆ కరువు సీమలో చుట్టుపక్కల వందల గ్రామాల నుంచీ వేలమంది ప్రజలు చెప్పలి ఎల్లమ్మ తల్లి తిరునాళ్లకు హాజరవుతారు. ఎంతో భక్తితో ఎల్లమ్మ తల్లిని సేవించుకుని, ఆ రాత్రి ప్రదర్శించే నాటకాన్ని చూసి, తెల్లవారి గ్రామాలకు తరలిపోతారు. ఆరోజు 'సత్యహరిశ్చంద్ర నాటకం'లో ఆంధ్ర దేశంలో పేరు గాంచిన ఉద్దండులైన నటీనటులు– గుమ్మడి విమల కుమారి, బద్వేలు శ్రీహరిరావు, విజయరాజు, వై. గోపాలరావు, రామచంద్ర నాయుడు మొదలైన ఎందరో పెద్దలు ఉన్నారు. నేను కడపలో నా పనులు ముగించుకుని రాత్రి సమయానికి చెప్పలమ్మ తిరునాళ్ల జరిగే చోటుకు చేరుకున్నాను. అక్కడ మేకప్ రూంలో చూస్తే చీమకుర్తి కనిపించలేదు. విచారిస్తే, 'ఎక్కడో తాగి పడిపోయి వుంటాడు, చూడు పో' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు అక్కడున్న వాళ్ళు. అప్పటికి నాటకం మొదలై 'వేట సీను' హరిశ్చంద్రుడుగా గుమ్మడి విమల కుమారి అద్భుతంగా పాడి దిగినారు. 'అడవి సీను' హరిశ్చంద్ర పాత్రధారి బద్వేలు శ్రీహరి రావు వేదిక ఎక్కినారు. కానీ 'వారణాసి' హరిశ్చంద్రుడి జాడే లేదు. తరువాత వారణాసి సీను కాబట్టి ఇప్పుడాయన మేకప్పు వేసుకుంటూ వుండాలి. సరే ఎక్కడైనా పడుకుండిపోయాడేమోనని, ఆయన్ని వెతుకుతూ వేదిక చుట్టూ తిరుగుతూ వున్నా. అక్కడ ఒక చోట 'అబ్బ చీమలు! దానికి తోడు ఉబ్బగా ఉంది. అట్లా విసురు వెంకమ్మా!' అంటున్న గొంతు వినపడింది. అక్కడ, పుట్ట పక్కనే నేలపై తువ్వాలు పరుచుకుని, చీమకుర్తి పడుకుని వున్నాడు. 'అన్నా! ఇక్కడున్నావా? అడవి సీను అయిపోవచ్చింది!' అన్నాను. 'అయ్యా వచ్చావా? ఆ కాంట్రాక్టర్ రెడ్డి కనపడలేదా? కనీసం అన్నం కూడా పెట్టించలేదయ్యా!' అన్నాడు ఎంతో బాధగా. ఆయనని వెంటపెట్టుకొని పోయి అన్నదానం దగ్గర భోజనం పెట్టించి, మేకప్ రూమ్ దగ్గరకి వచ్చాము. అడవి సీను అయిపోయింది. హడావిడిగా మేకప్ ముగించుకుని వేదిక ఎక్కినాడు చీమకుర్తి. ప్రక్కన చంద్రమతీ లోహితాస్య నక్షత్రక సమేతంగా వారణాసి ఘట్టంలోకి ప్రవేశించినాడు. 'దేవీ కష్టము లెట్లుండిననూ, పుణ్యక్షేత్రమైన వారణాసిని దర్శించితిమి చూడూ, ఈ వారణాసీ,' అని డైలాగు చెప్పి, 'భక్తయోగపదన్యాసి వారణాసి' అని పాడగానే జనం వన్స్‌మోర్ వన్స్‌మోర్‌లు కొడుతూ చప్పట్లూ కేకలతో ఆ ప్రాంతం హోరెత్తిపోయింది! తిరిగి అదే పద్యాన్ని భాగేశ్వరీ రాగంలో సమ్మోహనంగా పాడాడు చీమకుర్తి. పద్యాల ప్రభంజనం మొదలయ్యింది! 'అంతటి రాజచంద్రునకు ఆత్మజవై – కకుబంత కాంత విశ్రాంత యశోవిశాలుని త్రిశంకు నృపాలుని యిల్లు జొచ్చి' అని చీమకుర్తి ముఖారి రాగం హెచ్చు స్థాయిల్లో పాడుతుంటే వింటున్న జనం ఏడుస్తున్నారు. ఆ ప్రాంతమంతా నిశ్శబ్దమైపోయింది. తనని బానిసగా విక్రయించినప్పుడు చంద్రమతి పతీ వియోగ దుఃఖంతో హరిశ్చంద్రుని పాదాలపై పడి మొరపెట్టుకునేవేళ, రారాజు బిడ్డయైన దేవికి ఇంతటి కష్టం తెచ్చిపెట్టినందుకు ఒకింత చింతిస్తూ, 'ఛీ ఛీ కఠినాత్మా హరిశ్చంద్రా! నీవు నిక్కముగా కిరాతులకు జన్మించవలసిన వాడవు గదా!' అని డైలాగు చెప్పి పద్యం చదివేవేళ, 'పట్టపుందేవినమ్మితే బానిసగనూ' అంటూ కళ్ళ వెంబడి పెల్లుబికిన కన్నీటి బిందువులామె శిరస్సుపై జారిపడటం ప్రేక్షక హృదయాలను కలచివేసిన దృశ్యం. కమలాపురం ప్రాంతానికి చీమకుర్తిని తొలిసారి బుక్ చేసినారు. ఎట్లా పాడి రక్తి కట్టిస్తాడో మరి ఈ నాటకాన్ని అనుకున్నాను. కానీ ఆ రోజు చీమకుర్తి ఒక్క చుక్క కూడా మందు ముట్టలేదంటే ఎవరూ నమ్మలేని నిజం. కొత్త ప్రాంతమని భయమో బిడియమో తెలియదు గానీ ఆ నాటకంలో చిరస్మరణీయంగా పాడినాడు. ఈలలతో కేకలతో ఆ పేదజనం డబ్బుల దండలతో చీమకుర్తిని ముంచేశారు. వేదిక ఎక్కక ముందు ఆయన అనామకుడే. పాడి దిగిన తర్వాత ఆయన చుట్టూ వున్న జన సమూహాన్ని దాటుకుని ఆయన్ని చేరుకోవడానికి చాలా సమయం పట్టింది.



(బొమ్మ: పెంచల్దాస్)

పగలంతా పని చేసి అలసి పోయిన శ్రమ జీవులకు తన గాన మాధుర్యంతో 30ఏళ్ళ పాటు సేద తీర్చిన మహాకళాకారుడు చీమకుర్తి నాగేశ్వరరావు. ఆంధ్ర రాష్ట్రమే గాక ఇతర రాష్ట్రాలలో దాదాపు 3000 ప్రదర్శనలు ఇచ్చి రంగస్థలాన హరిశ్చంద్ర పాత్రకు జీవం పోసి తెలుగు గుండెలపై చెరగని ముద్ర వేసిన కళాకారుడు. తెలుగు నాట రోజుకో పద్యమైనా వినకుంటే పూటగడవని మాస్ ఫాన్స్ వున్నారు చీమకుర్తికి.



చీమకుర్తి భార్య వెంకమ్మతో పెంచల్దాస్

పగలంతా పని చేసి అలసిపోయిన శ్రమ జీవులకు తన గాన మాధుర్యంతో 30 ఏళ్ళ పాటు సేద తీర్చిన మహాకళాకారుడు చీమకుర్తి. ఆంధ్ర రాష్ట్రమే గాక ఇతర రాష్ట్రాలలో దాదాపు 3000 ప్రదర్శనలు ఇచ్చి రంగస్థలాన హరిశ్చంద్ర పాత్రకు జీవం పోసి తెలుగు గుండెలపై చెరగని ముద్ర వేసిన కళాకారుడు. తన ముందు తరం 'హరిశ్చంద్ర' పాత్రధారులైన బండారు రామారావు, డి.వి. సుబ్బారావు గార్లను అనుకరిస్తూనే అరుదైన స్వంత బాణీని ఏర్పరచుకున్నాడు. ఆ నడుమ కీ.శే. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తన 'పాడుతా తీయగా' ప్రోగ్రామ్‌లో ఔత్సాహిక గాయకుల చేత చీమకుర్తి పద్యాలు పాడించి 'ఇటువంటి సంగీతకారుణ్ణి నా జీవితంలో వినలేదు కనలేదు' అని వేనోళ్ళ పొగిడారు. ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న చీమకుర్తి గురించి ప్రస్తావిస్తూ, 'కళ తప్ప ఇంకేమీ తెలియని వాడు. భారతరత్నకు అర్హుడు' అని ప్రశంసించినారు. తెలుగు నాట రోజుకో పద్యమైనా వినకుంటే పూట గడవని మాస్ ఫాన్స్ వున్నారు చీమకుర్తికి.

2006లో చీమకుర్తి చివరి నాటకం నెల్లూరు టౌన్ హాల్‌లో జరిగింది. బొత్తిగా చిక్కిపోయినాడు. ఎముకల గూడుకు వేషం వేసినట్లుగా వుంది ఆయన రూపం. 'భక్తయోగ పదన్యాసి' పద్యమే పాడలేకున్నాడు. వేదిక ముందు అశేష జనవాహిని టిక్కెట్టు కొని మరీ వచ్చి వున్నారు. ఆ పద్యం కాకపోతే ఇంకో పద్యమైనా పాడతాడు అనుకుంటూ పడిగాపులు పడ్డారే గానీ, చీమకుర్తిని పల్లెత్తు మాట అనలేకపోయారు. 'అయ్యా నా ఆరోగ్యం బాగులేదు. డి.వి., బండారు– మేమంతా తాగి తాగి ఇట్టయినాము. మాలాగా ఎవరూ కాకూడదు' అంటూ మధ్య మధ్యలో జనానికి హితవు చెపుతున్నాడు. గాత్రం సహకరించక మధ్యలోనే స్టేజీ దిగిపోయాడు. దిగేముందు కన్నీటి పర్యంతమవుతూ చేతులు జోడించి నమస్కరిస్తూనే వున్నాడు. ఇది జరిగిన కొద్ది రోజులకే దేహయాత్ర చాలించాడు.

ఈమధ్య ఒకసారి చీమకుర్తికి పోయి రావాలనుకున్నాను. నాగేశ్వరరావు సగభాగం వెంకమ్మ గారు అక్కడే వున్నారు. అప్పుడే ఆయన వెళ్ళిపోయి 18ఏళ్లయ్యింది. ఆమె ఎలా ఉందో, ఆ కుటుంబం ఎలా వుందో చూసి రావాలనిపించింది. చీమకుర్తికి చేరుకునేసరికి మధ్యాహ్నం అయ్యింది. ఎన్నోసార్లు అగ్రహారం వచ్చినాను గానీ, ఇప్పుడు ఇల్లు కనుక్కోలేకపోయినాను. ఆ వీధి మొత్తం మారిపోయింది. ఎవరో ఇల్లు చూపించారు. కనీసం విద్యుత్ సరఫరా లేని ఆ చీకటి ఇంట్లోకి అడుగుపెట్టగానే కుక్కి మంచంలో లేవలేని స్థితిలో వున్న వెంకమ్మ నన్ను చూసి లేవబోయారు. ఆ స్థితిలో ఆమెను చూడగానే నా కళ్ళ వెంట కన్నీళ్లు కారాయి. ఒక్కగానొక్క కుమారుడు కూలిపని చేస్తూ వండి పెడుతున్నాడు. వెంకమ్మ గారు కాలు చెయ్యి ఆడి, తిరిగే రోజుల్లో పూట గడవక కూలి పనులకు వెళ్లేవారట. చీమకుర్తి నడిబొడ్డున అభిమానులు నాగేశ్వరరావు గారి విగ్రహం నిలిపిన చోట గంపలో జామకాయలు, వేరుశెనక్కాయలు పెట్టి అమ్ముకునే వారట. ఇప్పుడు అదీ లేదు. 'హృదయమున దుఃఖమింతేనియున్ పదిల పడదూ – మరతునన్నా సతీసుతుల్ మరుపురారు' అని పరితపిస్తూ కాటిసీన్లో భార్యాబిడ్డల్ని తలచుకొని దుఃఖించిన చీమకుర్తి నేడు వారి దీనస్థితిని చూడలేక ముదురు తమస్సులో మునిగిపోయినాడు. చీమకుర్తి కొండల్లో గుంకినాడు.

(జనవరి 21 చీమకుర్తి నాగేశ్వరరావు వర్ధంతి)

■ పుట్టా పెంచల్దాస్

✆ 63055 22467

కవితా సంపుటాలకు ఆహ్వానం

పాలమూరు సాహితీ అవార్డుల కోసం 2024 సంవత్సరంలో ముద్రితమైన వచన కవితా సంపుటాలు మూడేసి ప్రతులను జనవరి 31 లోగా చిరునామా: భీంపల్లి శ్రీకాంత్, ఇం.నం. 8538, టీచర్స్ కాలని, మహబూబ్ నగర్ – 509001కు పంపాలి. ఉత్తమ వచన కవితా సంపుటికి రూ.5,116/– నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేస్తారు. వివరాలకు: 90328 44017.

భీంపల్లి శ్రీకాంత్

వుప్పల నరసింహం యాది

జర్నలిస్ట్, రచయిత వుప్పల నరసింహం యాదిలో సభ జనవరి 21 మ.2గంటలకు బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్, సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియం, 1వ అంతస్తు, నిజాం కాలేజీ ఎదురుగా, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభాధ్యక్షులు వుప్పల బాలరాజు. జయధీర్ తిరుమలరావు, బి.ఎస్. రాములు, ఆడెపు లక్ష్మీపతి, కవి యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, తుమ్మలపల్లి రఘురాములు, శంకర నారాయణ, అనిల్ అట్లూరి, కె.పి. అశోక్ కుమార్, జంపాల ప్రవీణ్ తదితరులు ప్రసంగిస్తారు.

వనపట్ల సుబ్బయ్య

సోమవారం 20 జనవరి 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

ఊరి పద్యం

మా ఊరిప్పుడు
మహా రాకాసిలా సాగే బాట పక్కన
ముడుచుకు పడుకున్న కుక్క పిల్ల

మా ఊరిప్పుడు
మూడు కాళ్ళతో నడయాడే
ముదివగ్గుల వృద్ధాశ్రమం

మా ఊరిప్పుడు
దేశాల బాట పట్టిన బిడ్డల కోసం
ఎదురు చూసే చకోరం

మా ఊరిప్పుడు
పలకరింపును ఫోన్లలో
వెతుక్కునే యశోధర

మా ఊరిప్పుడు
సీరియళ్ళ ద్వేషాన్ని కప్పుకున్న
టీవీల జిలుగు తెర

మా ఊరిప్పుడు
భరోసా కోసం అంగలార్చే రైతుల
నాగేటి సాలు


మా ఊరిప్పుడు
కడుపు కోసం కైకిలయ్యే
కూలీల అన్నం ముద్ద

మా ఊరిప్పుడు
పింఛన్లు, రేషన్ కార్డుల మధ్య
నలుగుతున్న ఓట్ల పెట్టె

మా ఊరిప్పుడు
పాడె మోసే నలుగురి కోసం
వెతుక్కుంటున్న వల్లకాడు

■ వి.ఆర్. తూములూరి

✆ 97052 07945



మధ్యతరగతి స్త్రీ నా ఇతివృత్తం

– స్వాతీ శ్రీపాద

"There is no greater agony than bearing an untold story inside you" అని ఎప్పుడో మాయా ఏంజిలో అన్నట్టు స్వాతి శ్రీపాద ఎంత వేదనను మోస్తున్నారో బాల్యం నుంచీ– ఆరు దశాబ్దాలకు పైగా నిరంతర ప్రవాహంగా రాస్తూనే వున్నారు. కవిత, కథ, నవల, పాట– ఒకటేమిటి దాదాపు అన్ని ప్రక్రియల్లోనూ సృజించి తన ముద్ర చాటుకున్నారు. ఇప్పటికి ఎనిమిది కవితా సంపుటాలు, ఏడు నవలలు, ఆరు కవితా సంకలనాలు వెలువరించడంతోపాటు, తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల వారికి చేర్చాలనే ఉన్నతాశయంతో సుమారు మూడు డజన్ల పుస్తకాలను ఆంగ్లంలోకి అనువదించారు. ఆమె నేడు సుశీలా నారాయణ రెడ్డి సాహితీ అవార్డ్ అందుకుంటున్న సందర్భంగా ఆమెతో సంభాషణ.

ఇంటర్వ్యూ ■ దేశరాజు

1963 నుంచి రాస్తున్నా మీపై దిగంబర కవిత్వం, అరసం, విరసం ప్రభావాలు పడకపోడానికి కారణం?

చెప్పడానికి 1963 అని ఒక లెక్క చెప్పినా, ఒకటో తరగతిలో బీర్పూరు ప్రభుత్వ పాఠశాలలో పాటల పోటీ పెడితే నేను స్వంతంగా పాట అల్లుకుని పాడాననీ, బహుమతులుగా రిబ్బన్ ముక్క, రెండు రంగు చాకపీస్‌లూ, రెండు బలపాలూ ఇచ్చారని అమ్మ చెప్పేది. రాయాలన్న తపన జన్మాంతరాల నుండి తెచ్చుకున్నట్టున్నాను. 1963 నెహ్రూ మరణం అప్పుడూ ఏవో పేరడీ పాటలు రాసిన గుర్తు. అరసాలూ, విరసాలూ ఏవైనా సమాజంలో ఒక గుర్తింపు కోసమే. ఆరోజుల్లో విరసం రెండో వార్షిక సభలకు వెళ్ళాను. శ్రీశ్రీని సభలో ఎవరో అడిగారు 'విప్లవం మీ ఊపిరి అయితే, నా హృదయంలో నిదురించే చెలీ అని పాట ఎలా రాశారూ' అని. 'నా హృదయంలో నిదురించే చెలి విప్లవమే' అన్నారాయన. ఎన్ని విప్లవాలు నాలుక చివరి నుండి వచ్చినా, దెబ్బ తగిలితే అమ్మా అనే అంటాము, అన్నమే తింటాము. ఈ ప్రపంచం నడిచేది ప్రేమ మీదే అనిపించింది. బయట ఉద్యమ ప్రభావాలూ, ఇంట్లో ఛాందస భావాలూ ఏవీ నాపై ప్రభావం చూపలేదు.

కథ, నవలా రచనలో మీరు అనుసరించే రచనా వైఖరి ఏమిటి?

చిన్నప్పుడు విపరీతంగా చదువుతూ, సమస్యలకు రచనలో పరిష్కారాలు వెతుకున్న దశ తర్వాత, క్రమంగా నా చుట్టూ రోజువారీ జీవితంలో కనిపించే సమస్యలు, వాటి మూలాలు తీసుకుని నాకు తోచిన, నేను అభిలషించే పరిష్కారాలు అందించడం మొదలెట్టాను. అవే నా కథలు, నవలలు. అయితే నాకున్న పరిధిలో నా రచనలకు మూలాధారాలు మధ్య తరగతి స్త్రీల సమస్యలు. అలాగని అది ఫెమినిజం కాదు. స్త్రీలు ఎదుర్కొనే చిత్ర విచిత్రమైన సంఘర్షణలు. గుడ్డిగా ఏవైపూ పక్షపాతం చూపను. అందుకే కొన్నిచోట్ల సెంటిమెంట్‌కు విలువ ఇవ్వడం, తప్పని చోట నియమ నిబంధనలు తోసిరాజని అడుగు ముందుకు వెయ్యడం కనిపిస్తుంది.



చిన్నప్పుడు విపరీతంగా చదువుతూ, సమస్యలకు రచనలో పరిష్కారాలు వెతుకున్న దశ తర్వాత, క్రమంగా నా చుట్టూ రోజువారీ జీవితంలో కనిపించే సమస్యలు, వాటి మూలాలు తీసుకుని నాకు తోచిన, నేను అభిలషించే పరిష్కారాలు అందించడం మొదలెట్టాను. అవే నా కథలు, నవలలు.

తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదం చేసేప్పుడు ఎదురైన ప్రధానమైన ఇబ్బందులు ఏమిటి?

చాలా ఏళ్ళ పాటు తెలుగు గాలి కూడా సోకని ఉద్యోగంలో ఉండటం వల్ల నా ఆలోచన ఎప్పుడూ రెండు భాషల్లో సాగేది. అనువాదం నన్ను నేను పూర్తిగా పనిలో నిమగ్నం చేసుకునేందుకు ఇష్టంగా అలవరచుకున్న వ్యాపకం. నిజమే మన తెలుగు నుడికారాలూ, మనకే స్వంతమైన వ్యక్తీకరణలూ ఇంగ్లీష్‌లోకి రాలేవు. సంస్కృతి, ఆచార వ్యవహారాలూ, ఆహారపు అలవాట్లూ కొంచెం ఇబ్బందే. కాని మన భాషతో పాటు వాటినీ పరిచయం చెయ్యాలని నా అభిప్రాయం. అది మంచి అనువాదంగా అనిపించకపోవచ్చు. కాని మన శైలి, మన జీవన విధానం చెప్పలేకపోతే ఇక అనువాదాలెందుకు? మరొకటి మనం మనంగా కాక మరొకరిని దృష్టిలో పెట్టుకుని అనువదించడం. మన భావం స్పష్టంగా అన్యభాషీయులకు చేరాలి. రాజీ పడకపోతే కష్టమే.

తెలుగు పాటలను ఇంగ్లీషులోకి తీసుకెళ్లేప్పుడు ఎటువంటి పద్ధతులు అనుసరించారు? వ్యవహారికాలు, సామెతలు, మాండలిక పదాలు అనువాదానికి లొంగాయా?

జన్మతహా పాట మీద ఉన్న వ్యామోహం వల్ల కావచ్చు కొంత తెలీకుండానే ఆ దారిలోకి వెళ్ళాను. 'నేలమ్మా, నేలమ్మా' అనగానే వెంటనే అదే ట్యూన్‌లో 'మదర్ సాయిల్, మదర్ సాయిల్' అనాలనిపించింది. ఆ ఎంపిక తెలియాలంటే రెండు భాషలలో పద విజ్ఞానం పెంచుకోవాలి. నేను పేరుకో, గుర్తింపుకో అనువాదం చెయ్యడం లేదు. సో నో కాంప్రమైజ్. సామెతలు కొన్ని సరిసమానాలు ఉన్నాయి. లేనివి సృష్టించుకోవాలి. మాండలికాలూ అంతే. సరైన పదం కోసం రోజులకు రోజులు పని ఆపేసి ఆలోచించిన సందర్భాలెన్నో ఉన్నాయి.

ఆరు దశాబ్దాల సాహిత్య వ్యాసంగాన్ని అవలోకనం చేసుకుంటే ఏమనిపిస్తుంది?

ఆరేనా? నాతోపాటు పుట్టి నాతోనే సాగుతున్న ఈ కృషి అవలోకనం చేసుకోడమంటే నా జీవితాన్ని అవలోకనం చేసుకోడమే. ప్రతిక్షణమూ జీవితంలోనూ, సాహిత్యంలోనూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉన్నాను. ఏదో సాధించానని ఎప్పుడూ అనిపించదు.

కవిత, కథ, నవల, పాట, అనువాదం అన్ని ప్రక్రియల్లో చేయి తిరిగిన మీకు తగిన గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా?


ఏ గుర్తింపు కోసమో రాసుకోలేదు. రోజూ ఓ కవితో, పాటో రాస్తూనే ఉంటా. నలుగురితో పంచుకుంటా. చదివి ఆనందిస్తారని. చుట్టూ మనసుకు హత్తుకునే ఘటనలు, మనసును నొప్పించే మాటలు, మనసు మెలితిప్పే బాధలు అన్నీ కవిత్వం కాలేవు. ఏదో పరిష్కారం చెప్పాలన్న తపన కథలో తప్ప సాధ్యం కాదు, సుదీర్ఘమైన జీవితం ప్రస్తావించడానికి నవల తప్ప మరో దారిలేదు. రచన నా హెల్త్ డ్రింక్, రచన నా ఎనర్జీ బూస్టర్. అది నా ఊపిరి, ఉనికి. అవ్యక్తాన్ని వ్యక్తం చేసే బాధ్యత నాది.

కాళ్లకి మబ్బులు మొలిచి నింగిలో తేలిన హాయి!


నా మొదటి పుస్తకం

వసీరా

"**కాళ్లు** తడవకుండా సముద్రాన్ని దాటిన మేధావి కూడా, కళ్లు తడవకుండా జీవితాన్ని దాటలేడు" – ఇది నా మొదటి కవిత, ఆంధ్రజ్యోతిలో అచ్చయ్యింది. అచ్చులో తొలిసారి నా పేరు చూసుకున్న ఆశ్చర్యం ఆనందం అంతా ఇంతా కాదు. ఆ సంబరంలో ఆంధ్రజ్యోతి పేపర్ వచ్చే దుకాణాలకీ లైబ్రరీలకీ ఇళ్లకీ సైకిల్ మీద రయ్యిమంటూ పోయి, అక్కడి పేపర్లో కూడా నా పేరు ఉందని ఆశ్చర్యపోయి, మురిసిపోయాను. అమలాపురం ఊరంతా తోరణాలు కట్టినంత పని చేశాను. 1980లో అలా మొదలయ్యింది నా జర్నీ. నా కవితలు ఎక్కువగా ఆంధ్రజ్యోతి, ప్రజాసాహితి పత్రికల్లో వచ్చాయి. పుస్తక రూపంలో రాకముందే సంచార కవి పెమ్మరాజు గోపాలకృష్ణ ద్వారా పొయెట్రీ సర్కిల్స్ లోకి వెళ్లిపోయాయి. నా సమకాలికుల పుస్తకాలు ఒక్కటొక్కటే వస్తున్నాయి. నాకు టెన్షన్ మొదలయ్యింది. పుస్తకం వెయ్యాలి, కానీ డబ్బుల్లేవు. వాసిరెడ్డి నవీన్ సొంత డబ్బుతో 'లోహనది' పుస్తకం అచ్చు వేశాడు. డబ్బు దగ్గర నుండి, శివారెడ్డి గారిచేత ముందు మాట రాయించడం, శీలావీర్రాజు గారి చేత కవర్ పేజీ బొమ్మవేయించడం, ప్రెస్సు వాళ్లతో మాట్లాడ్డం మొదలైన నొప్పులన్నీ తనే పడ్డాడు. అంచేత నాకు నొప్పి తెలియలేదు. 'లోహనది' లో కవిత్వం నచ్చిన శీలా వీర్రాజుగారు కూడా మిగతావాటికి భిన్నంగా అధివాస్తవిక ముఖచిత్రం వేసి ఇచ్చారు. హ్యాండ్ కంపోజింగ్. 'ఝరీ' పొయెట్రీ సర్కిల్ తరపున 1989 ఆగస్టులో పుస్తకం వచ్చింది. వెల పది రూపాయలు. చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీలో పోలీసు, సిఆర్పీ దళాల పహారాలో కిక్కిరిసిన జనం మధ్య పుస్తకా విష్కరణ జరిగింది. జైలు నుండి విడుదలైన వరవరరావు గారు పాల్గొన్న మొదటి సమావేశం అది. కారా మాస్టారు పుస్తకం ఆవిష్కరించారు. దేవిప్రియ అధ్యక్షుడు. వివి, శివారెడ్డి ప్రధాన వక్తలు. పెమ్మరాజు గోపాలకృష్ణకు అంకితం ఇచ్చాను. ఆయన తొలి ప్రతి స్వీకరించారు. పుస్తకం మొదటి కాపీల కట్ట విప్పి పుస్తకం చూసిన వెంటనే తీవ్రభావోద్వేగానికి గురయ్యాను. పుస్తకాల్ని కాసేపు గుండెకు హత్తుకుని ఉంచుకున్నాను. సభలో వివి అద్భుతంగా మాట్లాడారు. సభానంతరం ఆటోగ్రాఫులు ఇవ్వడం, పుస్తకాల మీద సంతకం చేసి ఇవ్వడం గొప్ప సంతోషం. పుస్తకానికి మంచి స్పందన లభించింది. ప్రగతిశీల శిబిరాలు ఇందులో కవిత్వాన్ని ఓన్ చేసుకున్నాయి. వసీరా ఏం చెప్పినా కవిత్వమే చెప్పాడంటూ చేకూరి రామారావు ఆంధ్రజ్యోతిలో 'చేరాతలు' కాలమ్‌లో రాశారు. ప్రసవం తర్వాత బిడ్డ అందచందాలని గుణగణాల్నీ పదిమందీ మెచ్చుకుంటే ఆ కిక్కే వేరు. నిప్పుల్ని మింగి, ఎన్నో నొప్పుల్ని భరించి కవితలు రాసిన బాధంతా మర్చిపోయి, ఒక్కసారి కాళ్లకి మబ్బులు మొలిచి నింగిలో తేలిన హాయి. 'లోహనది'కి గరికపాటి, ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డులు వచ్చాయి. ఆ డబ్బుతో వాసిరెడ్డి నవీన్ బాకీ తీర్చేశా. కానీ ఇప్పటికీ రుణపడే ఉన్నాను. దాదాపు 30ఏళ్ల తర్వాత 'లోహనది'లో కవితలు ఇప్పటికీ రిలవెంట్ అని భావించి మిత్రులు శ్వేత యర్రం, మల్లికార్జున్ తమ అజు పబ్లికేషన్స్ నుండి రీప్రింటు వేశారు. 80 దశకాన్ని రిప్రజెంట్ చేసే కవిత్వ పుస్తకాల్లో 'లోహనది' ఒకటి కావడం, ఇప్పటి వారికీ బాగా నచ్చడం సంతోషకరం.







- నామినేటెడ్‌తో పాటు డీసీసీ పదవుల భర్తీకి కసరత్తు
- జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల భర్తీకి సైతం సన్నాహాలు
- డీసీసీ అధ్యక్షులుగా ఎమ్మెల్యేలకే అధిష్ఠానం అవకాశం
- సీనియర్లు, కీలక నేతల చేతుల్లోకి వెళ్లనున్న డీసీసీ పగ్గాలు
- రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో చోటు కోసం నేతలు ప్రయత్నాలు
- మంత్రివర్గ విస్తరణపై ఎమ్మెల్యేల ఆశలు
- ఈ నెలఖారులోగా కీలక పదవుల్లో నియామకాలపై టీపీసీసీ దృష్టి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉత్కంఠగా మారిన పదవుల కేటాయింపు



ఆశల పల్లకీలో..

కాంగ్రెస్ పార్టీలో మొదలైన పదవుల పందేరం

వివరాలు : 7 లో..

ఎన్నాళ్లో వేచిన సమయం.. నేడు దరికి వస్తున్న సందర్భంలో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇటీవలే ఏడాది పాలన పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో సీటు ఆశించి భంగపడ్డ నేతలు, జిల్లా స్థాయిలో పార్టీని ఏళ్లతరబడి పట్టుకుని కష్టించిన కార్యకర్తలకు అధిష్ఠానం తీపి కబురు చెప్పింది. త్వరలో రాష్ట్రంలో నామినేటెడ్‌తో పాటు పార్టీ పదవులు కేటాయింపు ఉంటుందని ప్రకటించింది. దీంతో నేతల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ మేరకు రాష్ట్ర, జిల్లాస్థాయి నేతలు పదవుల కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. తమ తమ గాడ్‌ఫాదర్ల ద్వారా అధిష్ఠానానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. ఇదిలా వుంటే డీసీసీ పదవులను జిల్లాలోని శాసనసభ్యులకే ఇవ్వాలని పార్టీ సూత్రప్రాయంగా నిర్ణయించిన నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు డీసీసీలు ఏఏ ఎమ్మెల్యేలకు కేటాయిస్తారనే చర్చ తీవ్రంగా నడుస్తోంది. కొన్ని జిల్లాల్లో ఎమ్మెల్యేలు డీసీసీ పదవులను తీసుకునేందుకు సుముఖంగా లేరని తెలుస్తున్న క్రమంలో ఇంకా ఎవరికి ఆ పదవులు లభిస్తాయనేది ఉత్కంఠగా మారింది. అలాగే మంత్రివర్గ విస్తరణపై కూడా ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తీవ్రంగా ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి మంత్రులుగా కొండా సురేఖ, దనసరి అనసూయ ఉన్న నేపథ్యంలో మరో మంత్రి పదవి కోసం ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే, ఎంపీ సీటు ఆశించి.. సమీకరణాల్లో కోల్పోయిన నేతలు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులపై కన్నేశారు. ఈ మేరకు ఆయా ఎమ్మెల్యేల ద్వారా సిఫారసు చేసుకుంటున్నారు. లేదంటే టీపీసీసీ పదవుల్లోనైనా అవకాశం కల్పించాలని కోరుకుంటు న్నారు. కాగా, ఈ నెలాఖరులోగా పదువులను భర్తీ చేసేందుకు అధిష్ఠానంగా ప్రయత్నిస్తుండగా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎవరికి నామినేటెడ్, పార్టీ పదవులు వస్తాయనేది ఉత్కంఠగా మారింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



లలితా జువెల్లరీ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ సుధారాణి, ఎం.డి. కిరణ్‌కుమార్

వ్యాపార కేంద్రంగా వరంగల్

- హైదరాబాద్ తరహాలో అన్ని వసతులు
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- హనుమకొండలో లలితా జువెల్లరీ షోరూమ్ ప్రారంభం

7



బేరాలు కుదిరాయి!

- ఉపాధ్యాయుల పరస్పర బదిలీల్లో బయటపడుతున్న లీలలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 332 దరఖాస్తులు
- కాసుల కోసం మరో పదిరోజుల్లో రిటైర్డ్ అవుతున్న వారి కక్కుర్తి
- చేతులు మారునున్న సుమారు రూ.50 కోట్లు

7

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ధార్మిక భవన్ ఫర్నిచర్ కొనుగోళ్లలో అక్రమాలు

- దేవాదాయ శాఖ గత డీసీ చేతివాటం
- నిగ్గుతేల్చిన విచారణ నివేదిక.. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

6

గ్రామ సభల ద్వారానే లబ్ధిదారులను గుర్తించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద
- తిమ్మంపేట, వంచనగిరిలో సర్వే పరిశీలన

దుగ్గొండి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సభల ద్వారానే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, అధికారుల సర్వే పరిశీలన జాబితాలను సభలో తెలియజేస్తారని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద తెలిపారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల గుర్తింపు సర్వేను ఆదివారం కలెక్టర్ సత్యశారద క్షేత్రసాయిలో పరిశీలన చేశారు. అధికారులు సమన్వయంతో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. జాబితాలో పేరులేకుంటే అర్హులైవారు రేషన్ కార్డుల కోసం దరఖాస్తుచేసుకోవాలని, భూమి లేకుండా ఉపాధి జాబ్ కార్డులు ఉండి పని చేసిన వారికి ఆత్మీయ భరోసా వస్తుందన్నారు. జాబితాలలో పేరు లేకుంటే ఆందోళన చెందొద్దని, మళ్లీ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని గ్రామస్థులకు తెలిపారు. ఈ సందర్భంగా కుమ్మరికుంట్ల సమ్మక్క అనే వృద్ధురాలు భూమిలేదని, వ్యవసాయ కూలీ పనులు చేస్తానని, ఆత్మీయ భరోసా అందించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు. గ్రామంలో శాశ్వత కార్యదర్శిని నియమించాలని, చెరువుల తూములు లీకేజీ అవుతున్నాయని గ్రామస్థులు కలెక్టర్ దృష్టికి తీసుకపోయారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఆర్డీవో ఉమారాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి కిష్టయ్య, ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, కార్యదర్శి శశిధర్, ఎస్ఏ సుమలత, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.



వంచనగిరిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద



తిమ్మంపేటలో ఆత్మీయ భరోసాను అందించాలని కలెక్టర్‌ను వేడుకుంటున్న వృద్ధురాలు సమ్మక్క

సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ

గీసుగొండ(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందించే విధంగా పగడ్బందీ సర్వేను చేయాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ సత్యశారద సూచించారు. మండలంలోని వంచనగిరి, ఊకల్ గ్రామాల్లో నిర్వహించిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల సర్వేను ఆమె ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సేకరించిన సర్వే డాటాను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని చెప్పారు. భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సాగు వ్యవసాయ భూములు ఉన్నవారికి రైతు భరోసా, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు అందిస్తామని చెప్పారు. ఈనెల 26 నుంచి సంక్షేమ పథకాలు అందించనున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల అమలు పట్ల ప్రజలు ఎటువంటి అపోహలు పడొద్దన్నారు. సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ సత్యశారద స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, మండల ప్రత్యేక అధికారి సురేష్, తహసీల్దార్ రియాజుద్దిన్, ఏవో హరిప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రజావాణి రద్దు

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల సర్వే నేపథ్యంలో ప్రజవాణి రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి వినతులు అందించేందుకు కలెక్టరేట్‌కు ఎవరూ రావద్దని ప్రకటనలో కలెక్టర్ సూచించారు.

వరంగల్‌లో..

వరంగల్ కలెక్టరేట్: వరంగల్ కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజవాణి కార్యక్రమాన్ని ఈ వారం రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సత్యశారద తెలిపారు. జిల్లాలో రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల సర్వేలో అధికారులు నిమగ్నమై ఉన్నందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలెవరూ కలెక్టరేట్‌కు రావద్దని సూచిస్తూ ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

ఓవరాల్ చాంపియన్ ఏఆర్

- ముగిసిన పోలీసు కమిషనరేట్ క్రీడోత్సవాలు
- విజేతలకు బహుమతులు పంపిణీ చేసిన సీపీ

వరంగల్ క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ -2025 పోటీల్లో సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు వివిధ క్రీడల్లో 125 పతకాలను గెలుచుకొని ఓవరా ల్ చాంపియన్‌షిప్‌గా నిలిచింది. ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు జేఎన్ఎస్, కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ పాఠశాలలో నిర్వహించిన పోలీసు కమిషనరేట్ పరిధిలోని పోలీసుల క్రీడలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఈ పోటీల్లో కమిషనరేట్‌లోని మూడు జోన్‌ల నుంచి ఐదు జట్లుగా వివిధ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఈస్ట్‌జోన్ 51 పతకాలు, సెంట్రల్ జోన్ 50, వెస్ట్‌జోన్ 19, మరొక జట్టు 21 పతకాలను గెలుచుకోగా.. సీపీ అంబర్ కిషోర్ ఝా బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు వేడుకల సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ జట్టు, డీసీపీ జట్టు మధ్య జరిగిన టగ్ ఆఫ్ వార్‌లో సీపీ జట్టు విజయం సాధించింది.

అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. నిరంతర విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు ఈ క్రీడలు ఉల్లాసాన్ని కలిగించాయన్నారు. పోలీసు కమిషనరేట్‌లో ప్రదర్శించినట్లుగానే త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడల్లో అదే ప్రతిభ చూపాలని సూచించారు. ఈ కార్య క్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వెస్ట్‌జోన్ డీసీపీ రాజ మహేంద్రనాయక్, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏఎస్పీ చేతన్, ఏసీపీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచిన ఏఆర్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న సీపీ



సీపీని ఎత్తుకొని గ్రౌండ్‌లో కేరింతలు కొడుతున్న ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, తిరుమల్, సీఐలు పుల్యాల కిషన్, రవికుమార్

అదనపు కలెక్టర్లకు గురుకులాల బాధ్యత

- ఇక తరుచూ ఆకస్మిక తనిఖీలు
- బాలికల గురుకులాలకు మహిళా ఐఏఎస్ అధికారులు

6

కొత్తకొండలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

సెలవు రోజున వీరభద్రస్వామి దర్శనానికి తరలివచ్చిన జనం



కొత్తకొండ ఆలయంలో కిక్కిరిసిపోయిన భక్తుల రద్దీ

భీమదేవరపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలు ముగిసిన కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతుంది. శనివారం స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగి సాయి. బ్రహ్మోత్సవాలు ముగిసిన మొదటి ఆదివారం తెలంగాణ ప్రాంతంలోని ఆర్యవైశ్యులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లిస్తారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్, హైద్రాబాద్, సిద్దిపేట, కరీంనగర్, నల్గొండ, తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించారు. వీరభద్రస్వామికి ప్రీతిపాత్రమైన కోరమీసాలు, గుమ్మడికాయలు, కోడె మొక్కులు చెల్లించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత ఆలయానికి వచ్చి వీరభద్రస్వామికి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. సుజాతకు ఆలయ ఈవో కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, డైరె క్టర్ విక్రమ్‌లు శాలువా, స్వామివారి జ్ఞాపికతో సత్కరించారు. ఆదివారం ఉదయం భక్తుల రద్దీ ఎక్కువగా ఉందని, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్, వంగర ఎస్ఐలు సాయిబాబు, దివ్య లు బందోబస్తును పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల మొక్కులు వీరభద్రస్వామికి కొనసాగుతూనే ఉన్నాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కిషన్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



వీరభద్రస్వామికి మొక్కులు చెల్లిస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సుజాత

ఐలోని మల్లన్నకు ఘనమైన మొక్కులు

ఐనవోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతర పూర్తయ్యాక మొదటి ఆదివారం వారాంతపు జాతరకు భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు వివిధ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేసి పట్నాలు వేసి బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాలు వేసి పూర్వికులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెకించి కోర్కెలు తీర్చమని మల్లన్నను వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు. మరికొందరు రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవ విగ్రహాలను పెట్టి ఆలయం చుట్టు లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్ రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మల్లన్న స్వామి రథం లాగుతున్న భక్తులు

మొదటి ఆదివారం జాతరకు తరలివచ్చిన భక్తజనం



ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో బోనాలతో వస్తున్న భక్తులు

ధార్మిక భవన్ ఫర్నిచర్ కొనుగోళ్లలో అక్రమాలు

- దేవాదాయ శాఖ గత డీసీ చర్యపై విచారణ
- నిగ్గుతేల్చిన విచారణ నివేదిక
- ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

హనుమకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా నిర్మించిన ధార్మిక భవన్‌కు నిబంధనలకు విరుద్ధంగా రూ.18 లక్షలు వెచ్చించి ఫర్నిచర్ కొనుగోలు జరిగిం దని దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ నిర్ధారిం చారు. ఫర్నిచర్ కొనుగోలుపై నిషేధం ఉన్నప్పటికీ ఇందుకు విరుద్ధంగా కొనుగోలు జరిగిందని స్పష్టం చేశారు. ఈ ఫర్నిచర్ కొనుగోలు చేసిన గత డిప్యూటీ కమిషనర్ చర్యను తప్పుబట్టారు. ధార్మిక భవన్ ఫర్నిచర్ కొనుగోలుపై గత సంవత్సరం ఏప్రిల్ 8న 'దేవుడి సొమ్ముకు ఎసరు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై దేవాదాయ శాఖ విచారణకు ఆదేశించడంతో ఈ బాగోతం బయటపడింది.

ఫర్నిచర్‌కు రూ.30లక్షలు

ధార్మిక భవన్‌కు ఫర్నిచర్ కోసం మరో రూ.30 లక్షలను వెచ్చించారు. ఇంతకు ముందున్న పాత ఫర్నిచర్‌ను మూలకు పడేసి ఈ డబ్బుతో కొత్త ఫర్నిచర్‌ను కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి స్పందించిన దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ విచారణకు ఆదేశించారు. దేవాదాయశాఖ అదనపు కమిషనర్-2 ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపారు. మొత్తం రూ.30 లక్షల్లో రూ.18.47 లక్షలు ఫర్నిచర్ కోసం వాడుకోగా, మిగతా సొమ్ము రూ.11.52లక్షలు డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ సంయుక్త ఖాతాల్లో జమ చేసినట్టు తెలిసింది.



ధార్మిక భవన్ ఇదే..

నిషేధం ఉన్నా..

నిజానికి ఫర్నిచర్ కొనుగోలుపై 2001 నుంచే నిషేధం అమలులో ఉన్నది. అయితే ప్రభుత్వ శాఖలు, ప్రజారంగ సంస్థలు, ప్రభుత్వ సొసైటీలు తమకు అవసరమైన ఫర్నిచర్‌తో పాటు స్టేషనరీ, ఎన్నికల సరంజామా, ముద్రిత పుస్తకాలు మొదలైనవి కొనుగోలు చేయడానికి హాకాను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం నియమించింది. ఏ వస్తువైనా దీని ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని 2017లోనే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ప్రధానంగా ఫర్నిచర్‌ను 2026 మే వరకు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని స్పష్టంగా ఆదేశించింది. అయితే నిషేధం అమలులో ఉన్న విషయాన్ని దాచిపెట్టి డిప్యూటీ కమిషనర్ ఫర్నిచర్ కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవడాన్ని విచారణలో తప్పుబట్టారు పైగా నోడల్ ఏజెన్సీ అయిన హాకా నుంచి కాకుండా ఈ ఫర్నిచర్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థ అయిన మెస్సర్స్ గోల్కొండ నోడల్ ఏజెన్సీ నుంచి కొనుగోలు చేయడం గమనార్హం.

దామోదర్ ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపించాలి

- తక్షణమే బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి
- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్

మహబూబాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ మావోయిస్టు రాష్ట్ర కార్యదర్శి బడె చొక్కారావు (అలియాస్ దామోదర్) ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఆయన పేరిట మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి ఆదివారం పంపిన ఒక ప్రకటనలో పలు అంశాలను వెల్లడించారు. ఈనెల 16న ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా పూజారి కంకేర్ మారేడు బాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చొక్కారావుతో పాటు మరో 17 మంది మావోయిస్టులు మృతి చెందారని చెప్పారు. గత కొన్ని దశాబ్దాలుగా మధ్య భారతంలోని అడవులపైన, అందులోని సహజ సంపదలు, గనులు, ఖనిజాలపైన కార్పొరేట్ శక్తుల కన్ను పడిందన్నారు. భారతదేశం ప్రపంచంలోని అన్ని దేశాల కంటే ఎంతో సుసంపన్నమైన దేశమని, సకల సంపదలతో నిండి ఉన్న దేశం, ఈ సంపదలను అనాదిగా ఆధిపత్య శక్తులు, బడా బూర్జువా, భూస్వామ్య, నిరంకుశ, దోపిడీ శక్తులు, పాలకవర్గాలు అనుభవిస్తూ వచ్చాయన్నారు. దేశాన్ని అనేక వందల సంవత్సరాలుగా పరిపాలించిన బ్రిటిష్, ఫ్రెంచ్, డచ్ తదితర వలసవాదులు కొల్లగొట్టారన్నారు. తెల్లదొరలు పోయినా.. తర్వాత నల్ల దొరలు ఈ దేశాన్ని తిరిగి బడాబడా విదేశీ కంపెనీలకు, కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ వారు దోపిడీ శక్తులతో కుమ్మక్కయ్యారని తెలిపారు.

కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపిన కేంద్రం..

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా స్వదేశీ జపం చేస్తూ.. విదేశీ కంపెనీలతో, స్వదేశీ పెట్టుబడి దారులతో, కార్పొరేట్ శక్తులతో చేతులు కలిపిందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ ఆరోపించారు. రామ నామం పేరుతో ప్రజలను దారి మళ్లించి, హిందుత్వం పేరుతో దేశంలోని ప్రజలను రెచ్చగొడుతూ, కులాల మధ్య చిచ్చు పెడుతూ.. జాతుల మధ్య మంట రాజేస్తున్నారని చెప్పారు. బ్రిటిష్ పాలకుల మాదిరిగానే విభజించు, పాలించు అన్న కుటిల నీతిని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజల ఆలోచనలను దారి మళ్లిస్తూ యువతకు ఉద్యోగ కల్పన చేయకుండా వారిని మత చాంధస వాదంలోకి దింపుతూ సకలరంగాలను ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్రిటిష్ వారు అనుసరించిన ఎత్తుగడలనే ఈ హిందు ఫాసిస్టు పాలకులు సైతం అనుసరిస్తూ దేశాన్ని పూర్తిగా దివాళ తీయిస్తున్నారన్నారు. ప్రజలు, పౌరులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు అందరూ ఈ సత్యాన్ని గుర్తించాలన్నారు. దేశం హిం దు ఫాసిజపు ప్రమాదంలో మునిగిపోతుందన్నారు. ఈ కుట్రల్లో భాగంగానే మధ్య భారతంలో ఆదివాసీలు, మావోయిస్టులపైన కేంద్రప్రభుత్వం యుద్ధానికి దిగుతోందన్నారు. ఆదివాసీల గూడాలను తగులబెడుతూ ఖాళీ చేయిస్తూ క్యాంపుల్లో నిర్బంధిస్తూ అక్రమ కేసుల పేరిట వారిని జైల్లో పెడుతున్నారన్నారు. ప్రశ్నించే గొంతులను నులిమివేస్తుంటే దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ఈ దేశ సంపదను కాపాడేందుకు పోరాడుతున్న ఆదివాసీలకు, ఉద్యమకారులకు, విప్లవకారులకు సంఘీభావం ప్రకటించాలని, కేంద్రప్రభుత్వ ఫాసిస్టు విధానాలను ప్రతిఘటించాలని, బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు.

నిట్‌లో సైన్స్ కమ్యూనికేషన్‌పై సదస్సు


సైన్స్ కమ్యూనికేషన్‌పై వర్క్‌షాపులో పాల్గొన్న ప్రతినిధులు

హనుమకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్, స్కోప్ ప్రాజెక్టు, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, జనవిజ్ఞాన వేదిక సంయుక్తాధ్వర్యంలో సైన్స్ కమ్యూనికేషన్‌పై ఒక రోజు వర్క్‌షాపు జరిగింది. ఆచార్య అంజనేయులు సంధానకర్తగా వ్యహరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆఆర్య రామరాజు జీవ పరిణామ సిద్ధాంతం, సైన్స్ బయో మెటీరియల్స్ జనరేషన్‌పై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. డాక్టర్ రాములు జీవ పరిణామ సిద్ధాంతాన్ని రుజువులతో తెలియచేశారు. ఎన్విరాన్‌మెంటల్ సబ్ కమిటీ కన్వీనర్ కేబీ ధర్మప్రకాష్ గో గ్రీన్ బ్రీతింగ్ టుమారో అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. మీట్ ది సైంటిస్ట్ కార్యక్రమంలో భాగంగా ఆచార్య రామరాజు రిటైర్డ్ అటవీ అధికారి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం వర్క్‌షాపునకు హాజరైన వారి సందేహాలను నివృత్తి చేశారు. ప్రధాన కార్యదర్శి రామంచ బిక్షపతి, జిల్లా నాయకులు పరికిపండ్ల వేణు, సుమలత, వకుళాభరణం శ్రీనివాస్, వందన, సుమతి, డాక్టర్ ప్రభాకర్ చారి, రాధా క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డుల వివరాల నమోదు ప్రారంభం

కాజీపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురిలో ఆదివారం లేబర్‌కార్డుల వివరాల నమోదు కార్యక్రమం జరిగింది. మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలనీలోని 100మంది లేబర్‌ల వివరాలు సేకరించి నమోదు చేశారు. ఈ సందర్భంగా గుంటి కుమారస్వామి మాట్లాడుతూ.. ప్రతీ ఆది, సోమవారాల్లో ఈ నమోదు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ నెలాఖరు వరకు వివరాలు సేకరించి సుమారు 500 మందికి లేబర్ కార్డులు అందజేస్తామని చెప్పారు. స్థానికులు పాల్గొన్నారు.

అగ్గలయ్య గుట్టపై గగ్గలయ్య గది

- దిగువ భాగాన సన్యాసుల గది
- అంతుచిక్కని రహస్యం
- ఆశ్చర్యం గొలిపే చారిత్రక చిహ్నం


అగ్గలయ్య గది

హనుమకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ చౌరస్తాకు సమీపంలోని అగ్గలయ్య గుట్టపై అంతుచిక్కని రీతిలో నిర్మించిన ఒక అగ్గలయ్య నివసించినట్టు చెబుతున్న గదిని, గుట్ట దిగువ భాగాన సన్యాసులు నివాసమున్నట్టుగా భావిస్తున్న మరో గదిని చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి కొనుగొన్నారు. పరిశోధకులు ఓంకార్, మహేష్, నితిన్ బృంద ంతో కలిసి మరోసారి భద్రకాళి చెరువు, అగ్గలయ్య గుట్టను సందర్శించి పలు కొత్త చారిత్రక అంశాలను గుర్తించారు.

రహస్యంగా గగ్గలయ్య గది

భద్రకాళి చెరువుకు అభిముఖంగా సమీపం లో ఉన్న భైరవ శిల్పం మీదుగా ఇరవై అడుగుల ఎత్తులో ఒక నిర్మాణం ఉంది. సుమారుగా పది అడుగుల ఎత్తులో పది అడుగుల వెడల్పు, నలభై అడుగుల పొడవులో ఉన్న ఒక పడగ రాయి కింద తొలిచిన భారీ శిలలతో ఒక శత్రుదుర్భేద్యమైన నిర్మాణం ఉంది. ఒక్కో శిల కొన్ని టన్నుల బరువు ఉంటుంది. ఈ శిలలను కదిలించడంగానీ, నిలబెట్టడం గానీ అసామాన్య విషయం. ముఖ ద్వారంగా ఉన్న శిలలు పడిపోయాయి. లోపల ప్రస్తుతం రెండు గదులు కనిపిస్తున్నాయి. ఒక గది నుండి మరో గదిలోకి వెళ్లడానికి గది వెనుక వైపు వెళ్లడానికి రెండు అడుగుల వెడల్పు, మూడు అడుగుల ఎత్తులో మహా ఇరుకైన రాతి ద్వారాలు ఉన్నాయి. గది వెనుక ఒక రోలు ఉంది. రాతి గోడలకు ఒకప్పుడు వేసిన డంగు సున్నం పొర ఊడిపోయింది. లోపల ఎటువంటి విగ్ర హాలు కానీ, దేవాలయ ఛాయలుకానీ లేవు. వెలుతురు వచ్చే మార్గం లేదు. ముందు గదిలో ఒక మూలన దిగువన చిన్న రంధ్రం ఉంది. ఈ రంధ్రం వెలుపలి వైపు, గది పై భాగంలో ఎరుపు రంగుతో వేసిన అస్పష్టంగా ఉన్న ఒక చిత్రం ఉంది. స్థానికులను అడిగితే దానిని అగ్గలయ్య గదిగా చెబుతున్నారు.

సన్యాసుల గది

అగ్గలయ్య గుట్టపై నుండి కిందకు దిగి, చెరువు అంచున ప్రమాదకర కొండవాలు నుంచి పాదాలు పట్టేంత సందులో పక్కపక్కనే రెండు దారులు ఉన్నాయి. ఈ దారి ఇరుకైన శిలల మధ్య గుండా సాగి చెరువులోకి వెళుతోంది. ఈ తోవ సమీపంలోనే గగ్గలయ్య గది ఉంది. ఈ గది ఇప్పటి వరకు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉంది. భైరవ గుట్ట, అగ్గలయ్య గుట్టను కలుపుతూ సుమారు 30 అడుగుల ఎత్తులో చెరువు కట్ట ఉంది. కట్ట చివరలో భైరవగుట్టకు ఆనుకొని ఎత్తు తక్కువగా ఉన్న పడగ రాయి కింద ఇటుకలతో నిర్మించిన మరోక గది ఉంది. ఈ గదిలో సన్యాసులు ఆవాసం చేసుకొని ఉండవచ్చనని భావిస్తున్నారు.

వినాయక శిల్పాలు

భద్రకాళి చెరువు మత్తడిపై హనుమద్గిరి తటాకాంజనేయ స్వామి దేవాలయం ఎదురుగా పక్కపక్కనే ఉన్న రెండు శిలల మధ్య నుంచి చెరువు మత్తడివైపు వేళ్లే మార్గం ఉంది. ఈ రెండు ఎత్తైన శిలల శిఖరాగ్రంలో 10వ శతాబ్దం నాటి తూ ర్పు, ఉత్తర ముఖంగా చెక్కిన రెండు వినాయక శిల్పాలు ఉన్నాయి. అగ్గల య్య గుట్ట భైరవ గుట్ట మధ్య నుంచి వెళ్లే దోవ చివరకు చెరువుకు ఆనుకొ ని శిథిల దేవాలయ ఆనవా ళ్లు, పడి ఉన్న ఒక శివలిం గం, ఆలయ స్తంభాలు ఉన్నాయి. చెరువు నిండితే నీటిలో మునిగే ఒక శిలకు సౌష్టవంగా, శిల్పకళతో ఉట్టిపడే కాకతీయుల నాటి భైరవ శిల్పం పూజలు అందుకుంటున్నది.


గగ్గలయ్య గది దిగువన భైరవ శిల్పం

డంపింగ్ యార్డును ఎత్తేసేదాకా విశ్రమించం..

- చెత్తతో మేమెందుకు అనారోగ్యం పాలు కావాలి..
- మడికొండలో సమావేశమైన డంపింగ్ పొగ బాధిత ప్రజలు


నూతనంగా ఏర్పడిన డంపింగ్ నిర్మూలన కమిటీ సభ్యులు

మడికొండ, జనవరి 19 (అంధ్యజ్యోతి) : మడికొండ, రాంపూర్ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్ స్థానిక, పరిసర గ్రామాల ప్రజల పాలిట శాపంగా మారిందని, ఈ డంపింగ్ యార్డును అక్కడి నుంచి ఎత్తేసేదాకా విశ్రమించేది లేదని డంపింగ్ బాధిత ప్రజలు ప్రతినబూనారు. చెత్త డంపింగ్ యార్డు నుంచి ప్రతీరోజూ వెలువడే అనేక రకాల విషపూరితమైన రసాయనాలతో కూడిన పొగ గ్రామాలను కమ్మేసి ప్రజలను తీవ్ర అనారోగ్యం పాలు చేస్తోందన్నారు. చాపకింద నీరులా గ్రామాలకు విస్తరించి ప్రాణాలను హరిస్తోందన్నారు. ఈ విషయమై డంపింగ్ బాధిత ప్రజలందరూ ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సమావేశమయ్యారు. ఈ మేరకు మేధావులు, యువకులు, విశ్రాంత అధికారులు మద్దెల ఎర్రగట్టుస్వామి, పొనగోటి వెంకట్రావు, పెండ్లి క్రిష్ణమూర్తి, కరుణాకర్, పులియా. తౌటిరెడ్డి రాజిరెడ్డి, దువ్వ నవీన్, పొనగోటి వెంకట్రావు, బోగి మహేందర్, ఫారూక్, తొట్ల రాజుయాదవ్, దండిగం సతీష్, భైరి లింగమూర్తి, బొల్లికొండ వినోద్, గడ్డం మహేందర్, పైడిపాల రఘుచందర్, దువ్వ కిషన్, బుర్ర శ్రీధర్‌గౌడ్, కామని మల్లేష్, జవ్వాజి కిషన్, పెద్ది శంకర్, పేపర్ రవి, భైరి సాంబరాజు, మడ్డి రాజారాం, సుధాకర్, ఎల్. రవిందర్, తదితర 25 మందితో కూడిన ఒక అడహక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. విధి విధానాలు రూపొందించుకొని సమస్య పరిష్కారం కోసం ముందుకు సాగేలా ప్రణాళికలు రూపొందించుకునేందుకు సమాయత్తమయ్యారు. ఈ సమావేశంలో పలువురు మేధావులు, యువకులు మాట్లాడి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ వరంగల్ చైర్మన్ పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ.. మునిసిపల్ యంత్రాంగం, రాజకీయ నాయకులు నిర్లక్ష్యంతోనే డంపింగ్ భూతం ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. ప్రతీరోజూ మెడికల్, ఎలక్ట్రికల్, బయో మెడికల్, జంతు కళేబరాలతో కూడిన వ్యర్థాలు 450 టన్నుల చెత్త డంపింగ్ యార్డుకు వస్తోందన్నారు. ఈ వ్యర్థాలు బయో మైనింగ్, బయో క్యాపింగ్ వంటి ఎలాంటి ప్రాసెసింగ్ చేయలేని విధంగా చెత్తగుట్టలు పేరుకుపోయి పెద్దమొత్తంలో విషపూరితమైన మీథేన్ వాయువులు గాలిలో కలిసి ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్నాయని తెలిపారు. విశ్రాంత ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టుస్వామి మాట్లాడుతూ.. నగరంలోని చెత్త అంతా తమ గ్రామంలో వేసి అనారోగ్యం పాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. డంపింగ్‌యార్డును ఎత్తివేసే వరకు ఎంతవరకైనా పోరాడతామని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. అయితే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు కదిలి సమస్య పరిష్కారానికి కృషి చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఈ క్రమంలో తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

కేయూ ప్రహరీ నిర్మాణ కాంట్రాక్టర్‌పై ఆగ్రహం

- వర్సిటీ ల్యాండ్ ఎంక్వయిరీ కమిటీలో చర్చ
- క్షేత్రస్థాయిలో వర్సిటీ భూముల హద్దుల పరిశీలన

కేయూ క్యాంపస్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ప్రహరీ నిర్మాణ పనుల్లో అలసత్వాన్ని ప్రదర్శిస్తూ.. పనులు పూర్తి చేయకపోవడంతోపాటు వర్సిటీ జారీచేసిన నోటీసులకు సైతం సమాధానం ఇవ్వకుండా వర్సిటీ ప్రహరీ గోడ నిర్మాణ కాంట్రాక్టును రద్దు చేసేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు, వర్సిటీ ల్యాండ్ ఎంక్వయిరీ కమిటీ బాధ్యులు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ మేరకు ఆదివారం వర్సిటీ ల్యాండ్ ఎంక్వైరీ కమిటీ నేతృత్వంలో వర్సిటీ ప్రొఫెసర్ల బృందం క్షేత్రస్థాయిలో వర్సిటీ ప్రహరీ పనులు, భూములను పరిశీలించారు. జిల్లా రెవె న్యూ అధికారులు వర్సిటీ భూముల సర్వే నెంబర్ల ఆధారంగా భూములన్నీ క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా కొలుతలు చేశారు. వర్సిటీ చెందిన భూముల్లో 1, 2 సర్వే నెంబర్లు మినహా అన్ని భూములకు హద్దులను నిర్ణయించారు. వర్సిటీలో జరిగిన భూ అక్రమణను ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే మాజీ వీసీ టి.రమేశ్ హయాంలో ప్రహరీ నిర్మాణం కోసం టెండర్ వేసిన కాంట్రాక్టరు ప్రహరీ పనులను చేయకుండా నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని ల్యాండ్ ఎంక్వైరీ కమిటీ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. అయా ప్రహరీ నిర్మాణ పనుల కాంట్రాక్టర్‌ను లీగల్‌గా రద్దుచేసేందుకు ఉన్న అవకాశాలను చర్చించారు. ప్రహరీ నిర్మాణ పనులు సక్రమంగా జరగకపోవడ ంతో వర్సిటీ ల్యాండ్ మరింత అక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని కమిటీ భావిస్తోందని సమాచారం. కాగా, వర్సిటీలోని ప్రహరీ నిర్మాణం కోసం 9 కిలోమీటర్ల దూరాన్ని అంచనా వేశారు. క్షేత్ర స్థాయిలో వర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మాణంలో ఉన్న ఇబ్బందులను గుర్తించారు. వర్సిటీ ప్రహరీ నిర్మాణానికి ల్యాండ్ లెవలింగ్ చేయాల్సిన అవసరం ఉందని.. గోడ కట్టేందుకు అనువుగా భూమిని చదును చేయాల్సి ఉందని గుర్తించారు. నీళ్లు నిలిచి ఉన్న ప్రాంతాలను సరిచేయాలని గుర్తించారు. భూ అక్రమణలు జరిగిన ప్రాంతాల్లో గోడ నిర్మాణానికి ఉన్న క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను ల్యాండ్ ఎంక్వైరీ కమిటీ బాధ్యులు నిర్దిష్టంగా గుర్తించారు. ఆదివారం క్షేత్రస్థాయి పనులను పరిశీలించిన వర్సిటీ ల్యాండ్ ఎంక్వైరీ కమిటీ కుమార్‌పల్లి, పలివేల్పుల, గుండ్ల సింగారం శివారు ప్రాంతాలను కలియతిరిగారు. జిల్లా రెవెన్యూ అధికారులతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు మార్క్‌చేసిన ప్రాంతాలను పరిశీలించారు. భూమలను పరిశీలించిన వారిలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, కమిటీ సభ్యులు కేయూ సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, వర్సిటీ బిల్డింగ్ డివిజన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వర్సిటీ భూములను పరిశీలిస్తున్న ల్యాండ్ ఎంక్వైరీ కమిటీ ప్రొఫెసర్లు మనోహర్, రాంచందర్, వాసుదేవారెడ్డి

అదనపు కలెక్టర్లకు గురుకులాల బాధ్యత

- ఇక తరుచూ ఆకస్మిక తనిఖీలు
- బాలికల గురుకులాలకు మహిళా ఐఏఎస్ అధికారులు

హనుమకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు, వాటి పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్ల (స్థానిక సంస్థలు)కు ప్రభుత్వం అప్పగించింది. గతంలో నెలలో ఒకరోజు గురుకులాల్లో జిల్లా కలెక్టర్లు బస చేయాలని ఆదేశించిన ప్రభు త్వం.. వారికి పనిభారం పెరగడంతో ఆ బాధ్య తలను అదనపు కలెక్టర్లకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో గురుకుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కా రం అవుతాయని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జాయింట్ కలెక్టర్లు తమ పరిధిలో ఉన్న గురుకులాలను ఆకస్మికంగా తనిఖీలు చేస్తారు. రాత్రి పూట అక్కడే బస చేస్తారు. ఆ సమయంలో విద్యార్థులు చదువు లు, మౌలిక వసతులను పరిశీలిస్తారు. వసతి గృహం పరిసరాలు, పారిశుధ్యం, తాగునీరు, విద్యార్థుల సంరక్షణ, విద్యుత్, వంట గదులు, మెనూ, సరుకుల నిల్వ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి పెడతారు. వారితో కలిసి భోజనం చేస్తారు. చిన్నారులు ఇబ్బందులు పడకుండా అన్నిరకాల సౌకర్యాలు కల్పించేలా అధికారులను ఆదేశిస్తారు. గురుకులాల్లోని సమస్యలపై కలెక్టర్లకు నివేదికలు సమర్పిస్తారు.

తరుచూ విద్యార్థులకు అస్వస్థత

ఇటీవల పలు గురుకులాల్లో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు ఉన్నాయి. ఈ సంఘటనలతో గురుకులంలో చదువుకుంటున్న విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నాణ్యమైన ఆహారం పెట్టకపోవడం, ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పాటించకపోవడం, అన్నంలో పురుగులు ఉండడం, రుచిలేని కూరలు వడ్డించడం తదితర కారణాల వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయి. విద్యార్థులు బయట ఆహారం తినడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం.. ఇక నుంచి గురుకులాలను క్రమం తప్పకుండా తనిఖీలు చేసే బాధ్యతను అదనపు కలెక్టర్లకు అప్పగిచ్చింది. ఇటీవల తాజాగా బాలికల గురుకులాలు, కస్తూర్బా పాఠశాలలు, కళాశాల తనిఖీ బాధ్యతను మహిళా ఐఏఎస్ అధికారులకు అప్పగిస్తూ మరో నిర్ణయం తీసుకున్నది తెలిసిందే. బాలికల గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లోనే కలుషిత ఆహారం తీసుకొని విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు ఎక్కువ జరుగుతుండడంతో వాటిని పగడ్బందీగా అరికట్టేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి ఈ నిర్ణయం తీసుకున్నది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

జనగామ రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జనగామ మండలం యశ్వంతాపురం జిల్లా పార్టీ కార్యాలయంలో తరిగొప్పుల, నర్మెట మండలాల ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మా ట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు దొంగ హామీలనిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలన వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని కోరారు. నాయకులు పెద్ది రాజిరెడ్డి, తేజావత్ గోవర్ధన్, గద్దల నర్సింగరావు, పింగిళి జగన్మోహన్‌రెడ్డి, చింతకింది సురేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

బేరాలు కుదిరాయి..

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పరస్పర బదిలీల ప్రక్రియ కొంత మంది ఉపాధ్యాయులకు కాసుల వర్షం కురిపిస్తోంది. జీవో నెంబరు 317తో నష్టపోయిన ఉపాధ్యాయుల బదిలీలకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో పరస్పర బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల మధ్య బేరాలు కుదిరాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 332 మంది



- ఉపాధ్యాయుల పరస్పర బదిలీల్లో బయట పడుతున్న లీలలు
- ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 332 దరఖాస్తులు
- కాసుల కోసం మరో పది రోజుల్లో రిటైర్డ్ అవుతున్న వారి కక్కుర్తి
- చేతుల మారనున్న సుమారు రూ.50 కోట్లు

ఉపాధ్యాయులు పరస్పర బదిలీల కోసం దరఖాస్తులు చేసుకోగా సుమారు రూ.50 కోట్ల మేర చేతుల మారనున్నట్లు ఉపాధ్యాయవర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికే 75శాతానికి పైగా అడ్వాన్స్ చెల్లింపులు సైతం అయినట్లు ప్రచారం జరుగుతోంది.

రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నవాళ్లే ఎక్కువ

కాసులకు కక్కుర్తి పడుతున్న కొంత మంది రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులే మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లకు బేరాలు కుదుర్చుకొని దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. 317తో అన్యాయం జరిగిన ఉపాధ్యాయుల కంటే పట్టణప్రాంతాల్లో ఉంటేనే వారి ప్రైవేటు వ్యాపారాలను చక్కబెట్టుకోవచ్చుననే ఉపాయంతో ఉపాధ్యాయులు ఒప్పందాలు కుదుర్చుకున్నారని ప్రచారం జరుగుతోంది. ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులు బేరాలు కుదుర్చుకొని సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు పూర్తిస్థాయిలో సిద్ధమైనట్లు తెలుస్తోంది. మరో రెండు, మూడు నెలల్లోనే ఉద్యోగ విరమణ పొందనున్న ఉపాధ్యాయులే ఎక్కువగా బేరాలు కుదుర్చుకొని మారుమూల ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

- వరంగల్ జిల్లా కేంద్రమైన వరంగల్ మండల పరిధిలోని ఓ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఈనెల రిటైర్డ్ అవుతున్నారు. ఆయన రూ.10లక్షలకు బేరం కుదుర్చుకుని మహబూబాబాద్ జిల్లాకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు.
- ఈ నెలలోనే హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్ మండల పరిధిలోని ఓ జడ్పీహెచ్ఎస్‌లో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయుడు భారీ మొత్తానికి ఒప్పందం కుదుర్చుకొని మహబూబాబాద్ వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు.
- ఏప్రిల్ మాసంలో రిటైర్డ్ కానున్న ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం కాసులకు కక్కుర్తి పడి ములుగు జిల్లాకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు.

ఒప్పందాలు రూ.10లక్షల పైమాటే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పరస్పర బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్న వారంతా ముందుగానే పరస్పర ఒప్పందాలు కుదుర్చుకొనే దరఖాస్తులు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పట్టణ ప్రాంతాలకు వస్తున్న టీచర్లు వారి స్థానాల్లోకి వెళుతున్న టీచర్లకు అక్షరాల పది లక్షల రూపాయలను సమర్పించుకునేందుకు మధ్యవర్తి ద్వారా ఒప్పందాలు కుదుర్చుకున్నారని ఉపాధ్యాయవర్గాల్లో బహిరంగంగానే చర్చ కొనసాగుతోంది. ఒప్పందాల ప్రకారం 75 శాతం ముందుగానే చెల్లించి, పని పూర్తయ్యాక మిగతా 25 శాతం చెల్లించేందుకు ఇరువర్గాలు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఇక పాఠశాలలు, డీఈవో, డైట్, బీఈడీ కార్యాలయాల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సైతం పరస్పర బదిలీల కోసం దరఖాస్తులు చేసుకొని రూ.7 నుంచి రూ.10లక్షల వరకు బేరాలు కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది.

భలే లీలలు

పరస్పర బదిలీల ప్రక్రియలో భలే లీలలు బయటపడుతున్నాయి. అసలు అన్యాయం జరిగిన ఉపాధ్యాయులకంటే కాసులకు కక్కుర్తి పడుతున్న కొసరు ఉపాధ్యాయులకే లాభం చేకూరుతున్నట్లు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

- 317లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వినియోగించుకొని పట్టణ ప్రాంతాలకు వచ్చిన ఉపాధ్యాయులే ఇప్పుడు పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.
- 2022లో నిర్వహించిన పరస్పర బదిలీల్లో పట్టణ ప్రాంతాలకు వచ్చిన వారే తిరిగి పరస్పర బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు.
- 317లో అన్యాయానికి గురై ప్రమోషన్ పొందిన వారు వారి ప్రమోషన్ కేటగిరిలో పరస్పర బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు.
- 2024 డీఎస్సీలో ఎంపికై పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న కొంత మంది ఉపాధ్యాయులు పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో పరస్పర బదిలీల దరఖాస్తుల వివరాలు

జిల్లా	దరఖాస్తుల సంఖ్య
వరంగల్	55
హనుమకొండ	91
జనగామ	25
మహబూబాబాద్	59
భూపాలపల్లి	70
ములుగు	32
మొత్తం	332

ఆశల పల్లకీలో..

- కాంగ్రెస్ పార్టీలో మొదలైన పదవుల పందేరం
- నామినేటెడ్‌తో పాటు డీసీసీ పదవుల భర్తీకి కసరత్తు
- జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల భర్తీకి సైతం సన్నాహాలు
- మంత్రివర్గ విస్తరణపై ఎమ్మెల్యేల ముమ్మర

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాంగ్రెస్‌లో పదవుల పందేరం మొదలైంది. ఈ నెలాఖరులోగా కీలక నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు డీసీసీ అధ్యక్షుల నియామకం, టీపీసీసీ కార్యవర్గాన్ని విస్తరించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం చేస్తున్న కసరత్తు నేతల్లో ఆశలను పెంచుతున్నాయి. నామినేటెడ్ పదవి దక్కకుంటే పార్టీలో కీలక పదవులను కొట్టేయాలనే ఆలోచనలో నేతలు జోరుగా లాబీయింగ్ చేస్తున్నారు. పైగా మంత్రివర్గ విస్తరణపై కూడా ప్రచారం జరుగుతుండటంతో 'ఒక్క చాన్స్' అంటూ ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. నామినేటెడ్.. లేదంటే పార్టీ పగ్గాలు చేతిలోకి తీసుకునేందుకు కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. తమతో పాటు జిల్లా స్థాయిలో కేడర్‌కు పదవుల కోసం ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతుండడంతో హస్తంలో ఆశలు చిగురిస్తున్నాయి.

ఓరుగల్లులో ఢీసీసీలే

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులను ఎమ్మెల్యేలకే ఇవ్వాలని అధిష్ఠానం సూత్రపాయంగా నిర్ణయించినట్లుగా ప్రచారం జరుగుతోంది. చాలా జిల్లాల్లో ఈ పదవులను చేపట్టేందుకు ఎమ్మెల్యేలు ఆసక్తిగా లేరని సమాచారం. దీంతో సీనియర్ నేతలు, క్రియాశీలకంగా ఉన్న నేతల పేర్లను అధిష్ఠానం పరిశీలిస్తుందనే ప్రచారం ఉంది. ప్రధానంగా హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవి హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతున్నారు. మరోసారి ఇదే పదవిలో కొనసాగేందుకు నాయిని సుముఖంగా లేనట్లుగా తెలుస్తోంది. దీంతో హనుమకొండ జిల్లాలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి ఉన్నారు. ఈయనకు వయసు రీత్యా, సీనియారిటీపరంగా చూసినా డీసీసీ ప్రెసిడెంట్ పోస్టు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో ఈ జిల్లాలో డీసీసీ అధ్యక్ష పదవి ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది. అయితే ఆయిల్ ఫెడ్ చైర్మన్‌గా ఉన్న జంగా రాఘవరెడ్డి హనుమకొండ డీసీసీపై కన్నేయటంతో రాజకీయాలు ఉత్కంఠగా మారాయి. ఇప్పటికే ఎమ్మెల్యే నాయిని, జంగా మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విభేదాలు ఉండడంతో హనుమకొండ డీసీసీ జంగా వదిలేందుకు ఎమ్మెల్యే నాయిని సిద్ధంగా లేరనేది పార్టీ వర్గాల వాదన. దీంతో డీసీసీ పదవి ఎవరికి దక్కుతుందనే చర్చ కాంగ్రెస్‌లో హాట్ హాట్‌గా నడుస్తోంది.

అలాగే జనగామ జిల్లాలో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్థాయికి డీసీసీ ప్రెసిడెంట్ పోస్టు సరిపోదు. ఇక పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి పదవి ఇవ్వాలి. అయితే యశస్వినీరెడ్డి డీసీసీ బాధ్యతలు నిర్వహిస్తుందా? లేక తన అత్త మామిడాల ఝాన్సీరెడ్డికి ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తుందా? అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మరోసారి కొనసాగేందుకు ఆసక్తితో ఉండటంతో జనగామ డీసీసీ ఎవరికి దక్కుతుందనే ఉత్కంఠగా ఉంది. ఇక మహబూబాబాద్ డీసీసీ అధ్యక్ష పదవిని స్థానిక ఎమ్మెల్యేకే ఇవ్వాలని అధిష్ఠానం భావిస్తున్నప్పటికీ.. గిరిజనేతర సామాజిక వర్గం నేతలు మాత్రం తమకు పార్టీ పదవి కేటాయించాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి సొంత జిల్లా కావటంతో డీసీసీ సీటు ఎవరికి అనేది ఉత్కంఠగా మారింది.

భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవిని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణకే అప్పగించేందుకు అధిష్ఠానం ఆసక్తిగా ఉన్నట్లుగా సమాచారం. అయితే ఎమ్మెల్యేకు డీసీసీపై ఆసక్తి లేదని తెలుస్తోంది. కాగా, ఇదే జిల్లాకు చెందిన మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు సైతం తన అనుచరుడికి మరోసారి డీసీసీ పగ్గాలు వచ్చేలా అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. దీంతో భూపాలపల్లి డీసీసీ పదవి హాట్‌హాట్‌గా మారనుంది. ఇక ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ప్రస్తుత అధ్యక్షుడు అశోక్‌నే కొనసాగించే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. మంత్రి సీతక్కకు ముఖ్య అనుచరుడిగా ఉండటంతో అశోక్‌నే కొనసాగిస్తారనే ప్రచారం ఉంది. ఇక వరంగల్ డీసీసీపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా కావటంతో పాటు ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కేఆర్ నాగరాజులు ఈ జిల్లా వారే కావటంతో డీసీసీపై ఉత్కంఠ నెలకొంది. డీసీసీ పదవి ఎమ్మెల్యేలకే ఇవ్వాల్సి వస్తే.. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముందు వరుసలో ఉంటారు. నర్సంపేట ఎమ్మెల్యే మాధవరెడ్డి పాతికేళ్ల కిందటే ఉమ్మడి జిల్లా డీసీసీ పదవిని నిర్వహించారు. అయితే మంత్రి కొండా సురేఖ ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది.



నామినేటెడ్‌పై నేతల్లో ఆశలు

కాంగ్రెస్ నేతల్లో పదవుల పంపకాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇప్పటికే కొందరికి నామినేటెడ్ పదవులను అధిష్ఠానం కట్టబెట్టింది. మరికొంత మందికి కూడా రాష్ట్రస్థాయిలో చైర్మన్, డైరెక్టర్‌లాంటి పద వులు ఇచ్చేందుకు సుముఖంగా ఉన్నట్లుగా సమాచారం. జనగామ డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి రాష్ట్ర స్థాయిలో ఏదైనా కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక పాలకుర్తి నియోజకవర్గ నాయకురాలు మామిడాల ఝాన్సీరెడ్డి పేరు నామినేటెడ్ పదవుల జాబితాలో ఉందనే చర్చ ఉంది. అయితే రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండాలనే లక్ష్యంతో ఉన్న ఝాన్సీరెడ్డి.. జనగామ డీసీసీ అధ్యక్ష పదవిని లేదా జడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్నారనే పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సింగపురం ఇందిరకు సైతం లోక్‌సభ ఎన్నికల సమయంలో అధిష్ఠానం నామినేటెడ్ పదవిపై హామీ ఇచ్చిందనే ప్రచారం జరుగుతోంది. టీపీసీసీ అధి కార ప్రతినిధి గాజర్ల అశోక్‌కు కూడా ఎన్నికల సమయంలోనే నామినేటెడ్ పదవిపై అధిష్ఠానం హామీ లభించింది. అయితే అశోక్‌కు భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇస్తారనే ప్రచారం కూడా జరుగుతోంది.

వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సైతం నామినేటెడ్ పదవి ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. వీరితో పాటు కాంగ్రెస్‌లో అనేక ఏళ్లుగా పని చేస్తున్న నేతలు నామినేటెడ్ పదవులతో పాటు పార్టీ పదవుల్లో ఏదైనా ఒక్కటి కీలకమైన పదవి దక్కకపోతుందా? అనే ఆశతో ఉన్నారు. అలాగే జిల్లా స్థాయిలో సీనియర్ నేతలు మార్కెట్ కమిటీలతో పాటు దేవాలయ కమిటీలు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవులపై ఆశలతో ఉన్నారు. కార్పొరేషన్‌లకు రాష్ట్రస్థాయి డైరెక్టర్ పదవులు కూడా ఉండటంతో వాటిలో ఏదో ఒకటి రాకపోతుందా? అనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉంటూ పార్టీని కాపాడుకుంటూ వస్తున్నవారికి నామినేటెడ్ భర్తీలో అవకాశాలు రాలేదనే ఆందోళన కేడర్‌లో వ్యక్తం అవుతోంది. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు, ములుగు నియోజకవర్గాల్లో కూడా జిల్లా స్థాయిలో నామినేటెడ్ పదవులు రాకపోవడంతో శ్రేణులు ఆవేదనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అధిష్ఠానం నామినేటెడ్ పదవులపై దృష్టి పెట్టడంతో కేడర్‌లో జోష్ కనిపిస్తోంది.

మంత్రివర్గ విస్తరణ.. టీపీసీసీలో చోటు

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గంలో అవకాశం కల్పించారు. అయితే ఈ నెలాఖారులోగా మంత్రివర్గ విస్తరణతో పాటు ఒకరిద్దరికి మంత్రివర్గం నుంచి ఉద్వాసన తప్పదనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఓరుగల్లు ఎమ్మెల్యేలల్లో ఒకరిద్దరు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అధిష్ఠానం వద్దకు పరుగులు పెడుతున్నట్లు సమాచారం. ఓ సీనియర్ ఎమ్మెల్యేతో పాటు మరో జూనియర్ ఎమ్మెల్యే కూడా మంత్రి పదవిపై ఆశతో ఉన్నారనే చర్చ జరుగుతోంది. ఆ ఇద్దరు కూడా సీఎం వద్ద తమ దరఖాస్తు పెట్టారనే ప్రచారంలో ఉంది. అయితే మంత్రివర్గ విస్తరణలో కులాల సమీకరణల నేపథ్యంలో అవకాశం దక్కడం కష్టమేనని తెలుస్తోంది. అలాగే ఓ గిరిజన ఎమ్మెల్యే కూడా 'తనకో అవకాశం ఇవ్వండి ప్లీజ్..' అంటూ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఇక వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి పెంచుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డికి డిప్యూటీ స్పీకర్, లేదంటే ప్రభుత్వ చీఫ్‌విప్ పదవుల్లో ఏదో ఒకటి నాయిని రాజేందర్‌రెడ్డికి ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి రాష్ట్ర మహిళ కాంగ్రెస్ చీఫ్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. అలాగే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించే యోచనలో సీఎం ఉన్నారనే తెలుస్తోంది.

సామాజిక చైతన్య గీతిక.. జ్యోత్స్న

- పేదరికాన్ని లెక్కచేయక వందలాది పాటలతో ప్రతిభ
- తండ్రి నుంచి కళను అందిపుచ్చుకుని రాణింపు
- చిత్రసీమలో అడుగు పెట్టాలనే ఆకాంక్షతో పయనం
- సాంస్కృతిక సారథిలో గాయనిగా బాధ్యతలు

'ఆడుదాం డప్పుల్ల దరువేయరా.. పల్లె తెలంగాణ పాట పాడరా.., అయ్యోనివా.. నువ్వు అవ్వోనివా.. తెలంగాణోనికి నువ్వు పాలోనివా.., రగులుతున్నది తెలంగాణము రాయేసుడా రారా.., ఇత్తనని చెప్పుడేంది తెలంగాణ.., ఇగో అగో అనుడేందిర తెలంగాణ.., అమ్మ సోనియమ్మ ఓ తల్లి సోనియమ్మ.. అనే పాటలకు ఆమె ప్రాణం పోసింది. ఉద్యమ గీతాలు.. జానపద గేయాలు.. సామాజిక చైతన్య గీతాలు.. ప్రభుత్వ సంక్షేమ గీతాలు.. సినిమా పాటలను ఆలపిస్తూ పాటల ప్రతిభను మెరుగుపరుచుకుంటోంది. కళకు, ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపిస్తూ పాట అంటే తెలియని పసిప్రాయం నుంచే పలు వేదికలపై తన గాత్రంతో ఉర్రూతలూగించింది మైదం జ్యోత్స్న. కాలికి గజ్జెకట్టి నాడు తెలంగాణ ఉద్యమ గీతాలు ఆలపించిన జ్యోత్స్న.. నేడు గ్రామీణ ప్రాంతాల జానపదాలు, సామాజిక గీతాలు, సినిమా పాటలు ఆలపిస్తోంది.



వేదికపై పాట పాడుతున్న జ్యోత్స్న

• యువ

వరంగల్ కార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జననాట్య మండలి కళాకారిణిగా గుర్తింపు పొందిన.. ఖిలావరంగల్‌కు చెందిన మైదం జ్యోత్స్న తన తండ్రి ప్రతాప్ నుంచి కళను పుణికిపుచ్చుకుని తనకు తెలి యకుండానే ఎంచుకున్న కళలో రాణిస్తోంది. ప్రస్తుతం తెలంగాణ సారథి కళాకారిణిగా హనుమకొండ జిల్లా బృందానికి నాయకత్వం వహిస్తున్న ఆమె గాయనిగా రాణించి 2023లో తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వరంగల్ నెరేళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో 'నంది' అవార్డు అందుకుంది. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్‌కు చెందిన మైదం ప్రతాప్ - శోభారాణిలకు ఇద్దరు కుమార్తెలు ఝాన్సీ జ్యోత్స్న. ఉద్యమాలకు పురిటిగడ్డగా పేరుగాంచిన ఖిలావరంగల్ నుంచి ఐదు దశాబ్దాలుగా వందలాది మంది విప్లవం వైపు అడుగులేశారు. ఇదే క్రమంలో ప్రతాప్ కూడా కుటుంబాన్ని, ఇద్దరు ఆడపిల్లలను వదిలి అప్పటి పీపుల్స్‌వార్ బాట పట్టాడు.

దాంతో పిల్లల బాగోగులు తల్లి శోభారాణి చూసుకుంది. కూలీనాలి చేసి వారిని పోషించింది. 1998లో ప్రతాప్ అరెస్టు అయి విడుదలైన తర్వాత గద్దర్, సంజీవ్, బుర్ర రాములు, కోటేశ్వర్‌రావు, యాదన్న, నాగన్న, నలిగంటి చంద్ర మౌళి, గర్జన, యశ్పాల్‌తో కలిసి ప్రజాచైతన్య గీతాలు ఆలపించాడు. కొద్ది రోజుల తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన రెండు కాళ్లు విరగడంతో ఆరు మాసాల పాటు మంచానికే పరిమిత మయ్యాడు. తర్వాత ఆటోడ్రైవర్‌గా పని చేసి పిల్లలను పోషించాడు. 2014లో కొందరు వ్యక్తులు చెన్నైలో పని ఉందని ప్రతాప్‌ను తీసుకెళ్లి అక్కడే వదిలేసి వచ్చారు. ఇప్పటికీ ప్రతాప్ ఎక్కడ ఉన్నాడో ఎవరికీ తెలియదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.



నంది అవార్డు స్వీకరిస్తున్న జ్యోత్స్న (ఫైల్)

చిన్ననాడే అబ్బిన కళ..

తండ్రి కళాకారుడు కావడంతో జ్యోత్స్నకు తెలియకుండానే చిన్ననాడే ఆమెకు పాట అబ్బింది. అక్క ఝాన్సీ సైతం కళాకారిణి కావడంతో చెల్లిని కూడా 10వ ఏట 4వ తరగతిలో ఉద్యమ వేదికలకు పరిచయం చేసింది. ఇప్పుడు జ్యోత్స్న ప్రతిభ రాష్ట్రం దాటింది. ప్రజల హృదయాలను దోచుకునే అన్ని రకాల పాటలు ఆలపిస్తూ ఉర్రూతలూగిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు ఇతర జిల్లాలలో జరిగిన సభలు, సమావేశాల్లో జ్యోత్స్న తన పాటలతో అంద రినీ అలరించింది. సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో కేసీఆర్‌ను సైతం మంత్రముగ్ధుడిని చేసింది. ఇప్పటి వరకు వందలాది వేదికలపై ప్రద ర్శనలు ఇచ్చింది. తెలంగాణ ఉద్యమ సమయంలో అక్క ఝాన్సీ పాట పాడుతుంటే శిరస్సుపై దీపాలు అలంకరించుకుని డ్యాన్స్ చేసి చూపరుల తనవైపు తిప్పుకుంది. ఉద్యమ కళాకారులైన దారా దేవేందర్, గిద్దె రాంనర్స య్య, వరంగల్ శ్రీనివాస్, పొలిశెట్టి సత్యనారాయణ వంటి దిగ్గజాలతో కలిసి పాడి ఔరా అనిపించింది. ఇప్పుడు తెలంగాణ సారథి కళాకారుల బృందంలో పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. హనుమకొండ సారథి బృందానికి నాయకత్వం వహిస్తూ ఎక్కడ ప్రభుత్వ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా జ్యోత్స్న ఉండాల్సిందేననే గుర్తింపు సాధించింది.



సీపీ అంబర్‌కిశోర్ ఝా చేతుల మీదుగా ఉత్తమ కళాకారిణిగా అవార్డు స్వీకరిస్తున్న జ్యోత్స్న (ఫైల్)

తండ్రి దాచిన పాత పేపర్లతో ఉద్యోగం

ప్రతాప్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దనే ఉన్న సమయంలో ఇద్దరు కుమార్తెలు తెలంగాణ ఉద్యమంలో పాల్గొని వేదిక లపైపాటలు పాడారు. ఈ క్రమంలో ప్రచురితమైన పత్రిక కటింగ్‌లను పిల్లలకు తెలియకుండానే మంచం కింద దాచిపెట్టాడు. కొద్దిరోజుల తర్వాత ఇంటి నుంచి వెళ్లిన తండ్రి తిరిగి ఇంటికి రాని సమయంలో.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత 2015లో తెలంగాణ ఉద్యమ కళాకారులను పాటల కొలువులకు ఎంపిక చేస్తూ నోటిఫికేషన్ వచ్చింది.మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సారథ్యంలో కళాకారులుగా గుర్తింపు పొంది, ఆధారాలున్న వారు దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. కానీ జ్యోత్స్న వద్ద చిన్న ఆధారం కూడా కనిపించలేదు. అక్క పెళ్లికి ఇల్లు సర్దే క్రమంలో తన తండ్రి మంచం కింద దాచిన బిడ్డలు పాల్గొన్న ఆటాపాట లు, ధూం ధాం.. పేపర్ కటింగ్‌లు కనిపించాయి. వాటితో దరఖాస్తు చేసుకోగా అదే యేడు హైదరా బాద్‌లో ఐఏఎస్ శ్రీధర్, కోదండ రామ్ నేరుగా ఇంటర్వ్యూలో పాటలు పాడించి తెలంగాణ సారథి కళాకా రిణిగా ఎంపిక చేశారు.

అమ్మకు డయాలసిస్

జ్యోత్స్న తల్లి శోభారాణికి ఐదేళ్ల కిందట రెండు కిడ్నీలు పాడైపోయా యి. అక్కకు వివాహం జరిగి హైదరాబాద్‌లో ఉండడంతో జ్యోత్స్నకు అమ్మ భారంగా మారింది. ఉద్యోగం చేస్తూ వేదికపై పాటలు పాడిన తర్వా త.. ఇంటికి వచ్చి తల్లిని రోజు తప్పించి రోజు డయాలసిస్ చేయిస్తోంది. నిరు పేద కుటుంబానికి చిన్నతనంలోనే పెద్దదిక్కుగా మారింది. అయితే నాలుగు నెలలుగా సారథి కళాకారులకు జీతాలు రావడం లేదని, అధికారులు స్పందించి జీతాలు వచ్చే విధంగా చొరవ చూపాలని కోరుతోంది. తన తల్లికి నెలకు 15 రోజుల పాటు డయాలసిస్ చేస్తేనే బతుకుతుందన్నారు. జీతాలు ఆలస్యం చేస్తే తనలాంటి పేద కళాకారుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తోంది. అలాగే తనకు సినిమాలు, ప్రైవేటు ఆల్బంలో పాటలు పాడాలనే తపన ఉందని, చిత్ర దర్శకులు, నిర్మాతలు స్పందించి అవకాశం కల్పిస్తే తన కళను నిరూపించుకుంటానని చెబుతోంది. ఆర్థికంగా వెనుకబడి ఉన్న తన కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తే తల్లికి మెరుగైన చికిత్స అందిస్తానని విజ్ఞప్తి చేస్తోంది.

వ్యాపార కేంద్రంగా వరంగల్

- హైదరాబాద్ తరహాలో అన్ని వసతులు
- వరంగల్ ఎంపీ కావ్య
- హనుమకొండలో లలితా జువెల్లరీ షోరూమ్ ప్రారంభం

హనుమకొండ చౌరస్తా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ తరహాలో వరంగల్ నగరం వాణిజ్య, వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండ 10వ డివిజన్ అలంకార్ జంక్షన్ రాయపుర ప్రధాన రహదారిలోని లలితా జువెల్లరీ షోరూమ్‌ను వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి షోరూమ్ ఎం.డి. డాక్టర్ ఎం. కిరణ్‌కుమార్ ఆదివారం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ కావ్య మాట్లాడుతూ.. లలితా జువెల్లరీ ఆధ్వర్యంలో బంగారు ఆభరణాలు సొంతంగా వారి ఫ్యాక్టరీలో తయారు చేసి వినియోగదారులకు అందించడం అభినందనీయమన్నారు. బంగారు ఆభరణాలను నాణ్యతతో పాటు సరసమైన ధరలలో లభించే షోరూముల్లో కొనుగోలు చేయాలని సూచించారు. బంగారానికి, మహిళలకు విడదీయరాని బంధం ఉంటుందని, పేద, మధ్య తరగతి ప్రజలకు సరసమైన ధరలలో అందుబాటులో ఉండే లలితా జువెల్లరీని నగర ప్రజలు సందర్శించి నగలు కొనుగోలు చేయాలని కావ్య సూచించారు.

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. డబ్బులు ఊరికే రావు.. అనే మాట వినబడగానే మహిళలకు గుర్తుకొచ్చేది లలితా జువెల్లరీ ఎం.డి. కిరణ్‌కుమార్ అని గుర్తు చేశారు. బ్రాండెడ్ షోరూమ్‌లు వరంగల్ నగరంలో ఏర్పడడంతో చాలా మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం లభిస్తోందని తెలిపారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ఏదైనా నూతన షోరూమ్‌లను సెలబ్రిటీలతో ప్రారంభించడం ఆనవాయితీగా వస్తున్న నేపథ్యంలో కిరణ్‌కుమార్ తన బంగారు ఆభరణాల షోరూమ్‌ల గురించి ఆయనే ప్రచారం చేసి ప్రజలకు అత్యంత చేరువయ్యారన్నారు. 20 ఏళ్ల కిందట చెన్నైలో లలితా జువెల్లరీలో బంగారు నగలను కొనుగోలు చేశానని, అప్పటి నుంచి నేటి వరకు నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే సరసమైన ధరలకు బంగారు ఆభరణాలు అందించడం వారికే సాధ్యమన్నారు. లలితా జువెల్లరీ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. తక్కువ తరుగు, తక్కువ ధరలలో బంగారు ఆభరణాలు అందించాలనే ఉద్దేశంతో హనుమకొండలో తమ 57వ జువెల్లరీ షోరూమ్‌ను ప్రారంభించామన్నారు. ప్రారంభ ఆఫర్‌గా బంగారు నగలపై తరుగులో 2శాతం తగ్గింపుతో పాటు వజ్రాభరణాలు క్యారెట్‌కు రూ.6వేల తగ్గింపు ఇస్తున్నామన్నారు. అదేవిధంగా తమ షోరూమ్‌లో సరికొత్త ఫ్రీ అండ్ ఫ్లెక్సీ 11నెలల నగల కొనుగోలు పథకాన్ని ప్రారంభించామన్నారు. ఇతర బంగారు షోరూమ్‌లలో బంగారం కొంటే రైస్ కుక్కర్ ఫ్రీగా ఇస్తామని అఫర్లు పెట్టడం ఏమిటని, దీనిని ప్రజలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ షోరూమ్‌లో బంగారం నాణ్యత కోసం క్యూ ఆర్ కోడ్ ఏర్పాటు చేశామని, సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ స్కాన్‌చేస్తే బంగారం నాణ్యత తెలిసిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ నాయకులు, లలితా జువెల్లరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లలితా జువెల్లరీ షోరూమ్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

భగవాన్ యోగి జయంతి వేడుకలు

వడ్డేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ టీఎన్జీవోస్ కాలనీ ప్రాంతంలో గల శ్యామల దుర్గాదాస్ కాలనీలోని పింగిళి అశోక్‌రె డ్డి ఇంటి ఆవరణలో త్రైత సిద్ధాంతం ఇందూ జ్ఞాన వేదిక జవిఃకుంట కమిటీ ఆధ్వర్యంలో వేమన భగవాన్ జయంతి వేడుకలను ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి రచించిన అనుభవ జ్ఞానమైన వంద ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రదర్శిస్తూ వేమన భగవాన్ వేడుకలను పల్లకీలో ఊరేగిస్తూ నేత్రప ర్వంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరం గి సునిల్‌కుమార్, టీఎన్జీవోస్ కాలనీ ఫౌండర్ పింగిళి అశోక్‌రెడ్డి, కాలనీ మాజీ అధ్యక్షుడు నల్లాల సులోచన రాజిరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగులు తుపా కుల దశరథం, సంపెట రాఘవులు, రాజిరెడ్డి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.



టీఎన్జీవోస్ కాలనీలో భగవాన్ యోగి వేమన పల్లకీ సేవను నిర్వహిస్తున్న కాలనీ ప్రతినిధులు

కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా బీజేపీ ప్రభుత్వం

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్

హనుమకొండ చౌరస్తా, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు తొత్తుగా వ్యవహరిస్తూ కార్మిక వర్గం, రైతాంగంపై దాడిని తీవ్రతరం చేసిందని, దీనిని ప్రజలంతా ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ పిలుపు నిచ్చారు. ఆదివారం హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో సీఐటీ యూ రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక, కర్షక ఐక్యత దినోత్సవ జిల్లా సదస్సు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు, రైతాంగానికి గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం వంటి వాటితో పాటు మొత్తం 13 డిమాండ్ల పరిష్కారం కోసం 1982 జనవరి 19న దేశవ్యాప్తంగా కార్మికవర్గం మొదటిసారి జాతీయ సమ్మె నిర్వహించిందని గుర్తు చేశారు. కేంద్ర కార్మిక సంఘాలతో పాటు ప్రభుత్వరంగ ఫెడరేషన్లను, ఉద్యోగుల అసోసియన్లను, రైతాంగం, వ్యవసాయ కార్మికులు లక్షలాదిగా ఇందులో పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలిపార న్నారు. ఈ ఆందోళనను అణచివేయడానికి నాటి కేంద్ర ప్రభుత్వం.. తీవ్ర నిర్బం .దాన్ని ప్రయోగించిందన్నారు. అనేక రాష్ట్రాలో ప్రదర్శన చేస్తున్న వారిపై కాల్పులు జరపడంతో 10 మంది వరకు అమరులయ్యారని, నాటి నుంచి ఏటా జనవరి 19న కార్మిక రైతు సంఘాల ఐక్య దినంగా పాటించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మికచట్టాలను కాలరాస్తూ కార్మికవ ర్గాన్ని యజమానులకు బానిసలుగా మార్చేలా నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చిందని దీంతో కనీస వేతనాలు, పనిగంటలు, ఉపాధి భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ వంటి పథకాల అమలు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను సైతం అవమాన పరుస్తూ పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యానించడం గమనిస్తే.. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయటానికి పూనుకున్నదని స్పష్టమవుతోందన్నారు. జమిలీ ఎన్నికల పేరుతో రాష్ట్రాల హక్కులను హరించి నిరంకుశ పాలనకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. బీజేపీ, మోదీ, షా విధానాలు దేశాన్ని తిరోగమనం వైపు నెడుతున్న మన రాష్ట్రంలోని అధికార పార్టీ కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌పార్టీలు మిన్నకున్నాయని, వారు ఎవరి ప్రయోజనాల కోసం ఇలా వ్యవహరిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, ఆఫీస్ బేరర్స్ జి. ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి, మెట్టు రవి, పుల్ల అశోక్, ఎస్. రజిత, బి. మహేష్, పెండ్యాల రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎ. భిక్షపతి, చంద్రమౌళి, అజీమ, పద్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్మిక, కర్షక మైత్రి జిల్లా సదస్సులో మాట్లాడుతున్న రాగుల రమేష్

కామన్ మెస్‌లో రిజిస్ట్రార్ మల్లారెడ్డి భోజనం

కేయూ క్యాంపస్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కామన్ మెస్‌లో ఆదివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ అభివృద్ధి అధికారి ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు కలిసి భోజనం చేశారు. వర్సిటీ విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అలాగే క్షేత్రస్థాయిలో మెస్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించారు. కామన్ మెస్‌లో నాన్ బోర్డర్లను నివారించేందుకు ఇటీవల నూతనంగా డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ నేతృత్వంలో తీసుకున్న విద్యార్థుల బయోమెట్రిక్ హాజరును స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరత్వరగా స్కాన్‌చేసి మెస్‌లోకి అనుమతించాలని సూచించారు. కామన్ మెస్ సిబ్బందికి పలు జాగ్రత్తలు చెప్పారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారికి నాణ్యమైన భోజనంతో పాటు అల్పాహారాన్ని సక్రమంగా అందించాలని పేర్కొన్నారు. మెస్‌పై విద్యార్థులు ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. విద్యార్థులతో వర్సిటీ ఉన్నతాధికారులు మాట్లాడారు. వర్సిటీ ఉన్నతాధికారులతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కామన్ మెస్‌లో భోజనం చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, డైరెక్టర్లు రామచంద్రం, రాజ్‌కుమార్‌లు తదితరులు

హసన్‌పర్తి కిట్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ

హసన్‌పర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని హసన్‌పర్తి కిట్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా నాగమల్ల సుధీర్, ఉపాధ్యక్షులుగా బొక్క. కుమార్, కోమల్ల రాజేశ్వ ర్‌రెడ్డి, కరట్లపెల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గుండమీది విజయ్‌మోహన్, కోశాధికారిగా గూడూ రు లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా కాలె యాదగిరి, అజ్మీర గ ణేష్, గొల్లపెల్లి సుదర్శన్, డైరెక్టర్స్‌గా మన్న కుమారస్వామి, ఏరుకొండ రమేష్, గంగినేని రవి కుమార్, తీకల ప్రభాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా పావుశెట్టి శ్రీధర్, గౌరవ సలహాదారులుగా బోడ యుగందర్, ఆకుల సదానందం, కీర్తి సూరయ్యలు ఎన్నికైనట్లు కమిటీ ప్రకటించింది.

విజయగణపతి కాలనీ అభివృద్ధికి నిధుల కేటాయింపు

▸▸ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కేయూ క్యాంపస్ జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కేయూ రెండో గేటు వద్ద గల విజయగణపతి కాలనీ అభివృద్ధికి పాటుపడుతాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం విజయ గణపతి సంక్షేమ సంఘం 6వ సర్వసభ్య సమావేశంలో సంఘం కోశాధికారి బి. రవిప్రసాద్ నివాస సముదాయంలో జరిగింది. విజయ గణపతి కాలనీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీఎస్ చారి విజయగణపతి కాలనీ పూర్వపరాలను వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విజయగణపతి కాలనీ కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం రూ.10లక్షలను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే విజయగణపతి దేవాలయం అభివృద్ధికి రూ.50 వేలను ఇస్తానని హామీ ఇచ్చారు. యుద్ధప్రాతిపదికన రెండు నెలల్లోనే కాలనీలోని రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తామని వెల్లడిం చారు. సంక్షేమ సంఘం దినదిన అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సభకు కె.చంద్రరావు అధ్యక్షత వహించారు. కోశాధికారి బి.రవిప్రసాద్ ఆర్థిక నివేదికను నివేదించి సభ్యుల ఆమోదం పొందారు. సంస్థ వ్యవస్థాపకులు మదూరి రవీందర్, మాధవరెడ్డి, రఘుపతిరావు, కృష్ణమూర్తితో పాటు సభ్యులు వెంకటకృష్ణ, నర్సయ్య, రవీందర్, మధు తదితరులు పాల్గొని మాట్లాడారు. కాలనీ బాధ్యులు, పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని శాలువ, పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాధితుడికి సూట్‌కేసు అందజేత

వరంగల్ క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచి పోయిన సూట్‌కేసును బాధితుడికి హనుమకొండ పోలీసులు అందజేశారు. శనివారం హనుమకొండ భవానినగర్‌కు చెందిన కె.అభిషేక్ ఆటోలో ల్యాప్‌టాప్‌తో ఉన్న బ్యాగును మరిచి పోగా ఆటోడ్రైవర్ హనుమకొండ పోలీసులకు అప్పగించాడు. ఆదివారం పోలీసులను సంప్రదిం చగా.. ఆధారాలు పరిశీలించి ఆయన బ్యాగును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్‌తో పాటు పోలీసులకు అభిషేక్ ధన్యవాదాలు తెలిపారు.



బాధితుడికి సూట్‌కేసును అందజేస్తున్న పోలీసులు

ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలి



దప్పులు వాయిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రెడ్డికాలనీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ సోమవారం వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వేల గొంతులు, లక్ష దప్పుల సన్నాహక భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ తెలిపారు. ఆదివారం పెద్దమ్మగడ్డలోని అంబేద్కర్ సెంటరులో డప్పు చప్పుళ్లతో ప్రచారం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ అమలు జరిగితే ఎస్సీలలోని 59 కులాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వేల గొంతులు, లక్షల డప్పుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ బోడ డిన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటల్లో అక్రమ నిర్మాణాలు

పట్టించుకోని సంబంధిత అధికారులు

హసన్‌పర్తి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండల కేంద్రానికి కూత వేటు దూరంలో మిషన్ భగీరథ సామూహిక కార్యాలయాల సమీకృత భవనాలను ఆనుకోని కొంత మంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అక్కడ నిర్మాణాలను సంబంధిత అధికారులు చూస్తున్నారే తప్పా.. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోని ప్రభుత్వ భూములపై కొంతమంది బడా వ్యాపారులు కన్నేసి తమ పలుకుబడిని ఉపయోగించి నిర్మాణాలు చేపడుతున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ కట్టడాలపై సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిబంధలకు విరుద్ధంగా ఉంటే నోటీసులు జారీ చేసి నిర్మాణాలను నిలిపివేసి కోట్ల విలువచేసే ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఐబీ ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. చౌదరి కుంట రిజర్వాయర్ ఇప్పటికీ ఐబీ పరిధిలోనే ఉందని, ఐబీ పరిధి నుంచి డిలీట్ కాలేదని తప్పకుండా విచరణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్న దృశ్యం

ఆరోగ్యశ్రీ నిధులు వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ నాయకులు

వరంగల్ మెడికల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ ఐఎంఏ హాలులో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం వల్ల పేద ప్రజలు, రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆరు నెలలుగా ఆస్పత్రులకు బకాయిలు చెల్లించకపోవడంతో సేవలకు అంతరాయం కలుగుతోందన్నారు. ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించాలని ఆరోగ్యశ్రీ సీఈవోకు కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. సమావేశంలో నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేష్, డాక్టర్ విజయచందర్‌రెడ్డి, డాక్టర్ నాగార్జునరెడ్డి, డాక్టర్ రమేశ్, డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ సమర్థరెడ్డి, డాక్టర్ మహేశ్వర్ పాల్గొన్నారు.

రైల్వే ఇనిస్టిట్యూట్‌లో సాంస్కృతిక పోటీలు



విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

కాజీపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆదివారం రైల్వే కార్మికుల పిల్లలకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను అనురాగ్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షురాలు కె.అనితారెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు రైల్వే స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీలను మజ్దూర్ యూనియన్ ఆల్‌బ్రాంచ్ కో-ఆర్డినేటర్ నాయిని సదానందం, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారా యణలు హాజరై ప్రారంభించారు. ఈఎల్ఎస్ కాజీపేట, యూఎస్ఎఫ్‌డీ సికింద్రాబాద్‌ల మధ్య జరిగిన పోటీలలో ఈఎల్ఎస్ కాజీపేట జట్టు విజయం సాధించింది. అనంతరం లోకో 11, డీఎల్ఎస్ యూత్ వారియర్స్ కాజీపేట జట్ల మధ్య జరిగిన పోటీలలో లోకో 11 జట్టు విజయం సాధించింది. విజేతలకు జనవరి 26న బహుమతులు అందజేస్తామని రైల్వే ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు. కార్యక్రమంలో రైల్వే జేఏసీ ఛైర్మన్ కొండ్ర నర్సింగరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువత సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

కాజీపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): యువత సమాజ శ్రేయస్సుకు పాటు పడాలని బాలవికాస సంస్థ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం యువతలో వ్యక్తిత్వ వికాసంపై రాష్ట్ర స్థాయి యువజన మహాసభ జరిగింది. ఈ కార్యక్రమంలో సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడారు. యువత సామాజిక మాధ్యమాలు వినియోగించుకుని తమలో ఉన్నప్రతిభను సక్రమ మార్గంలో పెట్టి సమాజానికి ఉపయోగపడాలన్నారు. బాలవికాస అధ్యక్షుడు సింగారెడ్డి బూర్థురెడ్డి మాట్లాడారు. అనంతరం అనాథ పిల్లలను చదువులో ప్రోత్సహించడానికి చేయూతగా 600 మంది పిల్లలకు బ్యాగులు, పుస్తకాలు, ట్రావెల్స్ బ్యాగులు అందజేశారు. వివి ధ జిల్లాలకు చెందిన 101 మంది మెరిట్ విద్యార్థులకు ఒక్కొ క్కరికి రూ.5 వేల స్కాలర్‌షిప్‌లు అందజేశారు. 600 మంది పిల్లలకు రూ.20 లక్షల విలువైన ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, ప్రోగ్రామ్ మేనేజర్ లత, సునిత, ప్రోగ్రాం ఆఫీసర్‌లు మంజుల, ప్రతా ప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కె. అనితారెడ్డి

కరోనా సమయంలో ఆటో కార్మికులకు అండగా నిలిచాం : వినయ్‌భాస్కర్



సంఘం మహా సభలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరోనా కష్టకాలంలో ఆటో కార్మికులకు అండగా నిలిచామని, ఆటో కార్మికులతో 30 ఏళ్ల అనుబంధం ఉందని మాజీ చీఫ్ విప్ బీఆర్ఎస్ పార్టీ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో త్రిచక్ర పొదుపు పరస్పర సహాయ సహకార సంఘం కోఆర్డినేటర్ నేరెళ్ల రవీందర్‌రెడ్డి, అధ్యక్షుడు ఈసంపెల్లి సంజీవ ఆధ్వర్యంలో 4వ మహాసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా జెండాను ఎగరవేసి మృతిచెందిన కార్మికులకు నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడారు కార్యక్రమంలో కో ఆపరేటివ్ ట్రెయినింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యాకూబ్ నాయక్, అధ్యాపకులు రాజయ్య, త్రిచక్ర సంఘం ప్రధాన కార్యదర్శి మంద శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి చీకటి కుమార్, డైరెక్టర్లు కలకోట్ల జయరాం, బొల్లం సంజీవ, గుండా రమేష్, రవీందర్, చక్రపాణి, గణేష్, దేవేందర్, ప్రభాకర్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే(హెచ్143) హనుమకొండ జిల్లా కమిటీ నియామకం

హనుమకొండ టౌన్, జనవరి19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీ యూ డ బ్ల్యూ జే హెచ్-143) హనుమకొండ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి, జిల్లా ఎన్నికల అధికారి యోగానంద్ ఆదివారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా మస్కపురి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా అర్షం రాజ్‌కుమార్, కోశాధికారి పొగాకులు ప్రభాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గోకారపు శ్యామ్‌కుమార్, బొడిగే శ్రీనివాస్, బి.కరుణాకర్, దుంపల పవన్, దేవేందర్, ప్రశాంత్, ఎస్.సదానందం, కె.రంజిత్, సంయుక్త కార్యదర్శులుగా రాజేందర్, షైదం సుధాకర్, జె.శ్రీనివాస్, బి.ధన్‌రెడ్డి, ఆదర్శ్, దొమ్మటి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా సూర్యప్రకాష్, రంజిత్, రాంబా బు, చేతి శ్రీనివాస్, రాజ్, నరేందర్‌లను ప్రకటించారు. కాగా, హనుమకొండ జిల్లా నూతన కమిటీని నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్. సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి తడక రాజ్‌నారాయణ, రాష్ట్ర, జిల్లా నాయకులకు ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



మస్కపురి సుధాకర్



అర్షం రాజ్‌కుమార్



పొగాకుల ప్రభాకర్‌గౌడ్

ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల కోసం పోరాడుతా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, అధ్యాపక సమస్యల పరిష్కారానికి శాసనమండలి వేదికగా పోరాడుతానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. ఆదివారం వివిధ ఉపాధ్యాయ వర్గాలను కలిసిన రవీందర్.. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసిన కాలంలో ఉద్యోగ విరమణ వయస్సు పెంపు, పీఆర్సీలో 30 శాతం ఫిట్మెంట్, సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, కేజీబీవీ ఉపాధ్యాయు నులకు 180 రోజుల మెటర్నిటీ లీవు తదిత రాలను సాధించి పెట్టానన్నారు. ఈ సందర్భంగా ఆర్ట్ అండ్ క్రాఫ్ టీచర్స్ అసోసియేషన్ టీఏపీవెటా వ్యవస్థాపక అధ్యక్షుడు కె. కమలాకర్‌రావును కలిసి మద్దతు కోరగా ఆయన తమ సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అంతకుముందు ఆర్ట్స్ కళాశాల, కాకతీయ యూనివర్సిటీలో ప్రచారం నిర్వహించి తనకు ఓటు వేయాల్సిందిగా అధ్యాపకులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జాక్టో నాయకులు డాక్టర్ యాట సదయ్య, రవి, సుధాకర్‌రెడ్డి, రమేష్, రాంబాబు, నాగరాజు, రాంబాబు, మధుసూదన్, ప్రవీణ్, గణేష్, తిరుపతి, సురేష్, శైలేంద్రకుమార్, సమ్మయ్య, భాస్కర్ పాల్గొన్నారు.



పూల రవీందర్‌ను సత్కరిస్తున్న ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలాకర్‌రావు

ఎంపీని కలిసిన ఐఎంఏ నాయకులు



ఎంపీ కావ్యను పూలమొక్క అందజేస్తున్న ఐఎంఏ నాయకులు

వరంగల్ మెడికల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యను వరంగల్ జిల్లా ఐఎంఏ నూతన కార్యవర్గం ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసింది. హనుమకొండలోని ఎంపీ స్వగృహంలో కలిసి ఎంపీకి పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఐఎంఏకు సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగార్జునరెడ్డి, కార్యదర్శి డాక్టర్ అజిత్ మహ్మద్, కోశాధికారి డాక్టర్ శిరీష్ కుమార్, వరంగల్ జిల్లా తానా నూతన అధ్యక్షుడు డాక్టర్ ముక్క దిలీప్ కుమార్, ఐఎంఏ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ మన్మోహన్‌రాజ్, టీజీఎంసీ సభ్యులు, ఐఎంఏ జిల్లా ఉపాధ్యక్షుడు, వరంగల్ జిల్లా తానా కోశాధికారి డాక్టర్ వి.నరేశ్ కుమార్, డాక్టర్ దివిజ పాల్గొన్నారు.

పూడుకుపోయిన డ్రైనేజీ

ఇబ్బందుల్లో కాలనీ వాసులు

మడికొండ, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మడికొండలోని పెద్ద చెరువు కట్ట పోచమ్మ గుడి వద్ద డ్రైనేజీ పూర్తిగా పూడుకుపోయింది. దీంతో మురుగు నీరు వెళ్లక పోవడంతో చెరువు కట్ట కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. కొద్ది రోజుల కిందట చెరువు కట్టవద్ద డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనుల కోసం పైనుంచి డ్రైనేజీ నీరు కిందకు రాకుండా కాంట్రాక్టర్ డ్రైనేజీని మట్టితో మూసివేయించాడని, పనులు పూర్తయిన తర్వాత డ్రైనేజీలో పేరుకుపోయిన మట్టి తొలగించకపోవడంతో పైనుంచి వచ్చే మురుగునీరు కిందికి వెళ్లడంలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. దీంతో డ్రైనేజీ నుంచి వచ్చే దుర్వాసన, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్, మునిసిపల్ సిబ్బంది డ్రైనేజీలోని మట్టిని తొలగించి డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెరువు కట్ట పోచమ్మ గుడి వద్ద మట్టి, చెత్తతో కూరుకుపోయిన డ్రైనేజీ



ఆమే అతడి ధైర్యం

దాదాపు పాతికేళ్ళ క్రితమే తెర మీద నుంచి తప్పుకున్నా... భర్త అజిత్‌ను వెన్నంటి ప్రోత్సహించి... ఆయన విజయాలకు ప్రేరణనిస్తున్నారు షాలినీ. ఆడంబరాలకు దూరంగా ఉండే ఈ కోలీవుడ్ సెలబ్రిటీ జంట... దుబాయ్‌లో జరిగిన '24 హెచ్ కార్ రేసింగ్'లో సందడి చేసింది. షాలినీపై అజిత్ ప్రశంసలు, రేస్ అనంతరం ఆమెను హత్తుకున్న అతని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. 'సఖి'గా యువ హృదయాలను దోచిన షాలినీ ఇప్పుడు భర్త కెరీర్‌కు, అభిరుచులకు అండగా నిలుస్తున్నారు.

"షాలూ! నన్ను రేస్‌లో పాల్గొననిచ్చినందుకు ధన్యవాదాలు..." దుబాయ్‌లో ఈ నెల రెండో వారంలో జరిగిన '24 హెచ్ కార్ రేసింగ్'లో తమ జట్టు మూడో స్థానంలో నిలిచిన తరువాత... తమిళ్ స్టార్ హీరో అజిత్ వేదిక పైనుంచి చెప్పిన ఈ మాటలకు ఆ హాల్ అంతా కరతాళ ధ్వనులతో మార్మోగింది. ముందు వరుసలో నిలబడిన అజిత్ భార్య షాలినీ చిరునవ్వుతో ప్రతిస్పందించారు. అంతకుముందు రేస్ పూర్తయ్యాక... జనంలోకి వచ్చిన అజిత్... షాలినీని చుంబించిన దృశ్యం క్షణాల్లో సోషల్ మీడియా అంతటా వైరల్ అయింది. 24 గంటలసేపు కొనసాగే ఈ రేస్... ఇటు రేసర్ సహనానికీ, అటు వాహనం సామర్థ్యానికీ పెద్ద పరీక్ష. పదిహేనేళ్ళ తరువాత రేస్ ట్రాక్ మీద సొంత టీమ్ తరఫున దిగిన అజిత్ త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకొని మరీ... టాప్-3లో నిలిచారు. అజిత్ హీరో, రేసర్ మాత్రమే కాదు, ఎన్నో పోటీల్లో పతకాలు గెలుచుకున్న షూటర్ కూడా! బైక్ మీద దేశం చుట్టేస్తూ ఉంటారు. డ్రోన్ టెక్నాలజీ లాంటి అభిరుచులు చాలా ఉన్నాయి. ప్రాణాలకు తెగించే సాహసాలంటే అతనికి ప్రాణం. "యాభై మూడేళ్ళ వయసులోనూ ఇవన్నీ చెయ్యగలుగుతున్నానంటే ఇల్లాలి ప్రోత్సాహమే కారణం. ఈ ఏడాది ఏప్రిల్‌కు పాతికేళ్ళు నిండే మా వైవాహిక జీవితంలో... షాలినీ చేసిన త్యాగాలే ఎక్కువ. ఆమే నా ధైర్యం" అంటారు అజిత్.

మొదట్లో ఒప్పుకోలేదు...

షాలినీ... ఒకప్పుడు దక్షిణాదిలో, ప్రధానంగా తమిళంలో అగ్రశ్రేణి బాలతార. నాలుగేళ్ళ వయసులోనే తెరంగేట్రం చేశారు. ఆమె తండ్రి దాస్‌కు సినిమాలంటే ఆసక్తి. నటుడు కావాలనుకున్న తన అభిరుచిని తన కుమార్తెలైన షాలినీ, షామిలీ, కుమారుడు రిచర్డ్ రిషి ద్వారా నెరవేర్చుకున్నారు. వారిలో తొలుత తెరంగేట్రం చేసిన షాలినీ... తమిళ, కన్నడ, మలయాళ, హిందీ చిత్రాలతో పాటు 'బంధం', 'జైలుపక్షి', 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' తదితర తెలుగు చిత్రాల్లోనూ ఆకట్టుకున్నారు. ఆరేళ్ళ విరామం తరువాత హీరోయిన్‌గా రీఎంట్రీ ఇచ్చారు. వరుసగా సినిమాలు చేస్తున్న సమయంలో... అజిత్ హీరోగా 'అమర్కాలం' చిత్రాన్ని తీయాలనుకున్న దర్శకుడు శరణ్... కథానాయిక పాత్ర కోసం షాలినీని సంప్రతించారు. కానీ ప్లస్-2 పరీక్షలకు సిద్ధం అవుతున్న షాలినీ ఆ ఆఫర్‌ను తిరస్కరించారు. ఆ పాత్రను షాలినీతోనే చేయించాలనుకున్న శరణ్... మూడు నెలలపాటు తీవ్రంగా ప్రయత్నించి మరీ ఆమెను ఒప్పించారు.

గాయంతో మొదలైన ప్రేమ

ఆ సినిమా సెట్‌లోనే అజిత్‌కు, షాలినీకి పరిచయమైంది. షూటింగ్‌లో అనుకోని సంఘటన జరిగింది. అది షాలినీని అజిత్ కత్తితో బెదిరించే సన్నివేశం. అజిత్ కత్తిని పొరపాటున విదిలించడంతో... షాలినీ చేతికి గాయమై, రక్తస్రావమైంది. అజిత్ వెంటనే షూటింగ్ ఆపించి... ఆమెకు ప్రథమ చికిత్స చేయించారు. ఆ తరువాత ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. ఆ సమయంలో అజిత్ చూపిన శ్రద్ధకు ఫిదా అయిపోయానంటారు షాలినీ. "నా కారణంగా షాలినీకి గాయం కాగానే నాకు



దిక్కు తోచలేదు. ఆమెకు ఎలాంటి ప్రమాదం లేదని తెలిశాక నా మనసు కుదుటపడింది. నేను ఆమెను ప్రేమిస్తున్నాననే విషయం కూడా అప్పుడే నాకు అర్థమైంది" అంటారు అజిత్. షూటింగ్ విరామంలో ఒకరికొకరు రహస్యంగా కాల్స్ చేసుకొనేవారు. ఈ ఇద్దరి ప్రణయం గురించి తమిళ పత్రికలు అప్పట్లో విస్తృతంగా రాశాయి కూడా. ఇలా కొన్ని నెలల డేటింగ్ తరువాత... ఇరు కుటుంబాలనూ ఒప్పించి, పెళ్ళి చేసుకున్నారు.

అది ఎంత కష్టమో తెలుసు...

మణిరత్నం దర్శకత్వంలో షాలినీ నటించిన 'అలై పాయుదే' (తెలుగులో 'సఖి') చిత్రం 2000 ఏప్రిల్ 14న విడుదలైంది. అదే నెల 24న అజిత్, షాలినీల వివాహం జరిగింది. అప్పటికే నటిస్తున్న మరో చిత్రాన్ని పూర్తి చేసిన షాలినీ ఇరవై రెండేళ్ళకే నటనకు స్వస్తి చెప్పి, గృహిణిగా స్థిరపడిపోయారు. ఇరవై నాలుగేళ్ళుగా మళ్ళీ తెరపై కనిపించలేదు. 'సఖి' చిత్రంతో ఆమె నటన సర్వత్రా ప్రశంసలందుకుంది. తమిళనాడు ప్రభుత్వం నుంచి ఉత్తమనటిగా ప్రత్యేక బహుమతి కూడా ఆమె అందుకున్నారు. ఈ క్రమంలో ఎన్నో ఆఫర్లు వచ్చినా ఆమె అంగీకరించలేదు. "ఎంతో మంది హీరోయిన్లు పెళ్ళయ్యాక కూడా నటిస్తున్నారు. మీకు ఆ ఆలోచన రాలేదా? అనే ప్రశ్న నాకు చాలాసార్లు ఎదురయింది. నటించడం అంటే నాకు ఎంతో ఇష్టం. కానీ అజిత్ నా ప్రాణం. సినిమాలను, ఇంటినీ బ్యాలెన్స్ చేసుకోవడం ఎంత కష్టమో నాకు తెలుసు. అలాంటి సమయాల్లో దేనికీ న్యాయం చెయ్యలేను. అందుకే ఇల్లు, సంసారం నా ప్రాధాన్యం అనుకున్నాను. దానికే కట్టుబడ్డాను" అని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు షాలినీ. "ఆమె తీసుకున్న ఈ నిర్ణయం నా అదృష్టం. నా విజయాలన్నిటి వెనుక ఆమె ఉంది" అంటారు అజిత్. మళ్ళీ కార్ రేసుల్లోకి రావాలనే ఆలోచనతో 'అజిత్ కుమార్ రేసింగ్ టీమ్'ను ఆయన ప్రారంభించినప్పుడు... దాని బ్రోచర్ స్క్రీన్ షాట్‌ను షాలినీ షేర్ చేస్తూ "నిన్ను మళ్ళీ రేసింగ్ డ్రైవర్‌గా చూస్తున్నందుకు, నువ్వు ఇష్టపడేది నువ్వు చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా అనిపిస్తోంది. భవిష్యత్తులో నీకు, నీ టీమ్‌కు సురక్షితమైన, విజయవంతమైన రేసింగ్ కెరీర్ లభించాలని కోరుకుంటున్నాను" అని ట్వీట్ చేశారు.

ఆ క్రెడిట్ ఆమెదే...

ఈ దంపతులకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. వారి బాగోగులు చూసుకుంటూనే... 'మోహిని-మణి ఫౌండేషన్' బాధ్యతల్లో కూడా షాలినీ క్రియాశీలకంగా ఉన్నారు. తన తల్లితండ్రుల పేరిట అజిత్ ఏర్పాటు చేసిన ఈ లాభాపేక్షలేని సంస్థ... వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహనను, పౌర స్పృహను పెంపొందించడంతో సహా పలు కార్యక్రమాలను చేపడుతోంది. "ఆడంబరాలకు, వివాదాలకు దూరంగా ఉండే అజిత్-షాలినీది ఆదర్శప్రాయమైన జంట" అంటారు సినీ అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా. "ఈ క్రెడిట్‌లో అధిక శాతం షాలినీకే చెందాలి" అంటారు అజిత్. సక్సెస్‌లో ఉన్నప్పుడే సినీ రంగం నుంచి తప్పుకొని... భర్త విజయానికి అండగా నిలుస్తున్న షాలినీ... అజిత్‌తో పాటు దాదాపు ప్రతి రేస్‌కూ, పోటీకీ హాజరవుతారు. ప్రేక్షకుల గ్యాలరీలో కూర్చొని... ఆయనలో ఉత్సాహాన్ని నింపుతూ ఉంటారు. ప్రస్తుతం అజిత్ పూర్తి చేసిన రెండు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. ఆ తరువాత ఆయన మరే చిత్రానికీ సంతకం చెయ్యలేదు. తన రేసింగ్ కెరీర్, టీమ్ మీదే ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రేసింగ్ సీజన్ పూర్తయ్యాక... మళ్ళీ సెట్స్ పైకి వస్తారు. తదుపరి రేసులకు సిద్ధమవుతున్న అజిత్ నటననూ, అభిరుచినీ సమతుల్యం చేసుకోవడంలో షాలినీ ముఖ్యపాత్ర పోషిస్తున్నారు.



మోకాళ్ల నొప్పులా?

సాధారణంగా మహిళలకు వయసు పెరిగేకొద్దీ మోకాళ్లలో మృదులాస్థి అరిగిపోతుంటుంది. దీనివల్ల మెట్లు ఎక్కేటపుడు, దిగేటపుడు, నడుస్తున్నపుడు మోకాళ్లలో విపరీతంగా నొప్పి వస్తుంది. తాజా కూరగాయలు, పండ్లు తీసుకుంటూ కొన్ని చిట్కాలు పాటిస్తే చాలా వరకు ఈ నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది. ఆ చిట్కాల వివరాలు...

అల్లం నీళ్లు : స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు కప్పుల నీళ్లు పోసి బాగా మరిగించండి. దీనిలో ఒక చెంచా అల్లం తురుం, ఒక చెంచా పసుపు వేసి రెండు నిమిషాలు ఉడికిన తరవాత ఈ నీళ్లను వడకట్టి అందులో ఒక చెంచా తేనె కలిపి తాగండి. ఇలా రోజూ తాగితే మోకాళ్ల నొప్పి తగ్గుతుంది.

పసుపు పాలు : ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు, ఒక చెంచా తేనె కలుపుకుని తాగుతూ ఉంటే మోకాళ్ల నొప్పి, వాపు తగ్గుతాయి. పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, పాలలోని కాల్షియం కలిసి నొప్పి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

దాల్చిన చెక్క టీ : స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి వేడిచేయండి. అందులో ఒక అంగుళం పొడవున్న దాల్చిన చెక్క లేదా అర చెంచా దాల్చిన చెక్క పొడి వేసి అయిదు నిమిషాలు ఉడకనివ్వండి. తరవాత ఈ నీటిని వడకట్టి అందులో ఒక చెంచా తేనె కలుపుకుని తాగండి. ఇలా రెండు రోజులకోసారి తాగుతూ ఉంటే మోకాళ్లలో గుజ్జు పెరిగి నొప్పి తగ్గుతుంది.

అరటిపండు : అరటిపండులో ఎ, బి, సి విటమిన్లతోపాటు ఐరన్, కాల్షియం, పొటాషియం, సోడియం, మెగ్నీషియం, పిండి పదార్థాలు ఉంటాయి. ఇవన్నీ కండరాలను బలోపేతం చేస్తాయి. ప్రతిరోజూ ఒక అరటి పండు తింటూ ఉంటే మోకాళ్లలోని కీళ్లు పెళుసుబారకుండా మృదువుగా కదులుతాయి. దీంతో వాపు, నొప్పి బాధించవు.

దానిమ్మ గింజలు : వీటిలో సి విటమిన్, పీచుపదార్థాలు ఉంటాయి. ఇవి మోకాళ్లలో కీళ్ల చుట్టూ ఆవరించి ఉన్న గుజ్జును కాపాడతాయి. ప్రతిరోజూ గుప్పెడు దానిమ్మ గింజలు తింటూ ఉంటే మోకాళ్ల నొప్పులు రావు.

వాము : వాము వాత గుణాన్ని హరిస్తుంది. మోకాళ్లలో కదలికలను సులభతరం చేస్తుంది. ప్రతిరోజూ భోజనం తరవాత ఒక చెంచా వాము తింటూ ఉంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

పోషకాహారం : నానబెట్టిన బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు గింజలను తరచూ తినాలి. పాలకూర, మెంతికూర, తోటకూరలను ఆహారంలో చేర్చుకుంటే మోకాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. చిక్కుళ్లు, గుడ్లు, చేపలు, పాల ఉత్పత్తులను తీసుకోవడం వల్ల మోకాళ్ల సమస్యలు రావు.

చెవి కమ్మలు.... కొత్తగా...

పదిమందిలో ప్రత్యేకంగా కనిపించాలంటే దుస్తులకు తగ్గట్టు ఆభరణాలు ధరించాల్సిందే! ముఖ్యంగా చెవి కమ్మలను ట్రెండ్‌కు తగ్గట్టు ఎంపిక చేసుకోవాలి. ఉద్యోగినులకు, యువతులకు అన్నివిధాలా అనుకూలంగా ఉండే సరికొత్త చెవి కమ్మల వివరాలు...

నగ్ స్టడ్స్



● ప్రస్తుతం మహిళలు.... నగ్ వర్క్ చేసిన చెవి దిద్దులను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. బంగారంతో వివిధ ఆకృతుల్లో రూపొందించిన దిద్దుల మీద సీజెడ్‌లు లేదా ఆకుపచ్చ, ఎరుపు, గులాబీ రంగు రాళ్లను పొదుగుతారు. వీటికి ముత్యాలను కూడా చేర్చి మరింత ఆకర్షణీయంగా తయారు చేస్తున్నారు. వీటిని చీరలు, లెహంగాలు, లంగా-ఓణి లాంటి సంప్రదాయ దుస్తులు ధరించినపుడు పెట్టుకోవచ్చు.

స్టడ్ హ్యాంగింగ్స్



● నెమలి ఆకారంలో బంగారు దిద్దులను తయారుచేసి వాటికి పెద్ద ముత్యాన్ని చిన్న బంగారు గుండును కొద్దిగా వేలాడేలా జతచేస్తారు. మధ్య వయసు మహిళలు, ఉద్యోగినులు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అందంగా కనిపించడమే కాకుండా రోజువారీ పెట్టుకోవడానికి అనుకూలంగా ఉంటాయి.

ఫ్లవర్ స్టడ్స్



● అందమైన పూల ఆకృతిలో దిద్దులను తయారు చేసి వాటి మధ్యలో కొన్ని గుండ్లను అతికిస్తారు. వీటిని పూర్తిగా బంగారంతోనే తయారు చేస్తారు. ఇవి అన్ని వయసులవారికీ అన్ని రకాల దుస్తుల మీద చక్కగా నప్పుతాయి.

బాల్ రింగ్స్



● ట్రెండీగా ఉంటూ మోడరన్ లుక్ కోరుకునే అమ్మాయిలకు ఇవి బాగుంటాయి. చిన్న బంతిలా కనిపించే బంగారు గుండులోనించి గుండ్రని రింగుని జొప్పించి వీటిని తయారు చేస్తారు. కార్యాలయాలకు, కాలేజీలకు వెళ్లే యువతులు వీటిని రోజువారీ పెట్టుకోవచ్చు.

బెల్ రింగ్స్



● గుండ్రని రింగులకు బంగారు గుండ్లు అతికించి బంగారు తీగతో మువ్వలు వేలాడేలా అమరుస్తారు. వీటిని యువతులు ఎక్కువగా ఆదరిస్తున్నారు. మోడరన్ దుస్తుల మీద ఆకర్షణీయంగా కనిపిస్తాయి. వీటిని బ్లాక్ మెటల్‌తో కూడా రూపొందిస్తున్నారు.

హూప్స్



● ఒక పెద్ద రింగులో మరో చిన్న రింగును పెట్టి రెంటినీ చక్కని డిజైన్‌తో అనుసంధానిస్తారు. పక్షులు, లతలు, బంగారు గుండ్లతో కూడిన ఈ డిజైన్ ఆకర్షణీయంగా ఉంటుంది. మోడరన్ దుస్తులు ధరించేవారందరికీ ఇవి బాగా నప్పుతాయి. సాధారణంగా కనిపిస్తూనే ముఖానికి రిచ్ లుక్‌నిస్తాయి.

సాధించింది... సమున్నతంగా!

మనసుంటే మార్గం ఉంటుంది. ఈ సామెతను నిజం చేసి, ఏడు ఖండాల్లోని ఏడు పర్వతాలను అధిరోహించిన అతి పిన్న వయస్కురాలిగా చరిత్ర సృష్టించింది 17 ఏళ్ల కామ్య కార్తికేయన్. ఈ ముంబయి వాసి పర్వతారోహణ ప్రయాణం ఎలా మొదలైందో తెలుసుకుందాం.

స్ఫూర్తి



ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించాలనే లక్ష్యంతో మొదట ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించింది కామ్య. ఆ తర్వాత యూరప్‌లోని ఎల్‌బ్రస్ పర్వతం, ఆస్ట్రేలియాలోని కోషిస్కో పర్వతం, దక్షిణమెరికాలోని ఏకన్‌కాగ్వా పర్వతం, ఉత్తరమెరికాలోని డెనాలి పర్వతం, ఆ తర్వాత ఆసియాలోని ఎవరెస్టు పర్వతాలను వరుసగా అధిరోహించింది. చివరిగా ఏడవ పర్వతాన్ని అధిరోహించడం కోసం అంటార్కిటికాకు చేరుకున్న కామ్య, గత నెల 24న తన తండ్రి, ఇండియన్ నేవీ కమాండర్ ఎస్.కార్తికేయన్‌తో కలిసి విన్సన్ పర్వతాన్ని అధిరోహించి చరిత్ర సృష్టించింది. ఆ విధంగా ప్రపంచంలోని ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించడం ద్వారా ప్రపంచంలోని అత్యంత ఎత్తయిన ప్రదేశాలకు చేరుకుంది. పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించి చూపించింది.

ట్రెక్కింగ్‌తో మొదలుపెట్టి...

పర్వతారోహణ పట్ల తన తండ్రికున్న మక్కువ నుంచి ప్రేరణ పొందిన కామ్య, చిన్న వయసు నుంచే ట్రెక్కింగ్ మొదలుపెట్టింది. ఆ క్రమంలో ఏడేళ్ల వయసులో పర్వతారోహణ పట్ల ఆసక్తి ఏర్పడడానికంటే ముందు కామ్యకు ట్రెక్కింగ్ మీద ఆసక్తి పెరిగింది. మూడేళ్ల వయసు నుంచే ఎక్కువ దూరాల పాటు ట్రెక్కింగ్ మొదలుపెట్టిన కామ్య, 2015లో, ఏడేళ్ల వయసులో చంద్రశిల పీక్‌కు ట్రెక్కింగ్ చేయడం ద్వారా తన హిమాలయ పర్వతారోహణ ప్రయత్నాలను మొదలుపెట్టింది. ఆ తర్వాత మరింత పురోగతి సాధించి, 2016, 2017లో హర్ కి దున్, కేదార్‌నాథ్ పీక్, రూప్‌కుండ్ లేక్‌లకూ, ఎవరెస్టు బేస్ క్యాంప్‌కూ ట్రెక్కింగ్ చేసి ఇంతటి మైలురాయిని అందుకున్న ప్రపంచంలోని రెండవ బాలికగా పేరు తెచ్చుకుంది. 2019లో కామ్య బ్రిగు లేక్‌ను దాటి, హిమాచల్ ప్రదేశ్‌లోని సార్ పాస్‌ను దాటేసింది.

21 అంతస్తులు... 20 కిలోల బరువు...

పిల్లలు సాధించిన విజయాలకు పొంగిపోని తల్లితండ్రులు ఉండరు. కామ్య తల్లి లావణ్య కార్తికేయన్ కూడా ఇందుకు మినహాయింపు కాదు. కూతురు సాధించిన విజయాలు చూసి గర్వంతో పొంగిపోతున్న ఆ తల్లి కామ్య గురించి మాట్లాడుతూ... "ఇప్పటివరకూ సాధించిన విజయాల కోసం కామ్య ఎన్ని త్యాగాలు చేసిందో, ఎంత కష్టపడిందో తల్లిగా నాకు తెలుసు. కామ్య ప్రతి రోజూ 2 నుంచి 3 గంటలు సాధన చేస్తుంది. పది నుంచి పన్నెండు కిలోమీటర్ల దూరం పరిగెత్తుతుంది. ముంబయిలో ఉండేవాళ్లం కాబట్టి అక్కడ మలబార్ కొండల మీద ట్రెక్కింగ్ సాధన చేస్తూ ఉండేది. అలాగే మేం 21వ అంతస్తులో ఉండేవాళ్లం. కాబట్టి పర్వతారోహణకు తగినట్టుగా కండరాలను బలపరుచుకోవడం కోసం 10 నుంచి 20 కిలోల బరువుతో పైకీ కిందకూ ఎక్కి దిగడం సాధన చేసింది. ఇలా కామ్య అనుకున్నది సాధించడం కోసం శాయశక్తులా కష్టపడింది. పట్టుదలగా కృషి చేసింది కాబట్టే ప్రపంచంలోని ఏడు ఖండాల్లో ఉన్న ఏడు ఎత్తైన శిఖరాలను అధిరోహించాలనే కలను సాకారం చేసుకోగలిగింది. 2021లో కామ్య ప్రధానమంత్రి బాలశక్తి పురస్కారాన్ని పొందింది. ప్రధాని మాటలే కామ్యకు ప్రేరణగా మారాయని అనిపిస్తుంది. ఈ సందర్భంగా నేను తల్లులందరికీ ఒక సందేశం ఇవ్వాలనుకుంటున్నాను. తల్లులందరం దృఢంగా ఉండగలిగితే, మనం దృఢమైన ఆడపిల్లలను పెంచగలుగుతాం" అంటూ కామ్య గురించి చెప్పుకొచ్చింది లావణ్య కార్తికేయన్. కామ్య కథ ప్రపంచవ్యాప్త యువతకు, ప్రత్యేకించి కన్న కలలను నిజం చేసుకోవాలనే అమ్మాయిలకు స్ఫూర్తినిస్తుంది. ప్రపంచంలోని ఏడు ఎత్తయిన శిఖరాలను అధిరోహించడం ద్వారా విజయాలను సాధించడానికి వయసుతో సంబంధం లేదనీ, కలలను సాకారం చేసుకోవాలనే దృఢ సంకల్పం, అంకితభావాలుంటే ఎవరైనా అనుకున్నది సాధించగలుగుతారనీ కామ్య నిరూపించింది.

చిత్రజ్యోతి

SINCE 1965

కోపంగా చూడకే గాలి దుమారమే రేగినట్లు



కిరణ్ అబ్బవరం నటిస్తోన్న తాజా చిత్రం 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ కథానాయిక. విశ్వ కరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, సారెగమ నిర్మిస్తున్నారు. వచ్చే నెల 14న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. 'అగ్గిపుల్లై అలా గీసినట్లు, కోపంగా చూడకే గాలి దుమారమే రేగినట్లు, ఆవేశమెందుకే నొక్కిపెట్టు' అని సాగుతుందీ గీతం. సామ్ సీఎస్ సంగీతం అందించారు.

ఇండో-కొరియన్ హారర్ కామెడీ



వరుణ్ తేజ్ పుట్టిన రోజు సందర్భంగా కొత్త సినిమాను ప్రకటించారు. ఈ చిత్రానికి మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించనున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ దీన్ని భారీ స్థాయిలో నిర్మించనున్నాయి. ఈ మేరకు మేకర్స్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ రిలీజ్ చేశారు. పోస్టర్ ఒక ప్రత్యేకమైన కొరియన్ కనెక్షన్‌ను చూపిస్తోంది. ఈ ఇండో-కొరియన్ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ యూనిక్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు. తమన్ సంగీతం అందించనున్న ఈ చిత్రం ప్రొడక్షన్ వర్క్ మార్చిలో ప్రారంభం కానుంది. ఇతర నటీనటులు, సాంకేతిక సిబ్బంది వివరాలను త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.

అమ్మకు పద్మ అవార్డు వచ్చేలా ప్రయత్నిస్తా

- సీనియర్ నటుడు నరేశ్



"మా అమ్మ విజయనిర్మలపై ఓ బయోపిక్ తెరకెక్కించే ఆలోచన ఉంది. 46 సినిమాలకు దర్శకత్వం వహించిన ఏకైక మహిళా దర్శకురాలు విజయనిర్మల. ఆమెకు పద్మ అవార్డు రాకపోవడం బాధాకరం. ఆమెకు అవార్డివ్వాలని ఒకసారి ఢిల్లీ వరకు వెళ్లాను. అయినా ప్రయోజనం లేదు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా అమ్మ పేరును పద్మ అవార్డు కోసం రికమెండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వం అర్హులను గుర్తించి అవార్డులను ఇవ్వడం సంతోషకరమైన విషయం. అమ్మకు ఆ పురస్కారం దక్కేలా మరోసారి ప్రయత్నిస్తా" అని అన్నారు సీనియర్ నటుడు నరేశ్. ఇటీవలే విడుదలై హిట్ టాక్‌తో దూసుకుపోతున్న చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. ఇందులో ముఖ్యమంత్రి పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించారు నరేశ్. ఆదివారం విలేకరులతో ముచ్చటించిన ఆయన తన తదుపరి చిత్రాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'నా కెరీర్‌లోనే ఈ ఏడాది తీరిక లేని సంవత్సరంగా ఉండనుంది. 40 రోజుల్లో 22 కథలు విన్నాను. ప్రస్తుతానికి తొమ్మిది సినిమాల్లో నటిస్తున్నా' అని చెప్పారు. సోమవారం ఆయన పుట్టినరోజు కావడంతో ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేశారు.

మూడు పాత్రల చుట్టూ కోర్టు డ్రామా



ప్రియదర్శి లాయర్‌గా ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఏ నోబడి'. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. హీరో నాని సమర్పణలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి రామ్ జగదీశ్ దర్శకుడు. న్యాయవాదిగా కేసు ఫైల్ పట్టుకుని ఆలోచిస్తున్న ప్రియదర్శి, హర్ష్ రోషన్, శ్రీదేవి ఈ పోస్టర్‌లో కనిపించారు. 'మూడు కీలక పాత్రల చుట్టూ తిరిగే కోర్టు డ్రామా కథ ఇది. బలమైన కథాంశంతో ఈ సినిమా ఆలోచింపజేసే విధంగా ఉంటుంది' దర్శకుడు రామ్ చెప్పారు. 'షూటింగ్ దాదాపు పూర్తయిందనీ, హోలీ సందర్భంగా మార్చి 14న విడుదల చేస్తాం' అని నిర్మాత ప్రశాంతి తిపిర్నేని చెప్పారు.

వాషింగ్టన్ కుర్రోడు



సత్య వినుగొండ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను 'జాతిరత్నాలు' ఫేమ్ అనుదీప్.కె.వి విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు సత్య మాట్లాడుతూ "ఇది విభిన్న తరహా యాక్షన్‌తో కూడిన వినోదాత్మక చిత్రం" అని చెప్పారు.

విభిన్న కథనాలతో...



రవిబాబు, సుమన్, ఏస్తర్, ఆమని, రాశి ప్రధాన పాత్రల్లో శెట్టిపల్లి శ్రీనివాసులు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'షూటర్'. ఈనెల 22న వరల్డ్ వైడ్‌గా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మూవీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. చిత్ర దర్శకనిర్మాత శ్రీనివాసులు మాట్లాడుతూ 'విభిన్న కథనాలతో 'షూటర్'ని తెరకెక్కించాం. ప్రతి ఫ్రేమ్ ఆర్టిస్టులతో అద్భుతంగా ఉంటుంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. డ్రమ్స్ రాంబాబు సంగీతం అందించారు.

తిరుమలలో చిత్ర బృందం



'సంక్రాంతికి వస్తున్నాం' చిత్ర బృందం ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. చిత్ర నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, చైల్డ్ ఆర్టిస్ మాస్టర్ బుల్లిరాజ్ భీమాలా రేవంత్, నటుడు శ్రీనివాస్‌రెడ్డి, సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ బృందంలో ఉన్నారు.

తిరుమల (ఆంధ్రజ్యోతి)

దిక్సూచి
DIKSUCHI

ఇంటర్ ప్రాక్టికల్స్
ఇలా చేస్తే ఫుల్ మార్కులు



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇంటర్మీడియెట్ పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య దాదాపు ఇరవై లక్షలకు దగ్గరగా ఉంటుంది. దీనిలో సగం అంటే పది లక్షల వరకు ఇంటర్ రెండో సంవత్సరంలో ఉంటారు. ఇందులో అరవై, డెబ్బయి శాతం మంది ఎంపీసీ, బైపీసీ వారే.

జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలైన జేఈఈ, నీట్, బిట్‌శాట్‌లలో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేకపోయినా, టీఎస్, ఏపీ ఎప్‌సెట్‌లలో ఎంపీసీ, బైపీసీ సబ్జెక్టులకు 25 శాతం మెయిటేజీ ఉంటుంది. దీని కారణంగా ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌కి ప్రాధాన్యం పెరిగింది. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో 30 మార్కుల చొప్పున మొత్తం ప్రాక్టికల్స్‌కి 60 మార్కులు కేటాయించారు. బైపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున మొత్తం 120 మార్కులు కేటాయించడం జరిగింది.

1 జాతీయస్థాయి పోటీ పరీక్షలపై దృష్టిపెట్టిన కొన్ని కాలేజీలు విద్యార్థులకు ప్రాక్టికల్స్ సరిగ్గా చేయించకుండా కేవలం పరీక్షలకు ముందు తూతూ మం త్రంలాగే నడిపించి పంపుతున్నారనే వార్తలు రావడంతో ఇంటర్మీడియెట్ బోర్డు ఈ ల్యాబ్ పరీక్షలను కూడా సీరియస్‌గా నిర్వహించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగానే సీసీటీవీల ఏర్పాటు, కచ్చితమైన అటెండెన్స్, ప్రశ్నపత్రం లీక్ కాకుండా జాగ్రత్తల తోపాటు, రికార్డు పుస్తకాలను సరిగ్గా వాల్యుయేట్ చేయించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

1 అయితే ల్యాబ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల కేవలం మార్కుల కోసమే కాకుండా కొంత సబ్జెక్టు నాలెడ్జ్ పెంచుకుంటే జేఈఈ, నీట్ పరీక్షల్లో కూడా ఉపయోగపడుతుంది. విద్యార్థులు ఈ కింది అంశాలపై దృష్టిపెడితే ప్రాక్టికల్స్‌లో పూర్తి స్థాయి మార్కులు సాధించవచ్చు.

1. **ప్రాక్టికల్ రికార్డ్ బుక్స్:** సిలబస్‌లో ఉన్న అన్ని ప్రయోగాలు, వాటి అబ్జర్వేషన్స్/ రిజల్ట్స్‌ను జాగ్రత్తగా రాయాలి. అయితే కొంతమంది విద్యార్థులు రికార్డు ఇంకొకరితో రాయిస్తారు. దీనివల్ల సబ్జెక్టు నాలెడ్జ్ పెరగకపోవడంతో, పరీక్షలో ఎగ్జామినర్ అడిగే ప్రశ్నలకు మార్క్స్‌పోగొట్టుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి రికార్డులు సొంతంగా రాయడం ఉత్తమం.
2. **ప్రయోగాల సూత్రాలు:** ఎక్విప్‌మెంట్స్ లేదా ఇన్‌స్ట్రుమెంట్స్‌తో ప్రాక్టికల్స్ చేస్తున్నప్పుడు ఆ ప్రయోగం వెనక ఉన్న ఫండమెంటల్స్‌ను, ఇన్‌స్ట్రుమెంట్స్‌ని, వాటి ఉపయోగాలను అర్థం చేసుకోవాలి. పక్కన ప్రయోగం చేస్తున్న విద్యార్థులను అనుకరించవద్దు.
3. **గ్రాఫ్ డ్రాయింగ్:** ఇది అతి ముఖ్యమైన అంశం. మీ ల్యాబ్ సిలబస్‌లో గ్రాఫ్స్ ఉన్నట్లయితే రికార్డ్ బుక్స్‌లో వాటిని జాగ్రత్తగా పొందుపర్చడంతో పాటు ఎగ్జామ్‌లో గీయాల్సి వస్తే, దానికి సంబంధించిన డేటాని సరిగ్గా విశ్లేషించాలి.
4. **డయాగ్రామ్స్:** బోటనీ, జువాలజీ ప్రయోగాలకు అవసరమైన డయాగ్రామ్స్‌ని కచ్చితంగా గీయడం నేర్చుకోవాలి. అంతే కాకుండా వాటి లేబులింగ్ స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి.
5. **సేఫ్టీ:** మీ కాలేజీలో లాబ్స్ చేస్తున్నప్పుడు, పరీక్షలో కూడా కెమికల్స్, ఎలక్ట్రిసిటీకి సంబంధించిన ఇన్‌స్ట్రుమెంట్స్‌ని జాగ్రత్తగా హ్యాండిల్ చేయాలి. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే అక్కడ ఉన్న ఇన్‌స్ట్రక్టర్‌కి తెలపాలి.
6. **మాల్‌ఫంక్షనింగ్:** పరీక్షలో ఏదైనా కారణంగాఒక ఇన్‌స్ట్రుమెంట్ సరిగ్గా పనిచేయకపోతే వెం టనే ఎగ్జామినర్‌కి తెలిపి దానిని రిపేర్ చేయించుకోవడమో లేదా ఇన్‌స్ట్రుమెంట్ మార్చుకోవడమో చేయాలి.
7. **నమూనా పరీక్షలు - ముఖ్యమైన ప్రశ్నలు:** గత సంవత్సరాల ప్రశ్నలతో ఒక ఇంపార్టెంట్ క్వశ్చన్ బుక్‌లెట్ తయారు చేసుకోవాలి. పరీక్షకు ముందు ఈ ప్రశ్నలను తప్పకుండా రివిజన్ చేసుకోవాలి.
8. **వైవా - వాయిస్:** పరీక్ష రోజు ఎగ్జామ్ హాల్‌లో మీ ప్రవర్తన సరిగ్గా ఉండాలి. పక్కన విద్యార్థిని కాపీ చేయడం లేదా మెజర్‌మెంట్స్‌ని కాపీ చేయకూడదు. వైవాలో అడిగే ప్రశ్నలకు సరిగ్గా సమాధానం ఇవ్వాలి. ప్రశ్నలు ఎలా వస్తున్నాయనే విషయంలో మీ ముందు సెషన్‌లో పరీక్షకు వెళ్లిన విద్యార్థుల నుంచి కొంత ఫీడ్‌బాక్ తీసుకోవచ్చు. ఎలాంటి తొందరపాటు లేకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షకు హాజరైతే పూర్తి మార్కులు సాధించవచ్చు.

గుడ్‌లక్

డాక్టర్ పవన్‌కుమార్ కాసు, డైరెక్టర్
సంజీవని జూనియర్ కాలేజీ, హైదరాబాద్





Kotak Suraksha

DescriptionKotak Securities Limite
(KSL) invites applications from st
dents pursuing general/professiona
graduation.
EligibilityOpen to PwD applicants across India who are currently pur ing general or professional gradua courses. Applicants must have secured at least 55% marks in their pre vious academic year and their annual family income must not exceed INR 3,20,000.
Prizes & Rewards: Scholarship up to INR 1,00,000 per year
Last Date to Apply28›01›2025
Application modeOnline only
Short
buddy4study.com





హెచ్‌పీసీఎల్‌లో డిప్లొమా అభ్యర్థులకు..

జాబ్ కార్నర్

మొత్తం ఖాళీలు
234



హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) జూనియర్ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా చేసిన ఆసక్తి గల అభ్యర్థులు 2025 ఫిబ్రవరి 14వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

1 **జూనియర్ ఎగ్జిక్యూటీవ్ (మెకానికల్):** 130 పోస్టులు
1 **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(ఎలక్ట్రికల్):** 65 పోస్టులు
1 **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(ఇన్‌స్ట్రుమెంటేషన్):** 37 పోస్టులు
1 **జూనియర్ ఎగ్జిక్యూటీవ్(కెమికల్):** 2 పోస్టులు

అర్హత: పోస్టుకు సంబంధించిన బ్రాంచ్‌లో కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా పూర్తి చేసి ఉండాలి.
వయసు: అభ్యర్థుల వయస్సు దరఖాస్తు దాఖలు చేసే తేదీ నాటికి 18-25 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష గ్రూప్ డిస్కషన్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తు విధానం: 2025 ఫిబ్రవరి 14 తేదీలోపు దరఖాస్తు దాఖలు చేయాలి.
పూర్తి వివరాల కోసం www.hindustanpetroleum.comలోCareers?Current Openings వెబ్‌పేజీ చూడవచ్చు.

ఇండియన్ ఆర్మీలో క్రీడా కోటా

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్(క్రీడా కోటా) ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. అవివాహితులైన పురుష, మహిళా అభ్యర్థులు ఈ డైరెక్ట్ ఎంట్రీ ఉద్యోగాలకు 2025 ఫిబ్రవరి 28లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.
క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్, అర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, జూడో, కయాకింగ్ అండ్ కెనోయింగ్, కబడ్డీ, స్విమ్మింగ్, సెయిలింగ్, షైటింగ్, ట్రయాథ్లాన్, వాలీబాల్, వుషు, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్, రోయింగ్.
అర్హత: పది/ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు, నిర్దుష్టమైన శారీరక ప్రమాణాలు ఉండాలి. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్/ ఖేలో ఇండియా గేమ్స్/ యూత్ గేమ్స్/ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొన్న క్రీడాకారులై ఉండాలి.
వయస్సు: పదిహేడున్నర సంవత్సరాల నుంచి 25 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 2000 మార్చి 31 నుంచి 2007 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అండ్ స్పోర్ట్స్ జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్‌క్యూ(ఆర్మీ), రూమ్ నెం.747, 'ఏ' వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ చిరునామాకు పంపించాలి.



పూర్తి వివరాలకు https://joinindianarmy.nic.in/Authentication.aspx వెబ్‌సైట్ చూడవచ్చు.

నీరజ్.. పెళ్లి సర్‌ప్రైజ్

టెన్నిస్ క్రీడాకారిణి హిమానీని వివాహమాడిన జావెలిన్ స్టార్



న్యూఢిల్లీ: జావెలిన్ సూపర్‌స్టార్, ఒలింపిక్, ప్రపంచ చాంపియన్ నీరజ్ చోప్రా ఓ ఇంటివాడయ్యాడు. హరియాణాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి హిమానీ మోర్‌ను పెళ్లి చేసుకున్నాడు. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా, కేవలం కుటుంబసభ్యుల సమక్షంలో రెండ్రోజుల క్రితమే జరిగిన ఈ వివాహానికి సంబంధించిన ఫొటోలను నీరజ్ ఆదివారం సోషల్ మీడియాలో పంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచాడు. 'నా జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించా. ఈ సందర్భంగా ఆశీస్సులు అందించిన అందరికీ కృతజ్ఞతలు' అని 27 ఏళ్ల చోప్రా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. రెండ్రోజుల క్రితమే జరిగిన ఈ వేడుకకు వేదిక ఎక్కడన్న విషయాన్ని వెల్లడించలేను. నూతన దంపతులు ఇప్పటికే హనీమూన్‌కు కూడా వెళ్లారు. ఇంతకుమించి ఏమీ చెప్పలేను' అని నీరజ్ మామ భీమ్ తెలిపారు.



ఎవరీ హిమానీ?

హరియాణాలోని సోనీపట్‌కు చెందిన 25 ఏళ్ల హిమానీ మోర్.. 2021 వరకు టెన్నిస్ క్రీడలో కొనసాగింది. ఢిల్లీలోని ప్రఖ్యాత మిరండా హౌజ్ కళాశాల నుంచి రాజనీతిశాస్త్రం, వ్యాయామ విద్యలో డిగ్రీ చేసిన హిమాని.. ప్రస్తుతం అమెరికాలోని ఓ యూనివర్సిటీలో స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ చదువుతోంది. హిమాని టెన్నిస్‌లో అంతర్జాతీయస్థాయిలో ఆడకపోయినా.. జాతీయస్థాయిలో మాత్రం రాణించింది. 2018లో జాతీయస్థాయిలో అత్యుత్తమంగా సింగిల్స్‌లో 42వ, డబుల్స్‌లో 27వ ర్యాంకును అందుకుంది.



జొకో X అల్కారజ్ క్వార్టర్స్‌లో ఢీ

జ్వెరేవ్, సబలెంక, గాఫ్ ముందంజ

ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్: దిగ్గజం నొవాక్ జొకోవిచ్, యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ మ్యాచ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్లోనే చోటుచేసుకోనుంది. ఆదివారం జరిగిన నాలుగో రౌండ్‌లో జొకోవిచ్ 6-3, 6-4, 7-6 (4)తో లెహెచ్కా (చెక్ రిపబ్లిక్)ను చిత్తు చేశాడు. మరో ప్రీక్వార్టర్స్ మ్యాచ్‌లో అల్కారజ్ 7-5, 6-1తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి జాక్ డ్రేపర్ (బ్రిటన్) గాయంతో వైదొలిగాడు. దాంతో అల్కారజ్ క్వార్టర్స్‌కు చేరాడు. పురుషుల ఇతర రౌండ్-16 మ్యాచ్‌ల్లో రెండో సీడ్ జ్వెరేవ్ 6-1, 2-6, 6-3, 6-2తో 14వ సీడ్ హంబర్ట్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 6-1, 6-1, 6-1తో డవిడోవిచ్‌పై విజయం సాధించారు

గాఫ్ సెట్ ఓడినా..: మూడో సీడ్ గాఫ్ (అమెరికా) వరుస సెట్ల విజయ పరంపరకు బ్రేక్ పడింది. రెండో గ్రాండ్‌స్లామ్ అందుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన గాఫ్ నాలుగో రౌండ్‌లో 5-7, 6-2, 6-1తో బెలిండా బెన్సిక్‌పై నెగ్గింది. గాఫ్ ఈ సీజన్‌లో ఆడిన గత 13 మ్యాచ్‌ల్లో ఒక్క సెట్ కూడా ఓడిపోకపోవడం విశేషం. మరో ప్రీక్వార్టర్స్‌లో బడోసా 6-1, 7-6 (2)తో ఓల్గా డానిలోవిక్‌పై సునాయాసంగా నెగ్గింది. సబలెంక 6-1, 6-2తో ఆండ్రీవాను ఓడించింది.

మిక్స్‌డ్‌లో బోపన్న ముందుకు

భారత ఆటగాడు రోహన్ బోపన్న మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టాడు. రెండో రౌండ్‌లో.. అమెరికా, మొనాకో ద్వయం టేలర్/హ్యూగోతో బోపన్న/జాంగ్ షువాయ్ (చైనా) జంట తలపడాల్సి ఉంది. కానీ ప్రత్యర్థి వాకోవర్ ఇవ్వడంతో బోపన్న జోడీ ముందంజ వేసింది.

పాక్‌దే తొలి టెస్టు

ముల్తాన్: స్పిన్నర్లు సాజిద్ ఖాన్ (5/50), అబ్రార్ అహ్మద్ (4/27) చెలరేగడంతో వెస్టిండీస్‌తో తొలి టెస్టులో పాకిస్థాన్ 127 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆట మూడో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 109/3తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన పాకిస్థాన్ 157కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 93 ఆధిక్యంతో కలిపి 250 పరుగుల టార్గెట్‌ను విండీస్‌కు పాక్ నిర్దేశించింది. ఛేదనలో విండీస్ 123 రన్స్‌కే ఆలౌటైంది. అంతకుముందు తొలిఇన్నింగ్స్‌లో పాక్ 230, విండీస్ 137 రన్స్ చేశాయి.

44కే కూల్చేశారు

యువ భారత్ సూపర్ బోణీ

విండీస్‌పై 9 వికెట్లతో గెలుపు

అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్



వెస్టిండీస్: 13.2 ఓవర్లలో 44 ఆలౌట్ (కాసర్ 15, అసబి 12; పరునిక 3/7, జోషిత 2/5, ఆయుషి 2/6); **భారత్:** 4.2 ఓవర్లలో 47/1 (సనిక 18 నాటౌట్, కమలిని 16 నాటౌట్).

కౌలాలంపూర్: డిఫెండింగ్ చాంపియన్ భారత్ అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్‌ను అద్భుతంగా ఆరంభించింది. గ్రూప్-ఎలో భాగంగా జరిగిన తమ తొలి మ్యాచ్‌లో బోణీ కొడుతూ 9 వికెట్లతో వెస్టిండీస్‌ను చిత్తుగా ఓడించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన విండీస్ మహిళలు.. భారత లెఫ్టార్మ్ స్పిన్నర్లు పరునిక సిసోడియా (3/7), జోషిత (2/5), ఆయుషి శుక్లా (2/6) ధాటికి 13.2 ఓవర్లలో 44 పరుగులకే కుప్పకూలారు. స్వల్ప లక్ష్యాన్ని భారత మహిళలు 4.2 ఓవర్లలోనే 47/1 స్కోరు చేసి అలవోకగా ఛేదించారు. తెలుగమ్మాయి, ఓపెనర్ గొంగడి త్రిష (4) నిరాశ పరిచినా.. మరో ఓపెనర్ కమలిని (16 నాటౌట్), సనిక చల్కే (18 నాటౌట్) భారత్‌ను విజయతీరాలకు చేర్చారు. భారత్ రెండో మ్యాచ్‌ను మలేసియాతో మంగళవారం ఆడనుంది.

మలేసియా 23 పరుగులకే..: గ్రూప్-ఎలోనే జరిగిన మరో మ్యాచ్‌లో శ్రీలంక మహిళలు 139 పరుగుల తేడాతో ఆతిథ్య మలేసియాను చిత్తుచేశారు. తొలుత లంక 6 వికెట్లకు 162 పరుగులు చేసింది. ఛేదనలో లంక భీకరమైన బౌలింగ్ ధాటికి మలేసియా 14.1 ఓవర్లలో 33 పరుగులకే ఆలౌటైంది.

షకీబ్‌పై అరెస్టు వారెంట్

ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షకీబల్ హసన్ అటు ఆటపరంగానే గాకుండా ఇటు వ్యక్తిగతంగానూ చిక్కుల్లో ఇరుక్కున్నాడు. అనుమానాస్పద బౌలింగ్ యాక్షన్ కారణంగా ఇప్పటికే ఐసీసీ నుంచి నిషేధం ఎదుర్కొంటున్న ఈ ఆల్‌రౌండర్‌పై రెండు చెక్ బౌన్సుల కేసుకు సంబంధించి బంగ్లాదేశ్ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. షకీబల్ చైర్మన్‌గా ఉన్న అల్ హసన్ ఆగ్రో ఫామ్ అనే సంస్థ ఐఎఫ్ఐసీ బ్యాంక్‌కు చెల్లించాల్సిన రూ. 3 కోట్ల చెక్‌లు బౌన్స్ అయ్యాయి. బ్యాంకు ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో కోర్టుకు హాజరవ్వాలన్న ఆదేశాలను షకీబల్‌తో పాటు సంస్థకు చెందిన ముగ్గురు ధిక్కరించారు. దీంతో ముగ్గురిపై అరెస్టు వారెంట్ జారీ అయింది.

సురేఖకు రజతం

పారిస్: విజయవాడ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ రజతంతో మెరిసింది. ఫ్రాన్స్‌లో జరిగిన ఇండోర్ ఆర్చరీ వరల్డ్ సిరీస్ ఫైనల్లో సురేఖ 146-147తో అలెజాండ్రా ఉస్కియానో (కొలంబియా) చేతిలో ఓడి ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది.

అర్జున్ గేమ్ డ్రా

విక్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్‌లో తెలుగు కుర్రాడు అర్జున్ ఇరిగేసి రెండో రౌండ్‌ను డ్రాగా ముగించాడు. ఆదివారం అనీష్ గిరితో గేమ్‌లో అర్జున్ పాయింట్ పంచుకున్నాడు. కాగా, తొలి రౌండ్లో అర్జున్‌పై హరికృష్ణ గెలిచాడు. ఇక, ఆరంభ రౌండ్లో నెగ్గిన ప్రపంచ చాంపియన్ గుకేష్.. వ్లాదిమిర్ ఫెడొసీవ్‌తో జరిగిన రెండో రౌండ్‌ను డ్రా చేసుకున్నాడు.



ఖోఖోలో మనోళ్లు కేక

భారత్ డబుల్ ధమాకా

పురుషులు, మహిళల టైటిళ్లు కైవసం

న్యూఢిల్లీ: అంచనాలను నిలబెట్టారు..అద్భుత ఆటతో అదరగొట్టారు..ఫలితంగా భారత పురుషులు, మహిళలు మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్‌లో విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన మహిళల ఫైనల్లో భారత్ 78-40 పాయింట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసి విజేతగా ఆవిర్భవించింది. ఇక..పురుషుల జట్టు 54-36 పాయింట్ల తేడాతో నేపాల్‌ను ఓడించి చాంపియన్‌షిప్ దక్కించుకుంది. తొలుత జరిగిన అమ్మాయిల ఫైనల్లో మనోళ్లు అన్ని రంగాలలో తిరుగులేని ప్రదర్శన కనబరచారు. అనూహ్యమైన వేగంతో ప్రత్యర్థిని ఉక్కిరి బిక్కిరి చేశారు. భారత్ ధాటికి నేపాల్ చేష్టలుడిగింది. మొదటి టర్న్ ఆరంభంనుంచే భారత అటాకర్లు విజృంభించారు. తొలి టర్న్‌లోనే 34 పాయింట్లతో భారత్ తిరుగులేని స్థితిలో నిలిచింది. రెండో టర్న్‌లో నేపాల్ 35-24కి ఆధిక్యాన్ని తగ్గించింది. కానీ మూడో టర్న్‌లో దుమ్ము రేపిన భారత మహిళలు ఇంకో 38 పాయింట్లను ఖాతాలో వేసుకున్నారు. నాలుగో టర్న్ ఆరంభానికి 49 పాయింట్ల ఆధిక్యంలో నిలిచిన భారత్‌ను అడ్డుకోవడం నేపాల్ వల్ల కాకపోయింది. ఈ టర్న్‌లో ఆ జట్టు కేవలం 16 పాయింట్లే చేయగలిగింది.

ప్రపంచకప్ ఫైనల్స్‌లో నేపాల్ చిత్తు



పురుషుల జట్టు జోరు

నేపాల్‌తో తుది పోరులో పురుషుల జట్టు కూడా అన్ని రంగాలలో కదం తొక్కింది. దక్షిణాఫ్రికాతో సెమీఫైనల్లో తేలిపోయిన డిఫెన్స్ విభాగం..నేపాల్‌పై చెలరేగింది. తొలి టర్న్..అటాకింగ్‌లో 26 పాయింట్లను భారత్ సాధించింది. రెండో టర్న్‌లో నేపాల్ 18 పాయింట్లు రాబట్టింది. దాంతో రెండు టర్న్‌లు ముగిసే సరికి భారత్ 26-18తో ముందంజలో నిలిచింది. మూడో టర్న్..అటాకింగ్‌లో భారత పురుషులు మరింత దూకుడుతో ఇంకో 28 పాయింట్లు సొంతం చేసుకున్నారు. ఇక..చివరి టర్న్‌లో నేపాల్ 18 పాయింట్లే చేయడంతో భారత్ విజయం ఖాయమైంది.

అమ్మాయిల విజయంలో తెలుగోడు



ఖోఖో వరల్డ్‌కప్‌ను సొంతం చేసుకున్న భారత మహిళల జట్టు విజయంలో ఒక తెలుగోడి పాత్ర ఉండడం విశేషం. అతడి పేరు ఇస్లావత్ నరేష్. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా, ధర్మారం మండలం, బంజరపల్లి తండా నరేష్ స్వస్థలం. నరేష్ ప్రస్తుత భారత జట్టుకు సహాయ కోచ్. 1995లో ఆటగాడిగా కెరీర్ ప్రారంభించిన నరేష్ 2015లో ఎన్ఐఎస్ శిక్షణ పూర్తి చేసి కోచ్‌గా మారాడు. దక్షిణమధ్య రైల్వేలో 2016లో స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సంపాదించి తొలుత ఆ జట్టుకు సహాయ కోచ్‌గా ఆతర్వాత భారత రైల్వే జట్టు చీఫ్ కోచ్‌గా అంచెలంచెలుగా ఎదిగాడు. తాజాగా ఖోఖో వరల్డ్‌కప్ నెగ్గిన భారత మహిళల జట్టుకు సహాయ కోచ్‌గా, స్కిల్ అనలైజర్‌గా క్రీడాకారుల ప్రదర్శనను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, వారి తప్పులను, బలహీనతలను సరిచేస్తూ దేశానికి తొలి విశ్వకప్‌ను అందించడంలో నరేష్ కీలకపాత్ర పోషించాడు. జట్టు ఫుట్‌వర్క్, డైవింగ్ పద్ధతులు మెరుగుపరచుకోవడంలోనూ నరేష్‌ది ప్రధాన భూమిక.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి-హైదరాబాద్)

బిజినెస్

హిండెన్‌బర్గ్ వ్యవస్థాపకుడు నేట్ ఆండర్సన్‌కు కష్టాలు

కెనడాలో కేసు నమోదు



టొరంటో: భారత బిలియనీర్ గౌతమ్ అదానీకి చుక్కలు చూపించిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వ్యవస్థాపకుడు నేట్ ఆండర్సన్‌కు కష్టాలు ప్రారంభమయ్యాయి. కెనడాకు చెందిన అన్సన్ అనే హెడ్జ్ ఫండ్ అధినేత మోయిజ్ కస్సమ్ తాను ఒక నివేదికను తయారు చేసేటప్పుడు ఆండర్సన్‌తో సహా పలువురు అందులో పాల్గొన్నారని ది మార్కెట్స్ ఫ్రాడ్ అనే వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే ఆండర్సన్ ఈ విషయాన్ని అమెరికా స్టాక్ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజీ కమిషన్(ఎస్ఈసీ)కి తెలియజేయలేదు. దీంతో ఆండర్సన్‌పై కెనడాలోని ఒంటారియో సుపీరియర్ కోర్ట్ ఆఫ్ జస్టిస్‌లో కేసు నమోదైంది. అమెరికా ఎస్ఈసీ కూడా దీనిపై దర్యాప్తు జరిపే అవకాశం ఉందని భావిస్తున్నారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థను మూసివేస్తున్నట్టు ఆండర్సన్ గత వారం ప్రకటించారు. ఆ వెంటనే ఆయనపై ఈ కేసు నమోదవడం విశేషం.

భారత్‌లోనూ కార్ల తయారీ

న్యూఢిల్లీ: చైనా విద్యుత్ వాహనాల (ఈవీ) సంస్థ బీవైడీ భారత్‌లోనూ తయారీ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపిస్తోంది. బీవైడీ ఇండియా ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వెహికల్స్ (ఈపీవీ) విభాగం బిజినెస్ హెడ్ రాజీవ్ చౌహాన్ ఈ విషయం వెల్లడించారు. ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోకు హాజరైన ఆయన పీటీఐ వార్తా సంస్థతో ఈ విషయం చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్)తో కలిసి 100 కోట్ల డాలర్ల పెట్టుబడితో భారత్‌లో ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసేందుకు బీవైడీ గతంలో ముందుకొచ్చింది. అయితే, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అందుకు అనుమతించలేదు. దాంతో ఆ ప్రతిపాదన అమలుకు నోచుకోలేదు. రెండు దేశాల సంబంధాలు ఇప్పుడు కొద్దిగా గాడినపడ్డాయి. ఈ నేపథ్యంలో బీవైడీ ఈ ఆలోచన చేయడం విశేషం. సరిహద్దు ఘర్షణలతో భారత-చైనా సంబంధాలు వేడెక్కినా ఆ ప్రభావం తమ కంపెనీపై ఏ మాత్రం లేదని చౌహాన్ తెలిపారు. చైనా పౌరులకు వీసాల మంజూరు చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం కఠినం చేసిన ప్రభావం కూడా తమపై లేదన్నారు. వివేకవంతులైన భారతీయులు తమ వాహనాలు కొంటూనే ఉన్నారన్నారు. గత ఏడాది బీవైడీ ఇండియా భారత్‌లో 3,500 వాహనాలు విక్రయించింది. కాగా ఈ ఏడాది అమ్మకాలు మరింత పెరుగుతాయని భావిస్తున్నట్టు చౌహాన్ చెప్పారు.

వీసాల సమస్య లేదు: బీవైడీ



బీవైడీ ఇండియా బిజినెస్ హెడ్ రాజీవ్ చౌహాన్

అన్ని రంగాల్లోనూ అగ్రగామి కావడమే లక్ష్యం

ఐటీసీ కొత్త వ్యాపార వ్యూహం

న్యూఢిల్లీ: సిగరెట్ల నుంచి వినియోగ వస్తువుల వరకు విభిన్న వ్యాపార రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీసీ తమ వ్యాపారాలన్నింటిలోనూ అగ్రగామి కావాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందుకోసం "భవిష్యత్ వ్యూహం" రూపొందించుకుంది. నానాటికీ మారుతున్న భవిష్యత్తుకు దీటుగా నిలవగల సంస్థగా ఐటీసీని తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ పురి చెప్పారు. డిజిటైజేషన్, స్థిరత్వ, ఇన్నోవేషన్, సరఫరా వ్యవస్థ సామర్థ్యం పోటీ సామర్థ్యం పెంచుకునేందుకు దీటైన సాధనాలని గుర్తించామన్నారు. రూ.70,000 కోట్ల ఐటీసీ గ్రూప్ వ్యాపారాల్లో ఎఫ్ఎంసీజీ విభాగం 70 శాతం వాటా కలిగి ఉంది. తదుపరి వ్యూహంలో భాగంగా ఈ విభాగంపై మధ్యకాలిక దృక్పథంలో రూ.20,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ఐటీసీ గత ఏడాది ప్రకటించింది. అలాగే ఐటీసీ పేపర్ బోర్డు కూడా ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాల్లోకి ప్రవేశించాలని నిర్ణయించింది. మొక్కల ద్వారా లభించే మౌల్డెడ్ ఫైబర్‌ను ఉపయోగించి స్థిరమైన ప్యాకేజింగ్ సొల్యూషన్లు అందించే ప్రయత్నంలో భాగంగా ఇటీవలే మధ్యప్రదేశ్‌లోని సెహోర్‌లో అత్యాధునిక మౌల్డెడ్ ఫైబర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది.

23,500 పైన బుల్లిష్

(జనవరి 20-24 తేదీల మధ్య వారా



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 23,392-23,047 పాయింట్ల మధ్యన కదలాడి 228 పాయింట్ల నష్టంతో 23,203 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,500 కన్నా పైన ముగిస్తే స్వల్ప కాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,246, 23,317, 23,550, 23,868 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,500
బ్రేక్‌డౌన్ స్థాయి: 22,900
నిరోధ స్థాయిలు: 23,400, 23,500, 23,600 (23,300 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు:23,000, 22,900, 22,800

ఆగని ఎఫ్‌పీఐల అమ్మకాల హోరు

ఈ నెలలో ఇప్పటికే రూ.44,396 కోట్లు వెనక్కి

న్యూఢిల్లీ: భారత స్టాక్ మార్కెట్లో విదేశీ పోర్టుఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ) అమ్మకాల హోరు కొనసాగుతోంది. ఈ నెల 17వ తేదీ నాటికి మన మార్కెట్ నుంచి ఈ సంస్థలు రూ.44,396 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఈ నెల 2న తప్ప మిగతా అన్ని రోజుల్లో ఎఫ్‌పీఐలు అమ్మకాలకు దిగడం గమనార్హం. ఇవే సంస్థలు గత ఏడాది డిసెంబరులో మన మార్కెట్లో రూ.15,446 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి. 2023లో రికార్డు స్థాయిలో రూ.1.71 లక్షల కోట్లు మదుపు చేసిన ఎఫ్‌పీఐలు గత ఏడాది కేవలం రూ.427 కోట్లు మాత్రమే మన స్టాక్ మార్కెట్లో మదుపు చేశాయి.

- హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ ప్యూర్ ఈవీ.. తెలంగాణలో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. విస్తరణలో భాగంగా ఖమ్మం జిల్లా మధిరలో కొత్త షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ షోరూమ్‌లో కంపెనీకి చెందిన ఈప్లూటో 7జీ మ్యాక్స్, ఈప్లూటో 7జీ, ఎకోడ్రిఫ్ట్ 350 సహా మరికొన్ని వాహనాలు అదుబాటులో ఉంటాయి.
- కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తరపున ప్రత్యక్ష పన్నులను వసూలు చేసేందుకు గాను ఆదాయ పన్ను శాఖ పోర్టల్‌తో అనుసంధానమైనట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రకటించింది. దీంతో బ్యాంక్ ఖాతాదారులు తమ రిటైల్, కార్పొరేట్ ఇంటర్నెట్ బ్యాకింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో పాటు నేరుగా బ్యాంక్ శాఖల ద్వారా పన్నులు చెల్లించే అవకాశం లభించనుంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	122	విజయవాడ	136
వరంగల్	122	గుంటూరు	135
కరీంనగర్	122	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	122	చిత్తూరు	104
కర్నూలు	122	నెల్లూరు	109
విశాఖపట్నం	132	అనంతపురం	109
గోదావరి	136		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	480	విజయవాడ	510
వరంగల్	482	గోదావరి	505
చిత్తూరు	503	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	

అంతర్జాతీయ సంకేతాలే కీలకం..!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేస్తుండటం, డాలర్ ఇండెక్స్, యూఎస్ బాండ్ లాభాలు పెరుగుతుండటం ప్రతికూల అంశాలు. మరికొన్ని రోజులు బెంచ్‌మార్క్ సూచీలు ఒడుదొడుకులకు గురి కావచ్చు. ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ రంగాల షేర్లు కాస్త జోరు ప్రదర్శిస్తున్నాయి. గత వారం మీడియా, రియల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ హెల్త్‌కేర్, ఫార్మా షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. మెటల్, సీపీఎస్ఈ, పీఎస్‌యూ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లకు డిమాండ్ పెరిగింది. కేంద్ర బడ్జెట్ సమీపిస్తుండటంతో మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

ఇండస్ టవర్: గత ఏడాది సెప్టెంబరులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ షేర్లలో 31 శాతం మేర కరెక్షన్ జరిగింది. కీలక మద్దతు స్థాయి రూ.320 వద్ద తాజాగా ట్రెండ్ రివర్సల్ మొదలైంది. చివరి ఐదు సెషన్లలో నాలుగు సార్లు లాభపడటం, నిఫ్టీతో పోల్చితే 13 శాతం పెరగటం శుభసూచకం. డిసెంబరు త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు విడుదల చేయవచ్చన్న అంచనాలు ఉన్నాయి. గత శుక్రవారం ఈ షేరు 2.30 శాతం లాభంతో రూ.362 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.350 వద్ద పొజిషన్ తీసుకుని రూ.385/390 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.340 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మారికో: ప్రస్తుతం ఎఫ్ఎంసీజీ రంగం కాస్త బలం ప్రదర్శిస్తోంది. జీవితకాల గరిష్ఠం నుంచి 20 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ షేరు ప్రస్తుతం కీలక స్థాయిల్లో కదలాడుతోంది. అక్యుములేషన్ జరుగుతోంది. 200 రోజులు, 21 రోజుల సగటు విలువపైన చలిస్తుండటం సానుకూల అంశం. గత శుక్రవారం 1.81 శాతం లాభంతో రూ.664 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.640 వద్ద పొజిషన్ తీసుకుని రూ.720/730 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.625 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆర్‌వీఎన్ఎల్: గత ఏడాది జూలైలో రూ.647 వద్ద జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ కౌంటర్‌లో 44 శాతం మేర కరెక్షన్ జరిగింది. బడ్జెట్‌లో రైల్వేలకు 20 శాతం మేర కేటాయింపులు పెంచుతారన్న అంచనాలు, ఆకర్షణీయమైన ధరలకు లభిస్తుండటంతో రైల్వే షేర్లపై మదుపరులకు ఆసక్తి పెరుగుతోంది. గత శుక్రవారం 3.71 శాతం లాభంతో రూ.426 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.400/410 శ్రేణిలో ఎంటరై రూ.455 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.390 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కోల్ ఇండియా: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర పతనమైన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం మూమెంటమ్ కనిపిస్తోంది. ఇప్పటికే షేరు బాగా పతనమవటంతో ట్రెండ్ రివర్సల్ జరిగే అవకాశం ఉంది. చివరి నాలుగు సెషన్లలోనే ఈ షేరు 8 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.387 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.380 వద్ద పొజిషన్ తీసుకుని రూ.430/450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.365 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా కన్స్యూమర్: ఈ షేరు రూ.1,250 స్థాయి వద్ద జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 30 శాతం మేర కరెక్షన్‌కు గురైంది. ఆ తర్వాత రూ.880 వద్ద కీలక మద్దతు లభించింది. అప్పటి నుంచి కాస్త పటిష్ఠతను సూచిస్తోంది. గత శుక్రవారం రూ.954 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.940 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.925 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కీలక మద్దతు 23,000 చేరువలో..

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో ప్రధాన మద్దతు స్థాయి 23,000 వద్ద మద్దతు తీసుకుని తక్షణ డౌన్‌ట్రెండ్‌ను నివారించుకుంది. కాని శుక్రవారం మరోసారి కరెక్షన్‌లో పడడం అప్రమత్త సంకేతం. గత వారం నిఫ్టీ సైడ్‌వేస్‌లో పరిమిత పరిధిలో కదలాడి 230 పాయింట్ల నష్టంతో క్లోజయింది. టెక్నికల్‌గా మార్కెట్ వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమన అనిశ్చితంగా ముగిసింది. గత రెండు వారాల్లో వెయ్యి పాయింట్ల మేరకు నష్టపోయింది. మిడ్‌క్యాప్-100 సూచీ 2,300 పాయింట్లు నష్టపోయినా బలమైన పునరుజ్జీవం సాధించి 22 పాయింట్ల స్వల్ప లాభంతో క్లోజైంది. స్మాల్‌క్యాప్-100 సూచీ కూడా 720 పాయింట్ల మేరకు నష్టపోయినా కోలుకుని ముందు వారంతో పోల్చితే 26 పాయింట్ల స్వల్ప లాభంతో ముగిసింది. ప్రస్తుతం నిఫ్టీ మానసిక అవధి 23,000 సమీపంలో ఉంది. ఇక్కడ మరింత అప్రమత్త ట్రెండ్‌కు ఆస్కారం ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి.

బుల్లిష్ స్థాయిలు: గత రెండు వారాల్లో నిట్టనిలువుగా దిగజారినందు వల్ల సానుకూలత కోసం కన్సాలిడేట్ కావడం అవసరం. ప్రస్తుత స్థాయిలో పాజిటివ్ ట్రెండ్ ప్రదర్శించినా మైనర్ నిరోధం 23,300 కన్నా పైన నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధం 23,500. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక సానుకూలత ప్రదర్శిస్తుంది.

బేరిష్ స్థాయిలు: ఒక వేళ బలహీనత ప్రదర్శించినా ప్రధాన మద్దతు స్థాయి 23,000 వద్ద పునరుజ్జీవం తప్పనిసరి. మరింత బలహీనపడితే స్వల్పకాలిక బలహీనత ఎదుర్కొనక తప్పదు. అప్రమత్తత అవశ్యం.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 195 పాయింట్ల నష్టంతో 48,500 వద్ద ముగిసింది. రికవరీ బాట పడితే ప్రధాన నిరోధం 49,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మానసిక అవధి 48,000.

పాటర్న్: నిఫ్టీ ప్రస్తుతం 200 డీఎంఏ కన్నా దిగువకు వచ్చింది. సానుకూలత కోసం ఇక్కడ బౌన్స్‌బ్యాక్ కావాలి. అలాగే మార్కెట్ ప్రస్తుతం 23,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్", గతంలో ఏర్పడిన బాటమ్‌కు చేరువవుతోంది. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత దిగజారవచ్చు.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,300, 23,370
మద్దతు	23,080, 23,000


ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న నల్లు ఇంద్రసేనారెడ్డి తదితరులు

ఘనంగా తెలుగు సంగమం
సంక్రాంతి సమ్మేళనం

» పాల్గొన్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నార్సింగ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతి, గొప్ప వారసత్వాన్ని ప్రతిబింబించేలా సంక్రాంతి వేడుకలను ప్రతీ ఏటా నిర్వహించడం హర్షనీయమని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. తెలుగు సంగమం సంక్రాంతి సమ్మేళనం-2025 కార్యక్రమాన్ని హైదరాబాద్ నార్సింగ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ... తెలుగు సంగమం వ్యవస్థాపకులు, ప్రధాన పోషకులు, బీజేపీ నాయకుడు పి.మురళీధర్ ఆధ్వర్యంలో సంక్రాంతి సమ్మేళనం కార్యక్రమం చేపట్టడం ఎంతో సంతోషమన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక పాఠశాలలు, రోడ్లను మెరుగుపరచడం వంటి కార్యక్రమాల ద్వారా స్వస్థలాన్ని అభివృద్ధి చేస్తున్న వారికి అభినందనలు తెలిపారు. మురళీధర్ మాట్లాడుతూ..తెలుగు మాట్లాడే సమాజం భవిష్యత్తు తరాలకు తమ భాషను నిలబెట్టడానికి, ప్రోత్సహించడానికి సమష్టి బాధ్యతను నొక్కి చెప్పాలన్నారు. ఎమ్మెల్యే బుద్ద ప్రసాద్ మాట్లాడుతూ.. తమిళనాడులో తమిళ భాషకు అమిత ప్రాధాన్యత ఇస్తారని, తెలుగు ప్రజల్లోనూ తెలుగు భాష పట్ల ఇలాంటి మక్కువ పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ, జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు వీవీ లక్ష్మీనారాయణ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్‌కు సాగునీటి గురించి తెలియదు: వినోద్

హైదరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పదవి చేపట్టి ఏడాదైనా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సాగునీటి విషయాలు తెలియవని మాజీఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కృష్ణా జలాలను కేసీఆర్ ఏపీకి తరలించారని మంత్రి ఆరోపించడం ఆయన అవగాహనా లేమికి నిదర్శనమని వినోద్ విమర్శించారు. ఆదివారం తెలంగాణభవన్‌లో వినోద్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో కేసీఆర్ రాష్ట్రానికి అన్యాయం చేశారని మంత్రి ఉత్తమ్ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తన శాఖ పరిధిలోని విషయాలపై మంత్రి ఉత్తమ్ అవగాహన పెంచుకొని మాట్లాడాలని సూచించారు. విదేశీ పర్యటనలతో భారీగా పెట్టుబడులు రాబోతున్నాయని రేవంత్‌రెడ్డి బృందం చేసుకుంటున్న ప్రచారం బూటకమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. ఆదివారం తెలంగాణభవన్‌లో వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న విధానాలు పెట్టుబడిదారులను భయపెట్టేలా ఉన్నాయని అన్నారు.

కమీషన్ ఇస్తేనే ఆర్థిక శాఖలో బిల్లు పాస్: ఈటల

రాష్ట్ర ఆర్థిక శాఖలో 7-10శాతం కమీషన్ ఇస్తే తప్ప బిల్లు పాస్ కాని దుస్థితి నెలకొందని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ఇది అత్యంత అసమర్థ, అవినీతి ప్రభుత్వమని మండిపడ్డారు. ఆదివారం కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్, నాటి ఆర్థిక మంత్రిగా పని చేసిన ఈటలకు నోటీసులు జారీ చేసిందంటూ జరిగిన ప్రచారంపై ఆయన స్పందించారు. మిడిమిడి జ్ఞానం ఉన్నవారే తనపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని బాలాజీనగర్ పేదల ఇళ్లు, జవహర్‌నగర్‌లోని చిరు వ్యాపారుల ఇళ్ల జోలికొస్తే ఊరుకోబోమని ఈటల హెచ్చరించారు.

ప్రముఖ కవి సాంధ్యశ్రీ ఇక లేరు

» ఈ నెల 17న హఠాన్మరణం, ముగిసిన అంత్యక్రియలు

» ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన మరణ వార్త


సాంధ్య శ్రీ

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సాంధ్యశ్రీగా తెలుగు కవితాలోకానికి సుపరిచితులైన ప్రముఖ కవి పుచ్చా లక్ష్మీనరసింహ శాస్త్రి (73) ఇక లేరు. కొంతకాలంగా హృద్రోగ, మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న ఆయన ఈ నెల 17న అల్వాల్‌లోని తన స్వగృహంలో హఠాన్మరణం చెందారు. సాంధ్యశ్రీ మరణవార్త సాహితీలోకానికి ఆలస్యంగా తెలిసింది. సాంధ్యశ్రీ అంత్యక్రియలు జనవరి 18న అల్వాల్‌లోని శ్మశాన వాటికలో పూర్తయ్యాయని వారి కుమార్తె చెప్పారు. సాంధ్యశ్రీ స్వస్థలం ఏపీలోని తెనాలి దగ్గర దంతలూరు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో దగ్గరి బంధుత్వం ఉండడంతో, ఆయన సాన్నిహిత్యంలో బాల్యాన్ని గడిపారు. గేయ, వచన కవిత్వంతో పాటు నాటకం, విమర్శ తదితర ప్రక్రియల్లోనూ సాంధ్యశ్రీ సాహిత్య సృజన చేశారు. ఆయన రాసిన అవి తుంగభద్ర, అంతర గాంధారం, నగ్న చిత్రాలు, పుప్పొడి చినుకులు, చెట్టు ఒక పద్యం, కడలి గడప మీద గొంతు జెండా, గుమ్మం తొక్కిన జ్ఞాపకాలు తదితర కవితా సంపుటాలు, తల్లీ!భూదేవి నాటకం ప్రచురితమయ్యాయి. సాంధ్యశ్రీ రచనలు మరికొన్ని ముద్రితం కావాల్సి ఉందని ఆయన స్నేహితుడు ఎ.రజా హుస్సేన్ తెలిపారు. సాంధ్యశ్రీని కవితా శిల్పిగా, అక్షర యోగిగా గుంటూరు శేషేంద్ర శర్మ, వేటూరి సుందర రామమూర్తి, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం వంటి సాహిత్య దిగ్గజాలు అభివర్ణించిన విషయాన్ని రజా హుస్సేన్ గుర్తు చేసుకున్నారు. కవిత్వం కవిత్వం కోసమే అనే విశ్వాసాన్ని రచనల ద్వారా ప్రకటించిన కవి సాంధ్యశ్రీ అంటూ.. సాంధ్యశ్రీ మరణానికి ప్రముఖ కవి శిఖామణి సంతాపం వ్యక్తం చేశారు.


బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ సభలో బీసీ సంఘాల నాయకులు

బీసీ కుల గణన ప్రత్యేకంగా చేపట్టాలి

» జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి

» బీసీ సంక్షేమ సంఘం నేతలు శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌రావు

జమ్మలమడుగు, జనవరి19(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జరిగే కుల గణనలో బీసీ కుల గణనను ప్రత్యేకంగా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం కడప జిల్లా జమ్మలమడుగులో నియోజకవర్గస్థాయిలో బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ సమావేశం జరిగింది. సమావేశానికి 22 సంఘాలకు చెందిన బీసీ నాయకులు హాజరయ్యారు. బీసీ కులాల లెక్కలు కేంద్రం చేపట్టేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బాధ్యతలు తీసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా జరిగే జాతి జన గణనలో బీసీ కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని, కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఆ హామీని నిలబెట్టుకోవాలంటే జాతీయస్థాయిలో బీసీ కుల గణన జరిగితేనే ఇది సాధ్యమవుతుందని నేతలు తెలిపారు. నామినేటెడ్ పోస్టులలో, పాలన పదవుల్లో బీసీలకు 50 శాతం వాటా కల్పించాలని, బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, తదితరులు హాజరయ్యారు.

ఊళ్ల నుంచి హైదరాబాద్ బాట

» 65వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

» ఆదివారం 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపు

చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, కోదాడరూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఏపీ వైపు వెళ్లిన వారు తిరిగి హైదరాబాద్ బాట పట్టారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ పెరిగింది. నల్లగొండ జిల్లా కొర్లపహాడ్, యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా మీదుగా ఆదివారం 45 వేల వాహనాలు హైదరాబాద్ వైపు వెళ్లాయి. పంతంగి టోల్‌గేట్ వద్ద 16 గేట్లకు గాను 12గేట్ల నుంచి హైదరాబాద్ వైపు, నాలుగు గేట్ల నుంచి విజయవాడ వైపు వాహనాలను అనుమతించారు. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్‌లో 12 గేట్లకు గాను హైదరాబాద్ వైపు ఆరు గేట్ల నుంచి వాహనాలను అనుమతించారు. చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా 200మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించారు.


చౌటుప్పల్‌లోని 65వ నంబరు జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్!

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స అందించడం లేదని తెలిసి నిరాశ చెందుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు మాత్రం.. తప్పనిసరి పరిస్థితుల్లో డబ్బులు చెల్లించి వైద్య చికిత్స పొందుతున్నట్లు ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ కింద రాష్ట్ర వ్యాప్తంగా 1042 సర్కారు దవాఖానాలు ఉండగా, 368 ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. హైదరాబాద్ పరిధిలో 18-20 వరకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు కూడా ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు అందిస్తున్నాయి. అయితే ఆయా ఆస్పత్రులు అందించిన చికిత్సలకు సంబంధించి సుమారు రూ.1000 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏడాది కాలంగా ప్రభుత్వం వీటిని చెల్లించడంలేదు.

నెలాఖరులోగా బకాయిలు చెల్లించాలంటూ..

పెండింగ్ బిల్లుల విషయాన్ని గుర్తు చేస్తూ తెలంగాణ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ఈ నెల మొదటివారంలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు లేఖ రాసింది. ఈ నెల 10వ తేదీలోగా పెండింగ్ బిల్లులు క్లియర్ చేయకపోతే ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తామని పేర్కొంది. దాంతో నెట్‌వర్క్ ఆస్పత్రులతో ఆరోగ్యశ్రీ ట్రస్టు చర్చలు జరిపి సుమారు రూ.120 కోట్ల వరకు పెండింగ్ బకాయిలను చెల్లించింది. అయితే ఏడాది కాలంగా ఉన్న పెండింగ్ బకాయిల్లో కేవలం 45 రోజులకు సంబంధించినవే చెల్లించారని, మిగిలిన వాటిని కూడా ఈ నెలాఖరులోగా చెల్లించాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు డిమాండ్ చేశాయి. కానీ, దీనిపై వైద్యశాఖ నుంచి స్పష్టత రాకపోవడంతో.. అదే రోజు నుంచి సేవలను నిలిపివేశాయి. వీరి బాటలోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు కూడా చేరనున్నట్లు, త్వరలోనే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, రాష్ట్రవ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన ఆరోగ్యశ్రీ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నెట్‌వర్క్ ఆస్పత్రులు అద్దెలు చెల్లించే పరిస్థితి కూడా లేదని, వైద్య సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని, ఔషధాలు, సర్జికల్స్ సరఫరాదారులు సైతం వాటి సరఫరా నిలిపివేశారని తెలిపింది. ఈ పరిస్థితుల దృష్ట్యా పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, ప్రతినెలా ఆరోగ్యశ్రీ బిల్లులను విడుదల చేయాలని కోరింది.

పేద ప్రజలకు శాపంగా ప్రభుత్వం తీరు: హరీశ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం పేద ప్రజలకు శాపంగా మారిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆస్పత్రులకు పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయిన దుస్థితి నెలకొందని ఒక ప్రకటనలో ఆయన విమర్శించారు. 'ఎక్స్'లోనూ ఈ అంశంపై ట్వీట్ చేశారు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఆస్పత్రులకు వెంటనే బకాయిలు చెల్లించి ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగేలా చూడాలని డిమాండ్ చేశారు.

నీరుగార్చిన వారే మాట్లాడుతున్నారు: దామోదర రాజనర్సింహ

పదేళ్లలో ఆరోగ్యశ్రీని నీరుగార్చిన వారే ఇప్పుడు ఆ పథకం గురించి మాట్లాడటం చూస్తుంటే దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లు ఉందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలపై ఆయన స్పందిస్తూ.. బీఆర్ఎస్ హయాంలో ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించలేదని, ప్యాకేజీల ధరలను రివైజ్ చేయలేదని తెలిపారు. సుమారు రూ.730 కోట్లు బాకీ పెట్టి పోయారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్కో సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ఏడాది కాలంలో పాత బకాయిలు సహా రూ.1130 కోట్లు చెల్లించామని, ప్రతి నెలా బిల్లులు చెల్లిస్తున్నామని వివరించారు. ప్యాకేజీల ధరలను రివైజ్ చేసి 22 శాతం మేర పెంచామన్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులు లేవనెత్తిన ఇతర సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిపై కబ్జా కేసు

» ఆయన సతీమణి, అనుచరులపై కూడా

» గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదు

రాయదుర్గం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డిపై భూకబ్జా కేసు నమోదైంది. కొండాపూర్‌లోని సర్వే నంబర్ 87లో 2 ఎకరాల 30 గుంటల స్థలాన్ని ఆక్రమించారంటూ షేక్ జమీల్ అనే వ్యక్తి ఈ నెల 8న చేసిన ఫిర్యాదుపై గచ్చిబౌలి పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. వైవీ సుబ్బారెడ్డిని ఏ-1గా పేర్కొన్నారు. ఆయన భార్య స్వర్ణలత(ఏ-2)తోపాటు.. అనుచరులు అనీల్‌కుమార్, శివ, నాగిరెడ్డి, మొయిన్‌లను నిందితులుగా పేర్కొన్నారు. సుబ్బారెడ్డి అనుచరులు ఎక్స్‌వేటర్‌తో తమ ప్రహరీ గోడలను కూల్చివేశారని జమీల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా.. అదే రోజు ఉదయం వైవీ సుబ్బారెడ్డి సతీమణి స్వర్ణలత కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొడంగల్‌కు చెందిన గజ్జెల నర్సింహారెడ్డి, అనీల్‌రెడ్డి, సూపర్‌వైజర్ జమీల్ తమ భూమిని ఆక్రమిస్తున్నారంటూ ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరు తమ భూమిలోకి అక్రమంగా చొరబడి, గదులను కూల్చారని వివరించారు. స్వర్ణలత ఫిర్యాదుపైనా కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. డాక్యుమెంట్ల ఆధారంగా రెండు కేసులను దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

» మెదక్ జిల్లా శాలిపేటలో ఘటన

చిన్నశంకరంపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పొలంలో పంటకు నీరు పారించేందుకు బోరు మోటారును ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ రైతు చనిపోయాడు. ఈ ఘటన మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం శాలిపేటలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు నర్ర రమేష్ (47) కొన్నేళ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. ఇటీవల సాగు చేసిన పంటకు నీరు పెట్టేందుకు ఆదివారం ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడ బోరు బావి వద్ద మోటర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయాడు.

రైతుల చావులు సీఎంకు కనిపించడం లేదా?

402 మంది అన్నదాతల మరణాలు ప్రభుత్వ హత్యలే.. భరోసా ఇవ్వడంలో సర్కారు విఫలం

» బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు

» ఆదిలాబాద్‌లో 24 గంటల్లో ఇద్దరు అన్నదాతల మృతిపై ఆవేదన

» రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాకు డిమాండ్



హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చాలని బ్యాంకులు చేస్తున్న వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్న రైతుల చావులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనిపించడం లేదా ? అని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. గడిచిన ఏడాది కాలంలో 402 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఆ మరణాలన్నీ రాష్ట్ర ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఆయన ఓ పోస్టు చేశారు. రుణ భారాన్ని మోయలేక, బ్యాంకు సిబ్బంది వేధింపులు తాళలేక ఆదిలాబాద్‌లో 24 గంటల వ్యవధిలోనే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు భరోసా కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, వరుసగా జరుగుతున్న రైతు ఆత్మహత్యలే ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశారు. కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారని దుయ్యబట్టారు. రుణ మాఫీ కోసం కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూతిరిగి విసిగిపోతున్న రైతులు... భూములు తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని, రూ.500 బోనస్ అని మోసం చేసి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ పరిస్థితి దాపురించిందని వాపోయారు. ఆత్మహత్యలు చేసుకోవద్దని, రైతులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. మరణించిన రైతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఇక, రేషన్ కార్డుల జారీ విషయంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల లక్షల మంది నష్టపోతున్నారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలు సవరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. పౌర సరఫరాల శాఖ జనవరి 11న ఇచ్చిన మెమో ప్రకారం భూపరిమితి, ఆదాయానికి సంబంధించి పదేళ్ల కిందటి నిబంధనలే ఉంచారని పేర్కొన్నారు. ఈ నిబంధనల వల్ల అంగన్‌వాడీలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, చిరుద్యోగులకు రేషన్ కార్డు జారీ అవ్వదని వివరించారు. ద్రవ్యోల్బణం ఆధారంగా ఆదాయ పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డులు ఇస్తామన్న నిబంధనను కూడా మార్చాలని హరీశ్‌రావు కోరారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆరున్నర లక్షల రేషన్ కార్డులు జారీ చేశామని గుర్తు చేశారు. రేషన్‌లో సన్న బియ్యాన్ని ఇవ్వాలని, రేషన్ దుకాణాలను మినీ సూపర్ మార్కెట్లుగా మార్చు చేసి డీలర్లకు రూ.5వేలు గౌరవ వేతనం ఇవ్వాలని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు.

కోర్టులు, మీడియా సమన్వయంతో పనిచేయాలి

» సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్

» విశాఖలో సౌత్ జోన్-2 జ్యుడీషియల్ కాన్ఫరెన్స్



విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోర్టులు, మీడియా పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలని, జవాబుదారీతనంతో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్ పేర్కొన్నారు. విశాఖ బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో సౌత్ జోన్-2 రెండు రోజుల జ్యుడీషియల్ ప్రాంతీయ సదస్సులో ఆదివారం 'జ్యుడీషియరీ అండ్ గవర్నెన్స్ త్రూ ఎమర్జింగ్ అండ్ ఫ్యూచర్ టెక్నాలజీస్, జ్యుడీషియరీ అండ్ మీడియా' అనే అంశంపై పలువురు న్యాయమూర్తులు, విశ్రాంత న్యాయమూర్తులు మాట్లాడారు. ఈ సందర్భంగా జస్టిస్ కురియన్ జోసెఫ్ మాట్లాడుతూ మీడియా అందించే సమాచారం విశ్వసనీయతను కలిగి ఉండాలని, అదే పరస్పర సహకారానికి ప్రామాణికంగా నిలుస్తుందని చెప్పారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్ మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్‌లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, కొన్ని సందర్భాల్లో కోర్టులను, కోర్టు పరిధిలోని అంశాలపై ప్రభావం చూపిస్తున్నాయని అన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి మౌషిమి భట్టాచార్య మాట్లాడుతూ జ్యుడీషియరీ విభాగంలో పనిచేసే వారంతా మీడియాపై, అక్కడ జరిగే పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కోర్టు వ్యవహారాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాత్రపై మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఎం.సుందర్ విశ్లేషించారు. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ముసాక్క్య.. బ్లాక్ చైన్ టెక్నాలజీ గురించి, కేరళ హైకోర్టులో అనుసరిస్తున్న ఏఐ టెక్నాలజీ గురించి తెలియజేశారు.

బీజేపీకి 400 లోక్‌సభ సీట్లొస్తే రాజ్యాంగం ఉండేదికాదు: ప్రొ.హరగోపాల్

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి 400 లోక్‌సభ సీట్లు వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉండేవికాదని ప్రొ.హరగోపాల్ వ్యాఖ్యానించారు. తెలుగు రాష్ట్రాల్లో రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పులో సూచించిన అంశాలపై ఉన్న అపోహలు వాస్తవాలపై 'సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేటలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. మాదిగల వెనుకబాటుకు మాలలు కారణం కాదన్నారు. సుప్రీం తీర్పు రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధమని ప్రొ.కంచె ఐలయ్య విమర్శించారు. ఏకసభ్య కమిషన్‌కు చట్టబద్ధత లేదని న్యాయసమీక్షలో నిలువదని హైకోర్టు సీనియర్ కౌన్సిల్ ఉపేందర్ రావు అన్నారు. ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, ప్రొ.పి.ఎల్ విశ్వేశ్వర్ రావు రాష్ట్ర ప్రభుత్వ చర్యలను సమర్థించారు.

పసుపునకు 15 వేల మద్దతు ధర ప్రకటించాలి

» కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్



నిజామాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పసుపునకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.15 వేలుగా ప్రకటించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం తరపున నిర్వహించిన పసుపు బోర్డు ప్రారంభోత్సవంలో కేంద్ర ప్రభుత్వం కనీస ప్రోటోకాల్ పాటించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులను పిలువకుండానే ప్రారంభోత్సవం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం బీజేపీ ప్రజాప్రతినిధులనే ఆహ్వానించారని ఆమె విమర్శించారు. ఈమేరకు ఆదివారం నిజామాబాద్‌లో కవిత విలేకరులతో మాట్లాడారు. పసుపు బోర్డు ఏర్పాటుతో రైతులకు పూర్తిగా మేలు జరగదని, మద్దతు ధర ప్రకటించడంతో పాటు దిగుమతులు నియంత్రించినప్పుడే పసుపు రైతులకు మేలు జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు పసుపు బోర్డు ఏర్పాటు కోసం అలుపెరగని పోరాటం చేశానని, అప్పుడు ఎంపీ అర్వింద్ రాజకీయాల్లోనే లేరని అన్నారు. ఎంపీగా గెలిస్తే ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని అర్వింద్ బాండ్ పేపర్ రాసి ఇచ్చారని, గెలిచిన తర్వాత పసుపు బోర్డు కంటే స్పైసెస్ బోర్డు బాగుంటుందన్నారని చెప్పారు.

లోయలో పడిన వాహనం
ఒకరి మృతి.. 59 మందికి గాయాలు

» ఆదిలాబాద్ జిల్లా కొత్తపల్లి ఘాట్‌రోడ్డులో ఘటన

» రిమ్స్, ఉట్నూర్ ఆస్పత్రులకు క్షతగాత్రుల తరలింపు

నార్నూర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదివాసుల ఆరాధ్య దైవం జంగుబాయి దర్శనానికి వెళ్తున్న యాత్రికుల వాహనం లోయలోకి బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 59 మంది గాయపడ్డారు. ఇందులో తీవ్ర గాయాలైన 40 మందిని ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. మిగతా వారిని ఆదిలాబాద్‌లోని రిమ్స్, నార్నూర్ ఆస్పత్రుల్లో చేర్చారు. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండలం సూర్యగూడ గ్రామానికి చెందిన 60 మంది ఆదివాసీ భక్తులు ఐచర్ వాహనంలో ఆదివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని ఆదివాసుల ఆరాధ్య దైవం జంగుబాయి దర్శనానికి బయలుదేరారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కొత్తపల్లి (హెచ్)-మల్కుగూడ వద్ద ఉన్న ఘాట్ రోడ్డులో ఒక్కసారిగా వాహనం అదుపు తప్పి బోల్తా పడి లోయలోకి దూసుకెళ్లింది. దీంతో వాహనంలో ఉన్న 59 మందికి గాయాలయ్యాయి. ఇందులో తీవ్రంగా గాయపడిన 40 మందిని ఉట్నూర్ ఆస్పత్రికి, మిగతా వారిని ఆదిలాబాద్‌లోని రిమ్స్ నార్నూర్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ కుమ్రం మాల్కు(62) చనిపోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని నార్నూర్ సీఐ రహీం పాషా తెలిపారు.


ఘాట్ రోడ్డు వద్ద లోయలోకి బోల్తా పడ్డ ఐచర్ వాహనం



తెలంగాణ గృహనిర్మాణ సంస్థ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలి

» ఇందిరమ్మ పాలనలో పేదలందరికీ ఇండ్లు: పొంగులేటి

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షల మేరకు ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగులు పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇందిరమ్మ పాలనలో అర్హులైన పేదలందరికీ ఇళ్లను నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తన క్వార్టర్స్‌లో తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగుల సంఘం(ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు) డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలకు ఇండ్లను నిర్మించే గృహ నిర్మాణ సంస్థను గత ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం గృహ నిర్మాణ సంస్థను క్రమంగా పునరుద్ధరిస్తూ వచ్చిందని, 326 మందిని తిరిగి నియమించడం ద్వారా సంస్థను బలోపేతం చేశామని వెల్లడించారు. పథకం అమలుకు గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది పూర్తిగా సహకరించాలని, మరింత కష్టపడి పనిచేయాలని సూచించారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గవ్వ రవీందర్‌రెడ్డి, బొగ్గుల వెంకటరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డు

» గ్రామ సభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక: భట్టి విక్రమార్క



ఎర్రుపాలెం, జనవరి19 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి నిరుపేద కుటుంబానికి రేషన్ కార్డులు అందిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో సోమవారం (20వ తేదీ) నుంచి గ్రామసభల ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికి అధికారులే వచ్చి సంక్షేమ పథకాలను అందజేస్తారని, ఈ నెల 26 నుంచి సంక్షేమ పథకాలు అమలవుతాయని తెలిపారు. ఆదివారం ఆయన ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకం ద్వారా రెండు దఫాలుగా రూ.12వేలు, రైతుభరోసా కింద సాగు యోగ్యమైన భూములకు రూ.15 వేలు అందిస్తామన్నారు.

వచ్చే నాలుగేళ్లలో మరిన్ని పథకాలు: జూపల్లి

నిజామాబాద్ అర్బన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం నిజామాబాద్‌లో రూ.400 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. నిజామాబాద్‌లో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని అన్నారు. ఏడాదిలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తమ ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేయబోతుందన్నారు. ఆ తర్వాత ఐదేళ్ల పాటు తమ ప్రభుత్వమే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీలకు బీఆర్ఎస్ పైసా ఇవ్వలే

» మేం రూ.12 వేలు ఇస్తామంటే ఓర్వడం లేదు: సీతక్క

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉపాధి కూలీలకు పైసా ఇవ్వలేదని, తమ ప్రభుత్వం వారికి రూ.12వేల సాయం ఇచ్చేందుకు చర్యలు చేపడితే.. దానిపై తప్పుడు లెక్కలతో దుష్ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టో ప్రకారం అర్హులైన ఉపాధి కూలీ కుటుంబాలకు రెండు విడతల్లో రూ.12వేలు ఇస్తామని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం పట్ల దేశమంతా ఆసక్తి చూపుతుంటే.. తెలంగాణలోని కొన్ని రాజకీయ శక్తులు తప్పుడు గణాంకాలతో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని బీఆర్ఎస్‌ను ఉద్దేశించి విమర్శించారు. కూలీలకు ఆర్థిక చేయూతనందిస్తుంటే ఓర్వలేక అక్కసు వెళ్లగక్కుతుందని ధ్వజమెత్తారు. భూమి లేని ఉపాధి కూలీ కుటుంబాలు 6 లక్షలకుపైగా ఉంటాయని అంచనాలు ఉన్నాయని, వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామన్నారు.

సంస్కృతిని కాపాడుకోవడం అభినందనీయం

» మెల్‌బోర్న్ సంక్రాంతి సంబరాల్లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్.. ఆదివారం నాడు మెల్‌బోర్న్ తెలుగు అసోసియేషన్ నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశం వదిలి ఆస్ట్రేలియాకు వచ్చినా తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం అభినందనీయమన్నారు. ఇక్కడ ఉన్న తెలుగు పారిశ్రామికవేత్తలు.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి.. అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఏఐపీవోసీ సదస్సుకు స్పీకర్,మండలి చైర్మన్

బిహార్ రాజధాని పట్నాలో సోమ, మంగళవారాల్లో జరగనున్న ఆలిండియా ప్రిసైడింగ్ ఆఫీసర్స్ కాన్ఫరెన్సులో పాల్గొనేందుకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ ఆదివారం బయలుదేరివెళ్లారు. వారితోపాటుగా ఏపీ స్పీకర్ అయన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు వెళ్లారు.

ఆర్‌అండ్‌బీలో ఏఈఈలకు పదోన్నతులు!

» 118 మందితో జాబితా.. త్వరలో ఉత్తర్వులు

» మంత్రి కోమటిరెడ్డి చొరవతో మార్గం సుగమం

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖలోని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఏఈఈ)హోదాలో ఉన్న 118 మందికి డిప్యూటీ ఇంజనీర్లు (డీఈ)గా పదోన్నతులు కల్పించేందుకు రంగం సిద్ధమైంది. పదోన్నతులకు సంబంధించిన కసరత్తును ఉన్నతాధికారులు పూర్తి చేసి ఇప్పటికే జాబితాను సిద్ధం చేశారు. త్వరలోనే పదోన్నతుల ఉత్తర్వులు విడుదలకానున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే.. ప్రస్తుతం పదోన్నతి పొందుతున్న 118 పోస్టులకు సంబంధించి కొత్త వారితో భర్తీకి చర్యలు తీసుకోవాలంటూ ఆర్ అండ్ బీ అధికారులు టీజీపీఎస్సీకి లేఖ రాయాలని నిర్ణయించినట్టు తెలిసింది. అయితే ఏఈఈ నుంచి డీఈలుగా కొంతమందికి పదోన్నతులు దక్కుతుండగా.. డీఈ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు (ఈఈ), ఈఈ నుంచి సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) పోస్టుల్లో పదోన్నతుల కోసం మాత్రం ఎదురు చూడాల్సిన పరిస్థితులున్నాయి. ఇందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితా రాకపోవడమే కారణంగా కనిపిస్తోంది. అక్కడి నుంచి సీనియారిటీ జాబితా వస్తే.. మరి కొంతమందికి పదోన్నతులు లభించనున్నాయి. కాగా, గత ప్రభుత్వం ఏళ్ల తరబడి శాఖ సర్వీస్ రూల్స్‌ను ఖరారు చేయకుండా పెండింగ్‌లో పెట్టడంతో.. అప్పట్నుంచి పలు హోదాల్లోని ఉద్యోగులకు పదోన్నతులు దక్కలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆర్ అండ్ బీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉద్యోగుల పదోన్నతులు, సర్వీస్ రూల్స్‌పై దృష్టి సారించారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడారు. సర్వీస్ రూల్స్ ఖరారుకు సీఎం ఆమోదం తెలపడంతో.. పదోన్నతులకు మార్గం సుగమమైంది.

ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ అవకాశం!

» కొత్త రేషన్ కార్డులు, మార్పులకు కూడా..

» రేపటి నుంచి గ్రామ సభల్లో స్వీకరణ

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం మరోసారి దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డులు, కార్డుల్లో మార్పులు, కుటుంబ సభ్యుల చేరికల కోసం మళ్లీ దరఖాస్తులు తీసుకోనుంది. అయితే, గత ఏడాది నిర్వహించిన ప్రజాపాలన, ఇటీవల నిర్వహించిన కులగణనలో ఈ వివరాలను వెల్లడించని వారికి ఇప్పుడు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించనున్న గ్రామసభల్లో ప్రజలు దరఖాస్తులు చేసుకునేందుకు సర్కారు అవకాశం కల్పించింది. ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు.వీటితోపాటు ఇందిరమ్మ ఆత్మీయభరోసా కింద కూలీల కుటుంబాలకు అందించబోయే ఆర్థికసాయాన్ని మహిళల ఖాతాల్లో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

కుటుంబ పెద్ద వారీగా వివరాలు..

కొత్త రేషన్‌కార్డులు, లేదా ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు, సభ్యుల మార్పులు, చేర్పుల కోసం తాజాగా దరఖాస్తులను తీసుకోవడంలో జాగ్రత్తగా వ్యవహరించాలని సీఎస్ సూచించారు. గ్రామసభల్లో తీసుకోబోయే దరఖాస్తుల్లో ముఖ్యంగా కుటుంబ పెద్దతో పాటు కుటుంబ సభ్యుల వివరాలు, సభ్యులందరి ఆధార్ నంబర్లు, కులం, ఫోన్ నంబరు సహా పూర్తి చిరునామా తీసుకుంటారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. రాష్ట్రంలో రేషన్‌కార్డులు లేని కుటుంబాలు 6,68,309 ఉన్నాయని కులగణనలో భాగంగా ఈ నెల 18 నాటికి ప్రభుత్వానికి అందిన వివరాల్లో తేలింది. ఇదే విషయాన్ని కలెక్టర్లకు పంపిన జాబితాలో పేర్కొన్నారు. అయితే ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డుల్లో సభ్యుల చేర్పులు, మార్పులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు 12,07,895 ఉండగా, వీటి ద్వారా 18,01,033 సభ్యులు ఉన్నారు. వీటిలో కొన్ని పరిశీలన జరగ్గా, మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. సభ్యుల చేర్పులు, కొత్త కార్డుల కోసం మొత్తం 18,76,204దరఖాస్తులు రాగా, వీటి ద్వారా 29,66,085 మంది సభ్యులకు లబ్ధి చేకూరనుంది. ఇవికాక కొత్తగా ఎవరైనా రేషన్ కార్డుల కోసం లేదా మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఇక ఇందిరమ్మ ఇళ్ల విషయంలోనూ ఇదే విధానాన్ని అనుసరించనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో సోమవారం నాటికి సర్వే పూర్తవనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి వచ్చిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 18,68,572 మందికి ఇళ్ల స్థలాలు ఉండగా, 11,60,979మందికి స్థలాలు లేనట్లు గుర్తించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వానికి 80.54 లక్షల దరఖాస్తులు రాగా వీటిలో ఇప్పటివరకు ఇళ్ల స్థలం ఉన్నవారు, లేని వారు కలిపి 30,29,551 మంది ఉన్నట్లు తేలగా, మిగిలిన 50.24లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఈనెల 24 వరకు తీసుకోబోయే దరఖాస్తులపైనా అభ్యంతరాలను స్వీకరించనున్నారు. ఆ తర్వాత అర్హుల జాబితాను సిద్ధం చేస్తారు. ఇందుకు సంబంధించిన సూచనలను విడిగా ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు.

భారీ ఐటీ పార్కు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న ఈ కంపెనీ.. ప్రపంచస్థాయి రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఒకటిగా ఉంది. కాగా, క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతించడంతోపాటు ఈ కంపెనీ చేపట్టే కొత్త ఐటీ పార్కు నిర్మాణం హైదరాబాద్ అభివృద్ధిలో మరో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. కంపెనీ ప్రతినిధి గౌరీ శంకర్ నాగభూషణం మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ అన్ని రంగాల్లో సుస్థిరంగా వృద్ధి చెందుతోందని, తమ సంస్థ కార్యకలాపాలను తెలంగాణలో విస్తరించడం సంతోషంగా ఉందని తెలిపారు. క్యాపిటల్ ల్యాండ్ సంస్థ ఇప్పటికే హైదరాబాద్‌లో అంతర్జాతీయ టెక్‌పార్కు (ఐటీపీహెచ్), అవాన్స్ హైదరాబాద్, సైబర్ పెరల్ పార్కులను చేపట్టింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన 25 మెగావాట్ల ఐటీ లోడ్ డేటా సెంటర్ ఈ ఏడాది మధ్యలో అందుబాటులోకి రానుంది. ఐటీపీహెచ్ రెండో దశ ఈ ఏడాదిలో ప్రారంభమై 2028 నాటికి పూర్తికానుందని సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. సింగపూర్ పర్యటనలో భాగంగా మూడోరోజు సీఎం రేవంత్‌రెడ్డి బృందం.. అక్కడి ప్రధాన వ్యాపార సంస్థల అధినేతలు, సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ (ఎస్‌బీఎఫ్) ప్రతినిధులతో ముఖాముఖి సంభాషణలు, చర్చలు జరిపింది. ఇండియన్ ఓసియన్ గ్రూప్ ఫౌండర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) ప్రదీప్తో బిశ్వాస్, డీబీఎస్ కంట్రీ హెడ్ లిమ్‌హిమ్ చౌన్, డీబీఎస్ గ్రూప్ హెడ్ అమిత్‌శర్మ, బ్లాక్‌స్టోన్ సింగపూర్ సీనియర్ ఎండీ, చైర్మన్ గౌతమ్ బెనర్జీ, బ్లాక్‌స్టోన్ రియల్ ఎస్టేట్ సీనియర్ ఎండీ పెంగ్‌వీ టాన్, మెయిన్ హార్ట్ గ్రూప్ సీఈవో ఒమర్ షాజాద్‌తో రేవంత్‌రెడ్డి బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, ప్రభుత్వ విధానాలను సీఎం రేవంత్ వారికి వివరించారని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. దీంతో.. రాష్ట్రానికి పెట్టుబడులు, కంపెనీలను తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు అధికారులతో కూడిన 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం చేపట్టిన మూడు రోజుల పర్యటన విజయవంతంగా ముగిసింది. ఆదివారం రాత్రి ఈ బృందం స్విట్జర్లాండ్‌లోని దావోస్‌కు బయలుదేరింది. దావోస్ వేదికగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే 'ప్రపంచ ఆర్థిక ఫోరం' వార్షిక సదస్సులో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఈ సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ వేదికపై తెలంగాణలో కంపెనీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయనున్నారు.



సింగపూర్ బిజినెస్ ఫెడరేషన్ ప్రతినిధులతో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

సింగపూర్ నుంచి రూ.3950 కోట్ల పెట్టుబడులు..

సింగపూర్ నుంచి తెలంగాణకు దాదాపు రూ.3,950 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం సింగపూర్‌లో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఈ మేరకు పెట్టుబడులు సాధించింది. పెట్టుబడులు, ఒప్పందాలతోపాటు సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)తో స్కిల్స్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం కీలక పరిణామం. కాగా, హైదరాబాద్‌లో రూపుదిద్దుకోనున్న ఫ్యూచర్ సిటీలో అత్యాధునిక ఏఐ ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డేటా సెంటర్ ముందుకు వచ్చింది. ఇందుకోసం రూ.3,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. రాష్ట్రంలో సెమీ కండక్టర్ల తయారీ, పెట్టుబడుల అవకాశాలపై సింగపూర్ సెమీ కండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్‌తో జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి.



హుజూర్‌నగర్‌లో హౌసింగ్ మోడల్ కాలనీ పనులు పరిశీలిస్తున్న ఉత్తమ్

కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు ఇస్తాం

పాత కార్డులను తొలగించం..బీఆర్ఎస్ ప్రచారాలు నమ్మొద్దు

పదేళ్లలో ఆ పార్టీ ఇచ్చింది 40 వేల కార్డులే: మంత్రి ఉత్తమ్

హుజూర్‌నగర్/పాలకవీడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేయనుందని, దీంతో నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. పాత కార్డులను రద్దు చేసే ప్రసక్తే లేదని, అవసరమైతే కుటుంబ సభ్యుల పేర్లు చేరుస్తామని చెప్పారు. ఈ నెల 26న ప్రారంభించే కొత్త కార్డుల పంపిణీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని హౌసింగ్ మోడల్ కాలనీ పనులను ఆయన పరిశీలించారు. పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా వద్ద ఎత్తిపోతల పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రేషన్ కార్డుకు అర్హత ఉండి రాని చివరి వ్యక్తి నుంచి కూడా దరఖాస్తు స్వీకరించి, కార్డు అందించేలా సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులందరం నిరంతరం పనిచేస్తున్నామన్నారు. రేషన్ కార్డులు లేని వారు, దరఖాస్తు చేయనివారు, అర్హత ఉన్న ప్రతిఒక్కరూ గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దేశ చరిత్రలో నిలిచిపోయేలా రేషన్ కార్డులు మంజూరు చేయబోతున్నామని, ఈ నెల 26న ఆరంభం మాత్రమేనని, అంతం కాదన్నారు. రేషన్ కార్డులు తొలగిస్తారంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చింది కేవలం 40 వేల కార్డులు మాత్రమేనన్నారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు తర్వాత.. ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యం ఇస్తే నాణ్యత లేక ప్రజలు తినలేక కోళ్ల దాణాకు, ఇతర అవసరాలకు వినియోగించారని, కొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలించారన్నారు. జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని జవహర్ జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకంగా పేరు మారుస్తున్నామని తెలిపారు.

పోలీసు శాఖలో భారీగా బదిలీలు?!

» కసరత్తు చేస్తున్న ఉన్నతాధికారులు

» శాఖలో ప్రక్షాళన జరిగే అవకాశం

» పని తీరు ఆధారంగానూ మార్పులు

» సీఎం విదేశాల నుంచి రాగానే నిర్ణయం

హైదరాబాద్, జనవరి19 (ఆంధ్రజ్యోతి) పోలీసు శాఖలో భారీ స్థాయిలో బదిలీలకు రంగం సిద్ధమైంది. డీఎస్పీలు, అదనపు ఎస్పీలు, పలువురు ఐపీఎస్ అధికారులను విడతల వారీగా బదిలీ చేయడానికి ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి రాగానే ఈ శాఖలో ప్రక్షాళన జరగవచ్చని తెలుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది రెండు, మూడు సార్లు మాత్రమే పోలీసుల బదిలీలు జరిగాయి. ప్రధానంగా వివిధ జిల్లాల్లో పని చేస్తున్న డీఎస్పీ స్థాయి అధికారులపై ఎమ్మెల్యేల నుంచి ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం. మరోవైపు కొందరు జిల్లా ఎస్పీల పనితీరు ఆశించిన విధంగా లేదని నిఘావర్గాల నుంచి ప్రభుత్వానికి సమాచారం అందినట్లు తెలుస్తోంది. కొన్ని జిల్లాల్లోని పోలీసు ఉన్నతాధికారులపై అవినీతి ఆరోపణలు డీజీపీ కార్యాలయానికి చేరినట్లు సమాచారం. కమిషనరేట్లలో పనిచేస్తున్న కొందరు ఏసీపీలపై సైతం నిఘా వర్గాల నుంచి ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు అందాయని తెలుస్తోంది.

అదనపు బాధ్యతలతో మార్పులు

మరోవైపు డీజీపీ కార్యాలయంలో సైతం కొంత మంది అధికారులు తమ విభాగంతో పాటు పలు విభాగాల బాధ్యతను అదనంగా చూడాల్సి రావడంతో కొన్ని మార్పులు తప్పవని పోలీసు వర్గాలు ద్వారా తెలుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి హోంశాఖను కూడా చూస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకుల నుంచి చాలామంది పోలీసులపై ఏకంగా సీఎంకే ఫిర్యాదులు అందినట్లు సమాచారం. అవినీతి ఆరోపణలు వచ్చినపుడు అవి బయటపడిన సమయంలో ఒకరిద్దరు పోలీసు అధికారులపై తక్షణమే చర్యలు తీసుకున్నా చాలా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుస్తోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న క్రమంలో ఆ లోపే పోలీసుల బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కొత్తగా ఏర్పాటు చేసిన యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ వింగ్‌లను బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విభాగాల్లో ఇంకా సీనియర్ అధికారుల కొరత ఉన్న నేపథ్యంలో బదిలీల్లో సమర్థులైన పోలీసు అధికారులను ఈ విభాగాలకు కేటాయించనున్నారని తెలుస్తోంది. కొంతమంది పోలీసు అధికారులు ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో కొనసాగుతున్నారని ఎస్ఐగా ఏ జోన్‌లో పనిచేశారో అక్కడే ఏసీపీలు అయ్యారని, ఇలాంటి వారిని అదే ప్రాంతంలో కొనసాగించడం వల్ల అవినీతి, సివిల్ దందాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఫిర్యాదులు పోలీసు ఉన్నతాధికారులకు అందినట్లు తెలుస్తోంది.

ఆ విధ్వంసం మర్చిపోండి మూడింతల అభివృద్ధి సాధిస్తాం

» చంద్రబాబుకు మోదీ కొండంత అండ

» 6 నెలల్లోనే ఏపీకి 3 లక్షల కోట్లు

» ఎన్డీఆర్ఎఫ్ వేడుకల్లో అమిత్ షా

అమరావతి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసం గురించి చింతించొద్దు. ఏపీ అభివృద్ధిలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొండంత అండగా ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నారు. ఇద్దరి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మూడింతల ప్రగతి సాధిస్తుంది' అని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారు. ఆదివారం విజయవాడ సమీపంలోని కొండపావులూరు వద్ద జరిగిన ఎన్డీఆర్ఎఫ్ 20వ వ్యవస్థాపక వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్డీఆర్ఎఫ్ ప్రాంగణంలో నిర్మించిన ఎన్ఐడీఎం దక్షిణ సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ వస్తుందని, మానవ విధ్వంసం నుంచి కాపాడేందుకు ఎన్డీయే ముందుంటుందని వ్యాఖ్యానించారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే రాష్ట్రానికి మూడు లక్షల కోట్ల రూపాయల సహకారం అందించామన్నారు. అమరావతి నిర్మాణానికి నిధులిచ్చామని, 2028 నాటికి పోలవరం ప్రాజెక్టు నీళ్లు రాష్ట్రంలోని పొలాల్లో పారిస్తామన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా రైల్వే జోన్ ఏర్పాటైందని, తాజాగా విశాఖ ఉక్కుకు ఊతమిచ్చి ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచామని అమిత్ షా పేర్కొన్నారు.



ఎన్డీఆర్ఎఫ్ వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, చిత్రంలో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, కేంద్ర మంత్రులు రామ్మోహన్, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, అనిత

ఏపీకి కేంద్రం తోడ్పాటు

'అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ఆర్థిక నిర్వహణలో మంచి అనుభవం ఉన్న చంద్రబాబు కష్టానికి కేంద్రం తోడ్పాటు ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిన రాజధాని అమరావతికి గడిచిన ఆరు నెలల్లోనే 27 వేల కోట్ల రూపాయల భరోసాతో ఏపీ ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచాం. ఇటీవలే రాష్ట్రపతి చేతుల మీదుగా ఎయిమ్స్ ప్రారంభమైంది. రాష్ట్రంలో రూ.1.20 లక్షల కోట్లతో జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు' అని అమిత్ షా వెల్లడించారు.

ఎన్డీఆర్ఎఫ్ సేవలు భేష్

'గతంలో ఒడిశాలో తుపాన్లు వస్తే వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఇటీవల రెండు తుపాన్లు వచ్చినా ఎన్డీఆర్ఎఫ్ ముందస్తు ప్రణాళికతో ఎదుర్కోవడం వల్ల ఒక్క ప్రాణం కూడా పోలేదు. మోదీ పాలనలో జీరో క్యాజువాలిటీ లక్ష్యం నిర్దేశించుకుని పని చేస్తున్నాం. విపత్తుల్లో చిక్కుకున్న ప్రజలు ఎన్డీఆర్ఎఫ్ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తుల్ని చూడగానే ధైర్యం వచ్చిందని నాకు చాలా చోట్ల చెప్పారు. జపాన్, నేపాల్, మయన్మార్, టర్కీ తదితర దేశాల అధ్యక్షులు సైతం ఎన్డీఆర్ఎఫ్ సేవల్ని కొనియాడారు' అని అమిత్ షా వివరించారు.

పోలీస్ అకాడమీలో ఇండోర్ షూటింగ్ రేంజ్

వర్చువల్‌గా ప్రారంభించిన అమిత్ షా

హైదరాబాద్, జనవరి 19(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో ఇంటిగ్రేటెడ్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌ను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు. ఆదివారం ఈ షూటింగ్ రేంజ్‌ను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. స్వయంగా హాజరు కావాల్సి ఉన్నా.. సమయాభావం వల్ల ఆయన రాలేకపోయారు. ఇంటిగ్రేటెడ్ ఇండోర్ షూటింగ్ రేంజ్‌లో ఒకేసారి పది మంది శిక్షణ పొందవచ్చు. 50మీటర్ల పొడవు, పది వరుసల్లో ఈ షూటింగ్ రేంజ్ ఉంటుంది. ఆధునిక తుపాకుల వినియోగంపై ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ అమిత్ గర్గ్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్ రావాల్సిందే

ఆర్థిక వ్యవస్థ గాడిన పడాలంటే అదొక్కటే మార్గం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నాయి

» 6 గ్యారెంటీలు అమలయ్యాకే రాహుల్ రాష్ట్రానికి రావాలి

» బీజేపీతోనే తెలంగాణలో ప్రజా పాలన సాధ్యం: కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్/సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ గాడిన పడాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే ఉద్యమకారులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం పదేళ్లుగా నీతి, నిజాయితీ, జవాబుదారీతనంతో పనిచేస్తోందని వివరించారు. మోదీ దేశ ఆర్థిక వ్యవస్థను మోదీ గాడిలో పెట్టారని.. తెలంగాణలో కూడా ఆర్థిక వ్యవస్థ గాడిన పడాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ దోపిడీ నుంచి తెలంగాణను రక్షించుకునేందుకు బీజేపీకి మద్దతివ్వాలని కిషన్‌రెడ్డి కోరారు. ఖైరతాబాద్, హిమాయత్‌నగర్‌కు చెందిన వివిధ పార్టీల నేతలు ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అనవసర విషయాలపై పరస్పర ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీ, అవినీతి, అక్రమాలకు ఆ రెండు పార్టీలే కారణమని అన్నారు. నాడు కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టితే.. నేడు రేవంత్ కూడా అదే పని చేస్తున్నారని మండిపడ్డారు. అవినీతి, కుంభకోణాల్లో ఇరుక్కుపోయిన బీఆర్ఎస్.. తన అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు, కేసుల నుంచి బయటపడేందుకే పరిమితమైందని అన్నారు. ఆరు గ్యారెంటీలను ప్రకటించిన రాహుల్‌గాంధీ.. వాటిని అమలు చేసిన తర్వాతే తెలంగాణలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై రాహుల్ గాంధీ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది జనవరి 26 వరకు భారత రాజ్యాంగ గౌరవ ఉత్సవాలు నిర్వహిస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ఎలా దుర్వినియోగం చేసిందో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తామని చెప్పారు.



భక్తజనసందోహంగా మారిన కొమురవెల్లి ఆలయ ప్రాంగణం

కొమురవెల్లిలో హోరెత్తిన పట్నంవారం

- హైదరాబాద్ నుంచి పోటెత్తిన భక్తులు
- మల్లన్న స్వామికి, ఎల్లమ్మ తల్లికి బోనాలు

చేర్యాల, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లిలో పట్నంవారం! ఈ వేడుక కోసమే హైదరాబాద్ నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తారు. మల్లనస్వామికి పచ్చ, సునేరు, తెల్లపిండి, కుంకుమ, పసుపుతో పటం పరిచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన ఈ పట్నంవారం ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. డప్పు చప్పుళ్లు, డోలుపై ఢిల్లెం కల్లెం మోతల మధ్య శివసత్తుల శివాలు, పోతరాజుల విన్యాసాలతో ఆలయ పరిసరాలు హోరెత్తాయి. మల్లన్నకు, స్వామివారి సహోదరి ఎల్లమ్మ తల్లికి భక్తులు బోనాలు తీశారు. తాము బస చేసిన చోట, ఆలయ గంగరేగు చెట్టు వద్ద, ముఖమండపంలో మల్లన్న స్వామికి చిలుక పట్నం, నజరు, ముఖమండప పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంకొందరు మొక్కులతో గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. సంతానం కలిగించాలంటూ మహిళలు వల్లుబండ వద్ద వరంపట్టారు. పట్నంవారం సందర్భంగా ఆదివారం బోనాలు సమర్పించిన భక్తులు సోమవారం ఆలయ తోటబావి ప్రాంగణంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలు నిర్వహిస్తారు. కాగా సౌకర్యాల లేమి కారణంగా భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

తిరుమలలో ముగిసిన వైకుంఠ ద్వార దర్శనాలు

- పది రోజుల్లో దాదాపు 6.83 లక్షల మందికి దర్శనం

తిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి వైకుంఠ ద్వారాలు మూతపడ్డాయి. పదిరోజుల పాటు దాదాపు 6.83 లక్షల మంది శ్రీవారిని దర్శించుకుని.. ఉత్తరద్వార ప్రవేశం చేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈ నెల పదో తేదీన వైకుంఠ ద్వారాలను తెరిచిన విషయం తెలిసిందే. గతేడాది తరహాలోనే పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించారు. చివరిగా ఆదివారం అర్ధరాత్రి ఏకాంతసేవతో వైకుంఠ ద్వారాలను మూసివేశారు. ఇక, సోమవారం నుంచి యధావిధిగా దర్శనాలు ప్రారంభం కానున్నాయి.

ఎన్‌కౌంటర్‌పై సుప్రీం జడ్జితో విచారణ చేపట్టాలి

- సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్

మహబూబాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ (మావోయిస్టు) రాష్ట్ర కార్యదర్శి బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి ఆదివారం ఆయన ఓ ప్రకటన పంపించారు. ఈ నెల 16న ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చొక్కారావుతో పాటు మరో 17 మంది మావోయిస్టులు చనిపోయారని చెప్పారు. దేశ సంపదను కాపాడేందుకు పోరాడుతున్న ఆదివాసీలు, ఉద్యమకారులకు సంఘీభావం ప్రకటించాలని ప్రజలను కోరారు.

పటాన్‌చెరు @ 11 డిగ్రీలు

- గ్రేటర్ హైదరాబాద్‌లో పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో చలి తీవ్రత పెరిగింది. రాత్రిళ్లు కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో పాటు చలిగాలుల తీవ్రత పెరగడంతో శివారు ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. శనివారం పటాన్‌చెరులో అత్యల్పంగా 11 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పలు ప్రాంతాల్లో సాధారణం కంటే 2-3 డిగ్రీలు తక్కువగా నమోదవుతుండటంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. తెల్లవారుజామున ప్రధాన రహదారులను పొగమంచు కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం మరో రెండు రోజుల పాటు ఇలాగే ఉంటుందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శేరిలింగంపల్లిలో 11.3, మల్కాజిగిరిలో 12.1, రామచంద్రాపురంలో 12.2, రాజేంద్రనగర్‌లో 13, చార్మినార్‌లో 13.4, అల్వాల్‌లో 13.8 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ బాధ్యత తీసుకుంటా

- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి ఇలవేల్పు నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కొనియాడారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఘాట్ నిర్వహణపై ఎన్టీఆర్ కుటుంబసభ్యులు, అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేయడంపై ఎమ్మెల్యే గాంధీ స్పందించారు. ఈ విషయంపై హెచ్ఎండీఏ అధికారులతో మాట్లాడి సమాచారం తీసుకున్నానని, సిబ్బంది నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆదివారం తెలిపారు. ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణ బాధ్యతలు తాను తీసుకుంటానని, ఈ విషయాన్ని సీఎం రేవంత్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు.ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి వేడుకలు చేపట్టేలా తన వంతు ప్రయత్నం చేస్తానని గాంధీ పేర్కొన్నారు.

సీఆర్‌పీఎఫ్ డీజీగా జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్



న్యూఢిల్లీ, జనవరి 19: సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ నియమితులయ్యారు. ఇంతవరకు ఈ పదవిలో ఉన్న అనీష్ దయాల్ సింగ్ డిసెంబరు 31న పదవీ విరమణ చేశారు. 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సింగ్ ప్రస్తుతం అస్సాం డీజీపీగా పనిచేస్తున్నారు. జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ ఈ పదవిలో 2027 నవంబరు 30 వరకు కొనసాగనున్నారు.

భాగ్యనగరం.. సాహిత్యమయం

ఈ నెల 24నుంచి 26వ తేదీ వరకు హైదరాబాద్ సాహితీ మహోత్సవం

షబానా ఆజ్మీ యాభై ఏళ్ల సినీ ప్రస్థానం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు

చర్చాగోష్ఠుల్లో అమోల్ పాలేకర్, సిద్ధార్థ్, అరుణా రాయ్, హర్షమందిర్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జనవరి19(ఆంధ్రజ్యోతి): శాస్త్ర, సాంకేతిక, సాహిత్య, సాంస్కృతిక రంగాల మేలు కలయికగా హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ 3 రోజుల పాటు జరగనుంది. ఈనెల 24న సత్వా నాలెడ్జ్ సిటీలో ఈ సమావేశాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించనున్నారు. సాహితీ సదస్సులు, కావ్యధార, ఫొటో, పెయింటింగ్స్ ఎగ్జిబిషన్స్, పుస్తక రచయితలతో సంభాషణ ఇలా 15రకాల విభాగాల్లో పలు రంగాలకు చెందిన 270మందికిపైగా ప్రముఖులు పాల్గొంటున్నారని ఫెస్ట్ డైరెక్టర్ కిన్నెర మూర్తి తెలిపారు. కాగా, నటి షబానా ఆజ్మీ సినీ స్వర్ణోత్సవ సంబురాలకు హైదరాబాద్ సాహితీ మహోత్సవం వేదిక కానుంది. ఈ నెల 24న ఉదయం షబానాతో చర్చాగోష్ఠి జరగనుంది. తర్వాతి రోజుల్లో ప్రముఖ సామాజికవేత్త అరుణారాయ్‌తో సంభాషణ, నటుడు సిద్ధార్థ్, పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్ కీలకోపన్యాసం చేస్తారు. రాజ్యాంగ విలువలు అంశంపై ప్రముఖ గాంధేయవాది హర్షమందర్, బాపూజీ మనుమడు రాజమోహన్‌గాంధీ ప్రసంగించనున్నారు. వాతావరణ మార్పులపై సంభాషణ, అంతరించి పోతున్న భాషల పరిరక్షణ అంశాలపై ప్రత్యేక సదస్సులు జరగనున్నాయి. సీనియర్ శాస్త్రవేత్తలు సమావేశాల్లో పాల్గొంటారని ఫెస్టివల్ డైరెక్టర్ విజయకుమార్ చెప్పారు.

లిథువేనియా ప్రతినిధి ప్రత్యేక ఆకర్షణ

ఈ ఏడాది లిథువేనియా దేశ సాహితీ వేత్తలు అతిథులుగా పాల్గొంటున్నారు. ఆ దేశ రాయబారి డయానా మికెవిసీన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. సంస్కృతంపై పరిశోధనలు చేసిన డయానా ప్రధాన వక్తగా 'లిథువేనియా - సంస్కృత' భాష నిఘంటువుమీద ప్రత్యేక చర్చాగోష్ఠి జరగనుంది. అంతరించిపోతున్న భాషల పరిరక్షణమీద అజిత్ మొహంతీ, మహేంద్రకుమార్ మిశ్రా తదితర భాషావేత్తలతో సమావేశాలకు హెచ్ఎల్ఎఫ్ వేదిక కానుంది. ప్రముఖ మోడల్ హర్యామా ఖురేషీ, ప్రఖ్యాత రచయిత్రి అనితా నాయర్, నటుడు అమోల్ పాలేకర్, ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, సామాజికవేత్త సునీతా కృష్ణన్ తదితరులు కీలకోపన్యాసం చేయనున్నారు. సింధీ భాషా సంస్కృతులపై చర్చాగోష్ఠి జరగనుంది. సాంస్కృతిక కార్యక్రమాలు టీ హబ్ ప్రాంగణంలో, మిగతా చర్చాగోష్ఠులు, సదస్సులు సత్వా నాలెడ్జ్‌సిటీలో నిర్వహిస్తారు.

ప్రపంచశ్రేణి మెట్రో హబ్‌గా జేబీఎస్!

30 ఎకరాల్లో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటు!.. ప్రైవేటు ఆస్తుల సేకరణను తగ్గించే విధంగా చర్యలు

- 'నాగోల్-ఎయిర్‌పోర్టు' అనుసంధానంగా మేడ్చల్, శామీర్‌పేట్ రూట్లు
- బేగంపేట విమానాశ్రయం రన్‌వే కింద 600 మీటర్ల సొరంగం
- హెచ్ఏఎంఎల్ అధికారుల పరిశీలన



హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నార్త్ సిటీ మెట్రో కారిడార్లను వినూత్నంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు జూబిలీ బస్ స్టేషన్ (జేబీఎస్)ను ప్రపంచ స్థాయి మెట్రో హబ్‌గా అభివృద్ధి చేయనున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి హైదరాబాద్ మహా నగరానికి వచ్చే ప్రజలతోపాటు ప్రస్తుతం నార్త్‌సిటీ నిర్వాసితుల రాకపోకలు, ఇతర అవసరాలను తీర్చేందుకు జేబీఎస్‌ను మెట్రో హబ్‌గా మార్చనున్నారు. ఈ మేరకు జేబీఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించాలని భావిస్తున్నారు. ప్రధానంగా ప్యారడైజ్- మేడ్చల్, జేబీఎస్- శామీర్‌పేట్ మార్గాలను నాగోల్-ఎయిర్‌పోర్టు కారిడార్‌కు అనుసంధానంగా తీర్చిదిద్దేందుకు అడుగులు వేస్తున్నారు. మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా పార్ట్-ఏ కింద నాగోల్-ఎయిర్‌పోర్టు (36.8 కి.మీ.), రాయదుర్గ్- కోకాపేట్ నియోపొలిస్(11.6 కి.మీ.), ఎంజీబీఎస్- చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ), మియాపూర్-పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్బీ నగర్-హయత్‌నగర్ (7.1 కి.మీ.) ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అలాగే పార్ట్-బీ కింద శంషాబాద్-ఎయిర్‌పోర్టు (40 కి.మీ.), జేబీఎస్-శామీర్‌పేట్ (22 కి.మీ.), ప్యారడైజ్-మేడ్చల్ (23 కి.మీ.) ప్రతిపాదించారు. ఉత్తర ప్రాంత వాసుల డిమాండ్ మేరకు మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్లను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం మూడు నెలల్లోపు రెండింటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను తయారు చేయాలని హెచ్ఏఎంఎల్ అధికారులను ఆదేశించిన నేపథ్యంలో వారు వడివడిగా ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆధ్వర్యంలో చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్‌మోహన్, జనరల్ మేనేజర్లు బీఎన్ రాజేశ్వర్, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలకృష్ణ, డిప్యూటీ సీఈ (రైల్వేస్) జేఎన్ గుప్తా, ఇతర సీనియర్ అధికారులు రెండు కారిడార్లలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.

పరిశీలనలో గుర్తించిన అంశాలు

- బేగంపేట విమానాశ్రయ సరిహద్దు వెంబడి ప్యారడైజ్ నుంచి బోయినపల్లివరకు రోడ్డు వంపు ఎక్కువగా ఉండడంతోపాటు విమానాశ్రయ అధికారుల ఆంక్షల కారణంగా హెచ్ఎండీఏ తన ఎలివేటెడ్ మార్గాన్ని కొంతదూరం పాటు భూగర్భ మార్గంగా మార్చుకున్నట్లు గుర్తించారు. ఈ అలైన్‌మెంట్‌ను విమానాశ్రయం రన్‌వే కింద 600మీటర్ల సొరంగం ద్వారా తీసుకువెళ్తుంది.
- హెచ్ఎండీఏ మార్గానికి అనుసంధానంగా రెండు లెవల్స్ పైన ఉండే డబుల్ ఎలివేటెడ్ మెట్రో మార్గాన్ని ఈ భూగర్భ సొరంగంలోకి దింపి, మళ్లీ రెండు లెవల్స్ ఎలివేటెడ్ మార్గంగా పైకి తీసుకురావడం అనేది ఇంజనీరింగ్ పరంగా అనేక సమస్యలను సృష్టిస్తుంది.
- సీఎం రేవంత్ సూచనల ప్రకారం మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్ల ప్రారంభ స్థానాన్ని జేబీఎస్ వద్ద కలపనున్నారు. ఇక్కడ ప్రపంచస్థాయి మెట్రో హబ్‌ని ఏర్పాటు చేయనున్నారు.
- బేగంపేట విమానాశ్రయం కింద భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకువెళ్లే ఆవశ్యకతను నివారించేలా ప్రైవేట్ ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించే విషయంపై అధ్యయనం చేశారు.
- ప్యారడైజ్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట కారిడార్ల అలైన్‌మెంట్లను వీలైనన్ని ఎక్కువ నివాస కాలనీలకు, వాణిజ్య, వ్యాపార కేంద్రాలకు ప్రయోజనకరంగా ఉండే విధంగా తీర్చిదిద్దాలని భావించారు. ఇక్కడ ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ/రక్షణ భూములను సేకరించి ప్రయాణికులకు మెరుగైన పార్కింగ్ సౌకర్యాన్ని కల్పించాలని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.
- జేబీఎస్ వద్ద ప్రారంభంలో రెండు మెట్రో కారిడార్లను కలిపితే బేగంపేట విమానాశ్రయం దిగువన సొరంగం ద్వారా మెట్రో అలైన్‌మెంట్‌ను తీసుకెళ్లాల్సిన పరిస్థితిని నివారించవచ్చని గుర్తించారు. బోయినపల్లి రోడ్డు చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చని, అక్కడ నుంచి ఇప్పటికే విస్తరించిన ఎన్‌హెచ్ సర్వీస్‌లేన్‌పై మెట్రో స్తంభాలు, వయాడక్టును జాతీయ రహదారుల సంస్థ నిర్మిస్తున్న ఫ్లైఓవర్లకు అంతరాయం కలగకుండా నిర్మించవచ్చని, మేడ్చల్-జేబీఎస్-ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట- విమానాశ్రయ లింక్ కూడా దీనికి ఏర్పడుతుందని గుర్తించారు. తద్వారా60 కిలోమీటర్ల సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటు సాధ్యమవుతుందని వెల్లడించారు.
- జేబీఎస్-శామీర్‌పేట్ మెట్రో అలైన్‌మెంట్‌లో భాగంగా సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో ఉన్న ప్రస్తుత మొదటి మెట్రో పిల్లర్ నుంచి డబుల్ ఎలివేటెడ్ స్ట్రక్చర్‌గా కరీంనగర్ హైవేపై హెచ్ఎండీఏ నిర్మించబోయే ఎలివేటెడ్ కారిడార్‌పైకి నేరుగా పొడిగించవచ్చని ఎండీ చెప్పారు.

చివరి దశకు కాళేశ్వరం విచారణ!

- కేసీఆర్, హరీశ్, ఈటలకు నేడు సమన్లు?
- హైదరాబాద్ చేరుకున్న జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ చివరి దశకు చేరింది. ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్న జస్టిస్ ఘోష్ మంగళవారం నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునఃప్రారంభించనున్నారు. ఇప్పటికే ఆయన పలు దఫాలుగా క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. ఇదే చివరి విడత కావచ్చని అధికార వర్గాలు తెలిపాయి. గతంలో నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కాలేకపోయిన ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును ఈసారి కమిషన్ ప్రశ్నించనుంది. దీంతో అధికారుల విచారణ పూర్తవుతుంది. బ్యారేజీల నిర్మాణ సంస్థల ప్రతినిధులతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆడిట్ నిర్వహించి నివేదిక రూపొందించిన కాగ్ అధికారులను సైతం కమిషన్ ప్రశ్నించనుంది. చివర్లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, నాటి ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ కోసం పిలవనున్నట్లు తెలుస్తోంది. సోమవారం వీరికి సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో సంబంధమున్న నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్‌సీలు, ఇతర కీలక ఇంజనీర్లు, రిటైర్డ్ ఇంజనీర్లతో పాటు ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను కమిషన్ ఇప్పటికే ప్రశ్నించిన సంగతి తెలిసిందే. బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చడంతో పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ స్థలాల ఎంపిక, ఇతర అంశాల్లో కేసీఆర్, హరీశ్‌రావు కీలక నిర్ణయాలు తీసుకున్నారని ఇప్పటికే పలువురు అధికారులు వాంగ్మూలం ఇచ్చారు. వారందరి నుంచి సేకరించిన సాక్ష్యాధారాలతో కేసీఆర్, హరీశ్‌ను కమిషన్ ప్రశ్నించనుంది. ఇక జస్టిస్ ఘోష్ కమిషన్ గడువు ఫిబ్రవరితో పూర్తి కానుంది. మార్చి లేదా ఏప్రిల్‌లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించే అవకాశం ఉంది.

నేటి నుంచే దావోస్ సదస్సు

- ఐదు రోజులపాటు నిర్వహణ.. పెట్టుబడులపై భారత్ భారీ ఆశలు

దావోస్, జనవరి 19: స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పెట్టుబడుల/ఆర్థిక సదస్సు- 2025 ప్రారంభంకానుంది. ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు, దిగ్గజ పారిశ్రామిక వేత్తలు పాల్గొనే ఈ సదస్సుపై భారత ప్రభుత్వం భారీ ఆశలే పెట్టుకుంది. ఈ నేపథ్యంలో గతానికి భిన్నంగా ఈసారి ఐదుగురు కేంద్ర మంత్రులతో కూడిన పెద్ద బృందాన్నే దావోస్‌కు పంపింది. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించేలా ఈ సదస్సులో భారత్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఇక, ఈ సదస్సుకు ముగ్గురు ముఖ్యమంత్రులు, పలు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, అదేవిధంగా వంద మందికిపైగా సీఈవోలు హాజరు కానున్నారు. "ప్రధాని మోదీ అవలంబిస్తున్న ఆర్థిక విధానాలు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, భారత్ ప్రత్యేకంగా రూపొందించిన సరికొత్త డిజిటల్ ఇండియా కార్యక్రమాలను ఈ వేదిక ద్వారా ప్రపంచ దేశాలకు వివరించనున్నాం" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు అశ్వినీ వైష్ణవ్‌తో పాటు సీఆర్ పాటిల్, చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌధరి, కింజరాపు రామ్మోహన్‌నాయుడు హాజరవుతారు. అదేవిధంగా ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, దేవేంద్ర ఫడణవీస్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సహా పలు రాష్ట్రాల మంత్రులు పాల్గొననున్నారు. పెట్టుబడులకు భారత్ గమ్యస్థానమనే అంశాన్ని కేంద్రం సదస్సులో ప్రధానంగా ప్రస్తావించనుంది. 130 దేశాల నుంచి 3 వేల మంది నాయకులు, 1600 మంది వ్యాపార దిగ్గజాలు, 120మంది టెక్ దిగ్గజాలు సదస్సుకు హాజరుకానున్నారు.

పేదల హక్కుల కోసం 'వైట్ టీషర్ట్' ఉద్యమం

- ప్రారంభించిన రాహుల్.. అసమానతలను వ్యతిరేకించేవారు పాల్గొనాలని పిలుపు

న్యూఢిల్లీ, జనవరి 19: పేదలు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ.. 'వైట్ టీషర్టుల ఉద్యమాన్ని' ప్రారంభించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'ఆర్థికన్యాయంలో మీకు విశ్వాసం ఉంటే, సంపద అసమానతలను మీరు వ్యతిరేకిస్తే, సామాజిక సమానత్వం కోసం పోరాడాలనుకుంటే, అన్ని రకాల వివక్షలు అంతం కావాలని భావిస్తే, దేశంలో శాంతి, స్థిరత్వం నెలకొనాలని ఆకాంక్షిస్తే.. తెల్లరంగు టీషర్టును ధరించి ఈ ఉద్యమంలో పాలుపంచుకోండి' అని పిలుపునిచ్చారు. వివరాల కోసం whitetshirt.in/home వెబ్‌సైట్‌ను సందర్శించాలని, 9999812024 నెంబరుకు మిస్డ్‌కాల్ ఇవ్వాలని సూచించారు. ఇదిలా ఉండగా, దేశ సార్వభౌమ అధికారాన్ని, సమగ్రతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేశారంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అస్సాంలోని గువాహటిలో కేసు నమోదయింది. ఈ నెల 15న ఢిల్లీలో రాహుల్ చేసిన ప్రసంగంపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ మొంజిత్ చెతియా అనే వ్యక్తి పాన్‌బజార్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

త్వరలో పాడ్ కార్లు!

(మొదటిపేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకువచ్చే దిశలో వడివడిగా అడుగులు వేస్తోంది. హైటెక్‌సిటీ, కొండాపూర్, మాదాపూర్, రాయదుర్గం పరిసర ప్రాంతాల్లోని మెట్రోస్టేషన్లు, కార్యాలయాలు, బహుళ అంతస్తులకు పాడ్ కార్ల సేవలను రెండు కారిడార్లలో అందుబాటులోకి తీసుకురావాలని హెచ్ఎంఆర్ఎల్ భావిస్తోంది. మెట్రో స్టేషన్‌కు అనుసంధానంగా ప్రారంభమయ్యేలా మొదటి ఎలివేటెడ్ కారిడార్(8.8 కిలోమీటర్లు)ను రూ.880 కోట్ల అంచనాతో నిర్మిస్తారు. ఈ కారిడార్ రాయదుర్గం మెట్రో-ఐటీసీ కోహినూర్-నాలెడ్జ్‌సిటీ మధ్య ఉంటుంది. ఈ కారిడార్‌లో 28 స్టాప్‌లు ఉంటాయి. రూ.600 కోట్ల అంచనాతో రెండో కారిడార్(6 కిలోమీటర్లు)ను నిర్మిస్తారు. ఈ కారిడార్ 27 స్టాప్‌లతో రాయదుర్గం మెట్రో-టెక్‌మహీంద్రా-హైటెక్‌సిటీ/కొండాపూర్ మధ్యలో కొనసాగుతుంది. నిజానికి గత సర్కారు హయాంలోనే పాడ్ కార్లను ప్రతిపాదించారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి మైండ్‌స్పేస్-ఐటీసీ కోహినూర్(7.5 కిలోమీటర్లు), అసెంబ్లీ మెట్రో నుంచి సచివాలయం మీదుగా ప్యారడైజ్ స్టేషన్ వరకు(10 కిలోమీటర్లు) రెండు కారిడార్లను ప్రతిపాదించారు. 2022 వార్షిక నివేదికలోనే అప్పటి సర్కారు అల్ట్రా పీఆర్టీ లిమిటెడ్‌తో హెచ్ఎంఆర్ఎల్ ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు తెలిపింది. అయితే.. అప్పట్లో ఆ ప్రాజెక్టు ప్రతిపాదనలకే పరిమితమైంది. తాజాగా ప్రభుత్వం ఐటీకారిడార్‌లో ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది.



రూట్లు: రాయదుర్గం-కొండాపూర్, రాయదుర్గం-నాలెడ్జ్ సిటీ

మొత్తం స్టాప్‌లు: 55

మొత్తం దూరం: 14.8 కిలోమీటర్లు

గరిష్ఠ వేగం: గంటకు 40 కిలోమీటర్లు

మూడేళ్లలో..అందుబాటులోకి వచ్చే అవకాశం

ఎలా పనిచేస్తుంది?

పాడ్‌కార్ బ్యాటరీ లేదా విద్యుత్తుతో పనిచేస్తుంది. పర్యావరణ హితంగా ఉంటుంది. ఇందులో 6-8 మంది ప్రయాణించవచ్చు. కేంద్రీకృత నియంత్రణ వ్యవస్థ ద్వారా పనిచేస్తుంది. వీటిల్లో డ్రైవర్లు ఉండరు. ప్రయాణికులు ఇందులో కూర్చోగానే.. తమ గమ్యస్థానాన్ని ఎంచుకోవడానికి టచ్‌ప్యాడ్లు ఉంటాయి. హెచ్ఎంఆర్ఎల్ డీపీఆర్ ప్రకారం.. ట్రాఫిక్ రద్దీ వేళల్లో ఈ పాడ్‌కార్ల ద్వారా గంటకు 10 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాన్ని చేరుకుంటారని, రోజువారీగా ఈ సంఖ్య లక్షగా ఉంటుందని అంచనా. ఈ రకమైన వ్యవస్థతో హైదరాబాద్‌లో పట్టణ రవాణా మరింత అభివృద్ధి చెందుతుందని హెచ్ఎంఆర్ఎల్ అభిప్రాయపడుతోంది. ప్రస్తుతం ముంబైలోని బాంద్రా-కుర్ల కాంప్లెక్స్ మధ్య పాడ్‌కార్ కారిడార్ వ్యవస్థ నిర్మితమవుతోంది. గ్రేటర్ నోయిడా నుంచి నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద రూ.810 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ సిద్ధమైంది.

కబ్జాకోరల్లో ఆగ్రోస్ భూములు!

మౌలాలిలోని 24 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు.. బెల్లంపల్లిలో కబ్జాకు గురైనట్లు అధికారుల నివేదిక

- త్వరలో రంగంలోకి హైడ్రా.. హైదరాబాద్‌కే పరిమితం!

హైదరాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ(టీజీ-ఆగ్రోస్) కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు ఇదే పరిస్థితి..! గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మౌలాలిలో 24 ఎకరాల్లో ఆక్రమణకు గురై.. అక్రమ నిర్మాణాలు జరగ్గా.. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లిలో ఏకంగా 543 ఎకరాలు కబ్జా అయ్యాయి. ఈ మేరకు ఆగ్రోస్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. హైడ్రాను కూడా ఆశ్రయించారు. అయితే.. హైడ్రా మాత్రం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని భూముల రక్షణపై భరోసానిస్తూ.. రంగంలోకి దిగింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మౌలాలి భూముల కబ్జాలపై విచారణకు ఆదేశించారు.

హైదరాబాద్‌లో విలువైన భూమి

గ్రేటర్ హైదరాబాద్‌లో భూముల విలువ రూ. కోట్లలోనే ఉంటుంది. ఆగ్రోస్‌కు చెందిన 23 ఎకరాల 28 గుంటల భూమి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మౌలాలిలో ఉంది. మౌలాలి రైల్వేస్టేషన్‌కు అత్యంత సమీపంలో.. సర్వే నంబర్లు 29/1, 31లో ఉన్న ఈ భూములు హైదరాబాద్ జిల్లాలోని మారేడ్‌పల్లి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ మండలాల తహసీల్దార్ల పరిధిలో ఉంది. ఆగ్రోస్ అధికారులు ఈ భూములకు ఎలాంటి రక్షణ గోడను నిర్మించలేదు. దాంతో రియల్టర్లు, స్థానికులు, భూబకాసురుల కన్ను ఈ భూములపై పడింది. కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టగా.. మరికొందరు ఇళ్లను నిర్మించుకున్నారు. నిజానికి 1975లో హైదరాబాద్ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్(హెచ్‌సీఎఫ్ఎల్) నుంచి ఆగ్రోస్ ఈ భూమిని సేకరించింది. అయితే.. ఇప్పటి వరకు ఆగ్రోస్ పేరిట మ్యుటేషన్ కాలేదు. రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ హెచ్‌సీఎఫ్ఎల్ పేరిటే ఈ భూములున్నాయి. మ్యుటేషన్ కాకపోవడంతో.. ఆగ్రోస్ ఇప్పటి వరకు నిర్మాణాలను చేపట్టకపోవడం.. కబ్జాదారులకు వరంగా మారింది. ఈ భూముల కబ్జాపై హైడ్రా విచారణకు ఆదేశించింది. త్వరలో ఆక్రమణలను తొలగించి, ఆగ్రోస్ భూములను కాపాడేందుకు సిద్ధమవుతోంది. ఒకట్రెండ్రోజుల్లో హైడ్రా బృందం మౌలాలిలో సర్వే నిర్వహించనుంది.

- మేడ్చల్ జిల్లా బాలానగర్ మండలం చింతల్‌లోని సర్వే నంబర్లు 221, 222లోనూ ఆగ్రోస్‌కు 10 ఎకరాల భూమి ఉండగా.. కొంత భాగం కబ్జాకు గురైంది.
- హైదరాబాద్ జిల్లా షేక్‌పేట్‌లోని సర్వే నంబర్ 403లో 687 గజాలను కూడా కబ్జాదారులు కబళించేందుకు యత్నించగా.. ఆగ్రోస్ ఇటీవల కంచె నిర్మించి, బోర్డును ఏర్పాటు చేసింది. ఇక్కడ 'ఆగ్రోస్ భవన్'ను నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది.

బెల్లంపల్లి భూములు దైవాధీనం?

ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లిలోని సర్వే నెంబర్లు 18/19, 18/26, 18/27లో ఆగ్రోస్‌కు 543 ఎకరాల 15 గుంటల భూమి ఉంది. ఇది ఆక్రమణకు గురైందని ఆగ్రోస్ అధికారులు ఇటీవలే గుర్తించి, ప్రభుత్వానికి ఒక నివేదికను సమర్పించారు. అయితే ఆ భూమిని ఎవరు కబ్జా చేశారు? అక్కడ ఎలాంటి నిర్మాణాలున్నాయి? ఎంత భూమి కబ్జాకు గురైంది? మిగిలిన భూమి ఎంత? అనే వివరాలు ఆగ్రోస్ వద్ద లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీకి చెందిన నేతలను ఆగ్రోస్ చైర్మన్‌గా నామినేట్ చేస్తుంటారు. నష్టాల్లో ఉన్న ఆగ్రోస్‌లో వసతులు పొందడం తప్ప.. పాలక మండలి ఆస్తుల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీసీఎండీగా వ్యవసాయ శాఖ నుంచి సీనియర్ అధికారి ఉంటారు. రాష్ట్రస్థాయిలో మేనేజర్లు, రీజినల్ మేనేజర్లు, వివిధ హోదాల్లో అధికారులు పనిచేస్తున్నా.. ఆగ్రోస్ నిర్వహణ, ఆస్తుల పరిరక్షణపై దృష్టి సారించకపోవడం గమనార్హం..!

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.